# జ్ఞాన దర్శిని

సంపుటి : 1 అక్టోబర్ - డిసెంబర్ 1995 సంచిక : 3

జ్ఞాన, విజ్ఞాన, కర్మ, భక్తి, హఠ, రాజ, పూర్ణ యోగాలు వివరించె ఆధ్యాత్మిక త్రైమాస పత్రిక



THE SAINT AND THE SCIENTIST Prof. SWAMI JNANANANDA TRUST,
SRI RAMA JNANAMANDIR, GORAGANAMUDI - 534 244

# ప్రేమాంజలి

(మొదటి పద్యమునకు తాత్పర్యము)

శ్రీ స్వామిజ్ఞానానంద
**"Love Offerings" :**
ఆంగ్లకవితకు అనువాదం :
శ్రీ భూపతిరాజు పద్మనాభరాజు

నాప్రభూ నీ హస్తముల, దేశము హద్దులేనిది
ఆహా!నీ మానసాంతరమున, కాలము అనంతము
నీ హృదయమున కారణవృత్తులు నిరంతరము
స్పందించుచు సుతి కలుపుచున్నవి
అవి కొలచుటకు, లెక్కించుటకు ఎవరితరము?
ఆహా! నీ అనంత సుతిలయలలో
బ్రహ్మాండము ఊగులాడుచున్నది
ఆలపింపని నీ రాగలయలో
ఓ ప్రభూ! నీవాడనైన నన్ను నీ రాగలయలతో
పాడుము, ఆడుము అని ఆజ్ఞాపించుచుంటివి
కాని ఆహా! నీ రాగాలాపన వినగలుగు చెవులు లేవు
నీ లయకు తగిన నృత్యభంగిమము లేదు
నీ గాన సుధను గ్రోలుటకు, హృదయమునకు చైతన్యము పోయినది
దృష్టిలేని నేత్రము మతిలేనిదై మైకము పొందిన స్థితిలో నున్నది
అహంకారసంద్రము ఆశతో కప్పబడి అందు
మునిగి ఉక్కిరిబిక్కిరై చావనుంటిని
ఓ స్వామి, నా ప్రభూ నా హృదయ
మానసములందు శక్తి, బలము నశించినవి
ఎచ్చట చూచినను దౌర్బల్యము
మృత్యువు తాండవించుచున్నవి, నిస్సహాయుడను
తిరస్కరించకుము, మృతజీవిని, యీసడింపకుము
అశక్తుడను, నిస్సహాయుడను
నీ గృహద్వారమున పడియున్న నన్ను
మరువకుము, విడనాడకుము
ఓ దేవా! నా హృదయమున ప్రేమజ్యోతిని వెలిగింపుము
ప్రేమజ్యోతితో వెలిగింపబడిన
హృదయము తన్మయత్వము నొంద
ఈ జారెడు ఆనంద బాష్పములతో ఒక మాలను కూర్పనిమ్ము
ఈ మాల అల్పమైనను అమూల్యమైనది,
ఏలనన దీనితో నీదయను పొందవచ్చు
అట్టి ఆనంద బాష్పములతో కూర్పబడిన
మాలతో నిన్నలంకరింపనిమ్ము
అట్టి మాలయొక్క ప్రతిబీజము, నా పెదవులై
మధురమైనటువంటివి, ఘనమైనటువంటివి
ఓ ప్రభూ! నిన్ను ముద్దిడకొననిమ్ము.

# THE SCIENTIST



సైన్సు కాంగ్రెస్ - కలకత్తా - 1938

విద్యాంచాఽవిద్యాంచ యస్తద్వేదోభయగ్ం సహ ॥
అవిద్యయా మృత్యుం తీర్త్వా విద్యయాఽమృత మశ్నుతే ॥

గౌరవ సంపాదకులు

శ్రీ భూపతిరాజు పద్మనాభరాజు,
గొరగనమూడి

సంపాదకులు

డా॥ అక్కిరాజు రమాపతి రావు

సంపాదక సలహా మండలి

శ్రీ దంతులూరి బాపిరాజు
కోపల్లె

శ్రీమతి డా॥ వి. ఉషారాజు ఎం.డి., U.S.A.

ప్రొ. ఎ. లక్ష్మీనారాయణ - న్యూక్లియర్ ఫిజిక్స్
డిపార్ట్‌మెంట్
ఆంధ్రా యూనివర్సిటీ, వాల్తేరు

డా. ఎ.వి. నరసింహరాజు ఎం.ఎ., పిహెచ్.డి.,
గుంటూరు

శ్రీ పి.హెచ్. జగన్మోహన్
సంస్కృతోపాధ్యాయుడు.
శ్రీ స్వామి జ్ఞానానంద హైస్కూల్,
గొరగనమూడి

శ్రీ పి.హెచ్. చెన్నకృష్ణయ్య
సికింద్రాబాద్

శ్రీ కె. సూర్యనారాయణ రాజు
సికింద్రాబాద్

శ్రీ పి.వి.ఆర్. రాయుడు,
హైదరాబాద్



ప్రచురణ:

The Saint and the Scientist
Prof.Swami Jnananda Trust,
Sri Rama Jnanamandir,
Goraganamudi - 534 244
West Godavari Dt.


# జ్ఞానదర్శిని


సంచిక :1 సంపుటి :3

అక్టోబర్ - డిసెంబర్ 1995


## శ్రీ స్వామి జ్ఞానానంద శతజయంతి ప్రత్యేక సంచిక

## ఈ సంచికలో....


| | |
|---|---|
| సంపాదకీయం - | |
| జ్ఞానానందోపాసనా - | |
| శ్రీ స్వామీజీకుటుంబవృత్తాంతం - | 3 |
| వేదవిజ్ఞానం - శాస్త్రవిజ్ఞానం | 4 |
| శ్రీ స్వామీజీని గూర్చి కొన్ని దివ్యస్మృతులు - | 8 |
| శ్రీ స్వామి జ్ఞానానంద | 9 |
| కర్మయోగము - | 12 |
| ప్రబోధం - | 13 |
| శ్రీ స్వామీజీ దివ్యసూక్తులు - | 16 |
| శ్రీ స్వామీజీ సన్నిధిలో నా అనుభూతులు | 18 |
| ఆధ్యాత్మిక మార్గదర్శకులు | |
| శ్రీ జ్ఞానానందజీ మహరాజ్ - | 20 |
| సన్నిధివంటి శ్రీ స్వామీజీ సన్నిధి - | 2[illegible] |
| సంకల్పసిద్ధి - | 28 |
| జ్ఞానదర్శిని - దివ్యదర్శిని - | 32 |
| జ్ఞానగీతిక - | 35 |
| హిమవన్నగ యోగిపుంగవుడు - | 45 |
| Foreword - | 52 |
| The Unique Integrator Purna Jnanananda A Centenary Homage - | 54 |
| What Swamiji means to me - | 60 |
| సంపాదకులకు లేఖ - | 62 |


ప్రత్యేక సంచిక మూల్యం రు. 15/-

## GURUDEVA

For Ever I Salute my master own
Sri Jnanananda the Effulgent one
Whose grace and goodness verily destroy
The ignorance and this our nescience both
Om tat sat

# BRAHMAN

**I meditate and meditate upon**
**That Brahman who is this, the Self-Supreme,**
**Eternal, partless, beyond time and space,**
**And secondless, attributeless, endless,**
**Without change, without modification,**
**Existence-Knowledge-Bliss, All Absolute,**
**And Self-Illumined beyond speech and mind.**

**- SWAMI JNANANANDA**

## సంపాదకీయం

## శ్రీ స్వామి జ్ఞానానంద శతజయంతి

భారతీయ సంస్కృతి చిరంతనమైనది. ఇహమూ పరమూ మొదటి నుంచీ రెండు కండ్లలాగా చూసుకొంటూనే వచ్చింది. చతుర్విధ పురుషార్థాలు మానవ జీవితంలో పరమ ప్రాప్యాలని చెప్పింది. ఐహిక జీవితం పట్ల ఏ విధమైన నిరాసక్తతను, అనాసక్తతను కనపరచ లేదు. బ్రహ్మసత్యం, జగన్మిథ్య అని శంకర భగవత్పాదుల వారు ప్రతిపాదించడం జగత్తును కూడా బ్రహ్మమని భావించవలసి ఉంటుందని ప్రబోధించడమని భగవాన్ శ్రీ రమణమహర్షి పలుసార్లు ప్రస్తావించారు. సృష్టిలో సమస్త జీవరాసికీ నిరామయమైన అనాకులమైన సుఖస్థితినే వాంఛించింది భారతీయ సంస్కృతి. ఎవరూ దుఃఖభాగులు కాకుందురు కాక అనే ఆశాసించింది. 'సర్వేచ సుఖినస్సంతు । సర్వేసంతు నిరామయాః । సర్వే భద్రాణి పశ్యంతు । మాకశ్చిద్దుఃఖభాగ్భవేత్ ॥ అనే పరమార్థాన్నే వాంఛించింది.

వేదకాలంలోనే కాదు వేల సంవత్సరాల నుంచీ భారతదేశంలో నేటికీ మహర్షులు, ఆధ్యాత్మిక దివ్య విభవ తపస్సంపన్నులు అవతరిస్తూనే ఉన్నారు. పుణ్యనదులవలె, పవిత్ర తీర్థాల వలె ప్రకాశిస్తూనే ఉన్నారు. మానవులకు జన్మచారితార్థ్యాన్ని ప్రబోధిస్తూనే ఉన్నారు. గంగా యమునలు, కృష్ణా గోదావరులు, హిమాలయాలు భారతీయ సంస్కృతి భావుకులను పులకింప

చేస్తాయి. భారతీయులు మహారాజాధి రాజులకన్నా చక్రవర్తుల కన్నా పరివ్రాజకులను, యతులను, ఆధ్యాత్మిక వేత్తలను అధికంగానే గౌరవిస్తారు. తరతరాలుగా వారి స్మృతిని అర్చిస్తారు.

ఆధునిక కాలంలో ఈ శతాబ్దంలో అటువంటి గొప్ప సంఘటన ఒకటి సంభవించింది. అది స్వామి జ్ఞానానంద ఆవిర్భావం. ఆధునిక కాల ఆధ్యాత్మిక దివ్య ప్రబోధ వాహిక ఇంగ్లీషే కాబట్టి స్వామి జ్ఞానానంద కూడా ఇంగ్లీషు ద్వారానే తమ ఆధ్యాత్మిక దివ్యోన్నత్యాన్ని ప్రసారంచేశారు. ప్రాచ్య పాశ్చాత్యాలను ఏకం చేసిన వసుధైక కుటుంబం అనే జగన్మంగళదాయకమైన భావనను పరిపుష్టం చేయవలసిన అవసరం ఇపుడెంతైనా ఉంది. అందువల్ల ఆధునిక కాలపు సంస్కృతం అంటే ఇంగ్లీషే అని భావించవలసి ఉన్నది. ఇప్పటి కాలంలో శ్రీ శంకర భగవత్పాదుల వారు ఆవిర్భవించి ఉన్నా వారు ప్రస్థాన త్రయానికి భాష్యం ఇంగ్లీషులోనే కూర్చేవారేమో ననుకోవాల్సి వస్తుంది. అందుకే శ్రీరామతీర్థ స్వామి, స్వామి వివేకానంద, అరవిందమహర్షి,జిడ్డుకృష్ణమూర్తి, తమ ప్రబోధాన్ని ఇంగ్లీషు మాధ్యం ద్వారానే నిర్వహించారు.

భారతీయ సూత్ర వాఙ్మయ సంపుటిలో సద్గురు శ్రీ స్వామి జ్ఞానానంద పూజ్యపాదుల పూర్ణసూత్ర 'రచనకు విశిష్టమైన స్థానమున్నది. రాబోయే కాలంలో 'పూర్ణసూత్ర' మహత్వం ఆవిష్కృతమవుతుంది. శ్రీ స్వామి జ్ఞానానంద భక్తి జ్ఞాన కర్మయోగాలలో పరిపూర్ణులు. అందువల్లనే పూర్ణసూత్రాలను అనుసంధానం చేయగలిగారు.

హిమాలయ తపోభూములలో ప్రకృతిని తాదాత్మ్యీకరించుకున్నారు శ్రీ స్వామి జ్ఞానానంద. వేదకాలపు ఋషుల వలె వారు ప్రకృతి పురుషుల దివ్య తత్త్వాన్ని ఉపాసించారు. ఋక్కుల వంటి కవితలు కూర్చారు. అంతర్జాతీయ స్థాయిని చూచినా భగవత్కవులలో వారు గొప్పకవులతో పోల్చవలసినవారు. శ్రీస్వామి జ్ఞానానంద కవితలలో తత్త్వదర్శనం, ప్రకృతి సౌందర్యం వెల్లివిరుస్తాయి. తాత్త్విక దార్శనిక ప్రతిభాపూర్ణులైన ఆధునిక భారతీయ కవులలో ఆయన రవీంద్ర, అరవిందుల సమస్కంధులు. 'గ్లింప్సెస్' అనే వారి ఇంగ్లీషుకవితా సంపుటి వారి కవితా దార్శనికతను వ్యక్తీకరిస్తుంది. 'ఫిలాసఫీ ఆఫ్ యోగ' 'దార్శనిక మహా ప్రవచన' వంటి వారి రచనలలో వారి షడ్దర్శనపారంగత్వం, వేదాంతానుభూతి ద్యోతక మవుతాయి.

శ్రీ స్వామి జ్ఞానానంద ఆధునిక ఋషులలో విశిష్టులు. జ్ఞాన విజ్ఞాన సమన్వయం సాధించారు. శ్రీ భూపతిరాజు లక్ష్మి నరసింహరాజుగా పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం సమీపాన గొరగనమూడి అనే చిన్న పల్లెటూరులో శ్రీ భూపతిరాజు శ్రీరామరాజు, సీతయ్యమ్మ పుణ్యదంపతులకు **1896** డిసెంబర్ **5**వ తేదీన జన్మించిన ఈ మహాభాగుడు నేపాల్ సరిహద్దుల గండకీ నదీతీరంలో, రాజపుతాన పర్వత శిఖరంలో, హిమాలయ సానుసీమలలో అఖండ తపోనిరతులై ఆ తర్వాత జర్మనీ, జెకొస్లోవేకియా, ఇంగండ్, అమెరికాలలో పరమాణు భౌతిక విజ్ఞాన శాస్త్రంలో అనేక పరిశోధనలు చేసి గొప్ప విజ్ఞాన శాస్త్రవేత్తగా పేరు తెచ్చుకున్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయ అణుభౌతిక విజ్ఞాన శాస్త్ర సంస్థాపక ఆచార్యులైనారు. సుమారు పది సంవత్సరాలు భారతీయ పరమాణు శాస్త్ర విజ్ఞాన వ్యాపనానికి సారథ్యం వహించారు. జాతీయ, అంతర్జాతీయ శాస్త్ర విజ్ఞాన సదస్సులలో మార్గదర్శనం చేశారు. ఎన్నో పరిశోధన పత్రాలు 'హైవాక్యువా' 'ఎలిమెంట్స్ ఆఫ్ న్యూక్లియర్ ఫిజిక్స్' వంటి విజ్ఞాన శాస్త్ర గ్రంథాలు ప్రకటించారు.

అయితే వారు ఆశ్రమ స్థాపనకు కాని, వ్యవస్థీకృతమైన ప్రబోధ ప్రచారాలకు కాని సుముఖత ఎన్నడూ ఎప్పుడూ చూపలేదు. వారి జీవితమే భక్తియోగ పరమార్థం. జ్ఞానమార్గ ప్రబోధం. కర్మమార్గ సందేశం. రాజయోగ విరాజితం.

ఈ మహనీయుని శతజయంతి వత్సరమిది. ఈ మార్గశిర శుద్ధ పాడ్యమి నవంబర్ **23, 1995** శతజయంతి ప్రారంభోత్సవం. భారతీయ ప్రధాన నగరాలలోను ఈ శతజయంతి నిర్వహించటానికి శతజయంత్యుత్సవ సన్నాహక సంఘం సంకల్పించింది.

# జ్ఞానానందోపాసనా!

శ్రీ స్వామి ప్రజ్ఞానానంద,
చిదానందాశ్రమమ్, పశివేదల

శ్లో|| పూర్ణసూత్రప్రదం దేవం పూర్ణవిజ్ఞాన విగ్రహమ్ ।
ఆధారం సర్వభక్తానాం - జ్ఞానానంద ముపాస్మహే ॥

పూర్ణానందప్రదం దేవం పరమానంద విగ్రహమ్ ।
పూర్ణరూపధరం దేవం జ్ఞానానంద ముపాస్మహే ॥

సర్వాభీష్టప్రదం దేవం సర్వమంగళ విగ్రహమ్ ।
సర్వకారుణ్యపాథోధిం జ్ఞానానంద ముపాస్మహే ॥

స్వప్రకాశమయం దేవం విశ్వభాసకరూపిణమ్ ।
తారకం సర్వభూతానాం జ్ఞానానంద ముపాస్మహే ॥

సత్స్వరూపమయం దేవం పరమాత్మాన మద్వయమ్ ।
సర్వాధ్యక్షం నిజం దేవం జ్ఞానానంద ముపాస్మహే ॥



స్వామి ప్రజ్ఞానానంద

# శ్రీ స్వామీజీ కుటుంబ వృత్తాంతం

శ్రీమతి భూపతిరాజు అన్నపూర్ణమ్మ

[శ్రీ స్వామి జ్ఞానానంద పూర్వాశ్రమంలో సోదరులు శ్రీభూపతిరాజు పద్మనాభరాజు గారు. శ్రీపద్మనాభరాజుగారి ఇల్లాలు శ్రీమతి అన్నపూర్ణమ్మ గారు. శ్రీ స్వామిజీని గూర్చి తమ జ్ఞాపకాలు వినిపించవలసిందిగా కోరినప్పుడు ఆ గొప్ప కుటుంబంలో సంస్కారమహితమైన తమ అనుభవాలను వారు వివరించిన క్రమమిది. సం||]

నేను మొట్టమొదటిసారి శ్రీ స్వామీజీని రాజమండ్రిలో దర్శించాను. అప్పటికి నాకు తొమ్మిదేళ్ళ వయసే. అప్పటికి నా పెళ్ళికాలేదు. భూపతిరాజు వారింటికోడలు నవుతానని నాకప్పటికి తెలియదు. మా బాబయ్యగారితో నేను రాజమండ్రి వెళ్ళాను. అప్పుడు స్వామీజీ విశ్రాంతికోసం రాజమండ్రిలో ఉన్నారు. విదేశాలలో విజ్ఞాన శాస్త్ర ప్రయోగాలు చేస్తున్నప్పుడు వారి చేతికి విద్యుదాఘాతం తాకడం, ఆయంత్రం వారి చేతులమీద పడిపోవడం వల్ల వారు స్వదేశానికి వచ్చి చికిత్స చేయించుకుంటూ విశ్రాంతి తీసుకుంటున్నారు.

నేను శ్రీ స్వామీజీని దర్శించినప్పుడు వారి దగ్గర వారికి అత్యంత ప్రేమ పాత్రులు, ప్రియ శిష్యులు శ్రీ ప్రజ్ఞానానందస్వామివారు ఉన్నారు. అప్పటికి స్వస్థలం విడిచి పది, పదకొండు సంవత్సరాలు కావడం వల్ల ధారాళంగా తెలుగు మాట్లాడేవారు కారు స్వామీజీ. మా బాబయ్యగారిని అడిగారు నా చదువు సంధ్యల గూర్చి. నేను చదువుకుంటున్నానని తెలుసుకొని సంతోషపడ్డారు స్వామీజీ. ఆ తర్వాత తర్వాత ప్రస్తావనలలో స్త్రీలు చదువుకోవటం అవసరమని వారు చెపుతూ ఉండేవారు.

ఇంతకూ స్వామీజీని అంత చిన్నవయసున చూసే భాగ్యం నాకు మానాయనమ్మగారి వల్ల కలిగిందని చెప్పాలి. మా ఇంట్లో చదువు సంధ్యలకూ దైవభక్తికీ ఆధ్యాత్మికమైన ఆశయాలకు తల్లివేరు మానాయనమ్మే. ఆమెను అందరూ బంగారమ్మగారనేవారు. భారతభాగవతాలలో ఆమెకు మంచి పరిజ్ఞానం ఉండేది. ఆమెకు శ్రీ స్వామీజీపట్ల ఎంతో భక్తిప్రపత్తులుండేవి. ఆమె ఎంతో సహనపరురాలు, శాంతమూర్తి. ఏమైనా నిందావాక్యాలు ఎవరైనా ఆమెను గూర్చి ఆడినా బదులు పలికేదికాదు. మా ఇంటిలో శ్రీ స్వామీజీ పేరు అదివరకే మానాయనమ్మగారిద్వారా పరిచయమైంది. అందువల్ల ఆరోజులో సారంగధర మెట్టప్రాంతంలో ఒక ఎత్తైన ప్రదేశంలోని బంగళాలో విశ్రాంతి తీసుకుంటున్న శ్రీ స్వామీజీని చూడటానికి మా బాబయ్యతో నేను వెళ్ళటం తటస్థించింది.

ఆ తర్వాత నాకు పదమూడోయేట పెళ్ళైంది. **1934** సంవత్సర ప్రాంతం కావచ్చు. మావారికీ నాకు ఐదు సంవత్సరాల తేడా. వయస్సులో వారికప్పటికి పద్ధెనిమిది సంవత్సరాలు. మాకన్నావారు ఎక్కువ స్థాయి కలవారు. అయినా మాసంబంధాన్ని వారే అడిగి ఇష్టపడి చేసుకున్నారు. ఇందుకు ఆనాటి వారి కుటుంబ స్థితిగతులు కూడా కొంతవరకు ప్రేరణచేశాయి. భూపతిరాజు శ్రీరామరాజుగారు అంటే మా మామగారు గొప్ప ఆధ్యాత్మిక సాధకులు, వారు రోజులో చాలా భాగం పండితులతో ఆధ్యాత్మిక సాధనపరులతో, వేదాంత విషయాలు మథనం, మననం చేస్తూగడిపేవారు. అంత శ్రీమంతులయి ఉండి కూడా వారు పరమ నిరాడంబరులుగా ఉండేవారు. షష్ఠిఘడియలూ విద్వద్గోష్ఠి. అది లేనప్పుడు తోట కలకల లాడటానికి చేయవలసిన దోహదాలలో వారు నిమగ్నమై ఉండేవారు. ఆయన పరమశాంతులు. అత్యంత సాత్త్వికులు.

స్వామిజీవంటి పూర్ణయోగి, మహాత్యాగి, మహాసాత్త్వికులు ఆయన కడుపున పుట్టటంలో ఏదో పరమార్థంలేకపోలేదనిపిస్తుంది. ఆ తరువాత కాలంలో శ్రీపాదకృష్ణమూర్తి శాస్త్రిగారో గుంటూరు వీరభద్రశాస్త్రిగారో వంటి మహా పండితులు శ్రీ స్వామిజీని శ్రీ రామారాజుగారినీ ఒకే సమక్షంలో చూసినప్పుడు దశరథ, రాములను ఒకేసారి చూసిన ఆనందంగా ఉంది అనటం నేను మరిచిపోలేను. భాగవత నిష, మొదటినుంచీ మా రెండు కుటుంబాలలోకూడా స్వాత్త్వికాహార పద్ధతులే ఉండేవి. భాగవతనిష్ఠ, దైవభక్తి, యోగ, సాధనల ప్రభావం అది. అత్తగారికుటుంబ ఒక రాజాస్థానంలా ఉండేది. అతిథి అభ్యాగతుల రాకపోకలకు విరామం ఉండేదికాదు. ఎవరు వచ్చిపోతున్నారో ఎవరు ఏవేళ భోజనాలు చేస్తున్నారో, అతిథి మర్యాదలు పొందుతున్నారో లెక్కాజమా ఉండేది కాదు. ఎవరు కావల్సిందివారు తీసుకొని పోతున్నా పోనీలెమ్మని ఉదాసీనంగా ఉండేవారు. అయితే ఈ పరిస్థితులన్నీ శ్రీ స్వామిజీ ఇల్లు విడిచిపెట్టి వెళ్ళటంతో తారుమారైనాయి.

భూపతిరాజు శ్రీరామరాజుగారు అంటే మామామగారి హయాంలో రాజమండ్రిలో వాళ్ళకు వంద ఎకరాల మామిడితోట, గొరగనమూడిలో మూడువందల ఎకరాల సుక్షేత్రాలు, తోటలూ, దొడ్లూ ఉండేవి. అప్పట్లో వాళ్ళు చాలా శ్రీమంతులు. చిన్నవయసున స్వామిజీకి మూడేళ్ళప్పుడే తల్లి చనిపోయారు. ఇక ఆ తండ్రికి ఆయనంటే పంచప్రాణాలు. అల్లారు ముద్దుగా చూసుకునేవారు. కాలునేలమీద మోపితే ఆ శ్రీపాదాలు ఏమికంది పోతాయో అన్నంత మురిపెంగా చూసుకొనేవారు. నరసాపురం స్కూల్లో చదువుకుంటూ ఉండేప్పుడు ఆయనను బండిమీద పంపించేవారు. మళ్ళీస్కూలు విడిచిందాకా అబండి అక్కడే కాచుకొని ఉండేది. చిన్నప్పటినుంచీ స్వామివారు ప్రపంచంపట్ల, ఆటపాటలపట్ల, ఆహారరుచుల పట్ల అనాసక్తంగా ఉండేవారు. ఇది నాది, నాకిది కావాలి అనే ధ్యాసవారికి ఉండేది కాదట. స్కూలుకు ఆటవిడుపురోజులైన, శని, ఆదివారాలలో ఆయన కోసం పకోడీలు వండితే - ఆరోజులో పిండివంటలు, తినుబండారాలన్నీ నేతితోనే చేసేవారు- స్వామిజీ తన స్నేహితులనందరినీ పిలిచి వాటిని పందారం చేసేవారుట. తన వస్తువులన్నీ తోటి స్నేహితులకు ఇవ్వటం, వాళ్ళకు జీతాలు కట్టటం, చదువు సంధ్యల పట్ల నిమిత్తమాత్రంగా ఉండటం చేస్తుండేవారు స్వామిజీ. ఇవన్నీ తండ్రిగారి చెవికి వాళ్ళూవీళ్ళూ చేరవేస్తుండేవారు. ఒకసారి నరసాపురం పాఠశాలోపాధ్యాయులొకరు స్వామిజీ చదువును నిర్లక్ష్యంచేస్తున్నారనీ పాఠాలు పట్టించుకోవటంలేదనీ తండ్రిగారికి ఫిర్యాదు చేశారుట. శ్రీరామరాజుగారు ఆదుర్దాగా కొడుకు బసకు వెళ్ళి ఆ ఉత్తరాన్ని చూపిస్తే స్వామిజీ చిరునవ్వునవ్వి ఊర్కున్నారు. మరునాడు మేష్టారు గారి దగ్గరకు కొడుకును వెంటబెట్టుకొని వెళ్ళారు. మేష్టారు ఫలానా పాఠం నీవు చదవలేదు, ఫలానా పద్యం నేను పాఠం చెపుతుండగా నీవు అన్యమనస్కంగా ఉన్నావు అన్నారుట. ఆ పాఠం తడుముకోకుండా, ఆ పద్యం అప్పగించి ఉపాధ్యాయుణ్ణి ఆశ్చర్యపరచారు స్వామిజీ. ఆయన మేధ అంతచురుకుగా ఉండేది. లేకపోతే విదేశాలలో విజ్ఞాన శాస్త్రంలో అంతగా గొప్పకృషి జరిపి అన్ని డిగ్రీలు వారు ఎలా పొందగలిగి ఉండేవారు?

మా మామగారిది అపురూపమైన వ్యక్తిత్వం. స్వామిజీ ఇల్లు వదిలి పెట్టి వెళ్ళిన తరువాత ఆయన నిద్రాహారాలు మానేశారు. కేవలం తాటాకు చాపమీదనే పడుకొనేవారు. ఆహారం కూడా చాలా వరకు విసర్జించారనే చెప్పాలి. తరువాత కాలంలో తాము కాశీ వెళ్ళి సన్యాసాశ్రమంలో ఉన్నప్పటి తమ కుమారుణ్ణి మొట్టమొదటి సారిచూసినప్పుడు తమకు కలిగిన ఆర్తి, మనోవేదన చెపుతున్న ప్రతిసారీ ఆయన్ను కదిలించి కన్నీళ్ళు పెట్టుకునే వారు. నేలమీదనడిస్తే పాదాలు క్రింది పోతాయేమోనన్నంత గారాబంగా సుకుమారంగా ముద్దుమురిపాలతో పెంచుకున్న తమ కొడుకు

ఆ మంచురాళ్ళలో, మంచు దిబ్బలలో బురదలో గమించి అత్యంత కఠోరమైన తపస్సు ఎట్లా చేశాడా అని ఆయన స్వయంగా అది తమకళ్ళముందు అప్పుడే జరుగుతున్నట్లు బాధపడేవారు. మామగారికి వేదాంత విషయాలు, తాత్త్వికపరమార్థాలు, యతిధర్మాలు బాగా తెలిసినవేకదా! కాశీలో మొదటిసారి తమ జన్మచరితార్థం చేసిన పుత్రుణ్ణి చూసినప్పుడు ఆయన కోరినచోట ఎక్కడనైనా ఒక ఆశ్రమం కట్టించి వారి పరివారంతో ఉండే ఏర్పాట్లు చేస్తాననీ, పుత్రుణ్ణి ఇంటికి ఒకసారి వచ్చిపోవలసిందనీ అర్థించారు. అందుకు స్వామిజీ తమ గురువుగారి అంగీకారం కావాలన్నారు. శ్రీ రామరాజుగారు ఆ గురువుగారి ఆనుపానులు తెలుసుకొని వెళ్ళివారిని అర్థించారు. గురువుగారైన శ్రీ పూర్ణానంద అందుకు ఒప్పుకోలేదు. సర్వసంగ పరిత్యాగం చేసిన సాధువు మళ్ళీ బంధకారణమైన బంధు బృందం మధ్యకు వెళ్ళగూడదని గట్టిగా వాదించారు. అప్పుడు శ్రీరామరాజు ఒక ధర్మ సూక్ష్మాన్ని లేవనెత్తి శ్రీపూర్ణానందస్వామి వారిని ఆశ్చర్యపరిచారు. ఏమంటే సన్యాసాశ్రమస్వీకారం చేసేవ్యక్తి తల్లి అనుమతిగానీ పత్ని అంగీకారాన్ని కానీ పొందకుండా ఆశ్రమస్వీకారం చేసే అవకాశంలేదు కదా అని అడిగినప్పుడు స్వామిజీ గురువుగారైన శ్రీపూర్ణానందస్వామివారే నిరుత్తరులైనారట.

మామగారికి సేవచేయటం, వారి సమక్షంలో వారి పలుకులు ఆలకించటం అంటే నాకెంతో ఇష్టంగా ఉండేది. అది ఒక మహాద్భాగ్యంగా భావించుకునేదాన్ని. మావారు చదువుకోసం వెళ్ళినప్పుడు కూడా మామగారి పరిచర్యకోసం నేను గొరగనమూడిలోనే ఉండేదాన్ని. అప్పటి రోజుల ఒకటి రెండు సంఘటనలు నా స్మృతిపథంలో బలమైన ముద్రతో కలకాలం నిలిచి ఉంటాయి మామామగారికి సంబంధించినవి. మామగారు గొప్ప యోగసాధకులని అప్పటివరకు నాకు తెలియక పోయింది. వారు స్నానం చేస్తున్నప్పుడు నేనేదగ్గర ఉండి ఉపచరించేదాన్ని. ఒకరోజున వారు స్నానం చేయటానికి ఉపక్రమించబోతుండగా వారిచేతిలో చెంబూ, వారి శరీరమూ అచేతనావస్థలో ఉండటంగమనించి చాలా భయపడిపోయాను. వారికి బాహ్యస్మృతిలేదు. పొరుగున ఉన్న మామరిది కృష్ణంరాజుగారిని కేకవేసాను. చాలాకాలం నుంచి మా కుటుంబానికి సన్నిహితంగా ఉన్న సూరమ్మగారు కూడా నాకేకలకు గాభరాపడి అక్కడకువచ్చారు. క్రమంగా వారిస్థితిలో మార్పుకలిగింది. అప్పుడు, ఆశ్చర్యకరంగా వారిచుట్టూ ఒక పరివేషంలో దానిమ్మకాయలంత వడగండ్లతో చిన్న వర్షం కురిసి వెలిసింది.

ఆయన ఎంత పరమ సాత్త్విక మూర్తులంటే చాలా కొంచెం అన్నమూ పట్టెడు పక్వమైన కూరగాయ, ఆతరువాత మజ్జిగ మాత్రమే ఆహారంగా స్వీకరించేవారు. ఇంట్లో వంటమనిషి ఉన్నా వారికి అనువుగా కావలసిన రీతిలో మెత్తగా సాత్త్వికంగా ఉండాలని వారి వంటమాత్రం నేనేచూసుకునే దానిని. ఒకరోజు జరిగిన సంఘటనను నేను ఎన్నడూ మరిచిపోలేను. దోసకాయ పైకి నవనవలాడుతూ పక్వంగా చాలా బాగా ఉందికదా అని పెద్దకాయను తరిగి కూరచేసాను. మామగారు ప్రీతిగా కొంచెం అన్నంలో కలుపుకొని ఎక్కువ కూరను తిన్నారు. ఆ తర్వాత నాలుగు ముక్కల కూర మిగిలి ఉందికదా అని నేను భోజనం చేస్తూ కూరముక్క నోటిలో పెట్టుకోగానే ఆ కటికిచేదు సహించలేక పోయాను. అయ్యో ఇలా జరిగిందే అని నాకెంతో ఏడుపువచ్చింది. అయితే మా మామగారు నాకు సర్దిచెపుతూ ఇందులో నీ తప్పేముందమ్మా, అయినా షడ్రుచులలో చేదు కూడా ఒకటికదా అని నన్ను అనునయించారు. 'వీతరాగభయక్రోధః, స్థితి ధీర్మునిరుచ్యతే' దుఃఖేషనుద్విగ్నహృదయః, సుఖేషు విగతస్పృహః, అని ద్వంద్వాలను జయించిన స్థితి వారిది అని నాకా తరువాత అర్థమైంది. ఇంతటి స్థితప్రజ్ఞులైనప్పటికీ పుత్రవియోగం వారిని బాగా కలచివేసించి. స్వామిజీ ఇల్లు విడిచిపెట్టి వెళ్ళిన తర్వాత ఆయన

ఇంటి వ్యవహారాలలో పూర్తిగా నిరాసక్తులైనారు. సిరి, సంపద, లౌకిక కార్యకలాపాలు, ఇంటి వ్యవహారాలు ఏమీ పట్టించుకోలేదు. నాలుగేళ్ళ తరవాత మళ్ళీ స్వామీజీ ఉనికి తెలిసిన తర్వాత వారు కొంతలో కొంత మామూలు మనుషులైనారు.

ఆపరిస్థితులలో కుటుంబపు ఆస్తిపాస్తులు చాలావరకు తరిగిపోయినాయి. ఇంటి వ్యవహారాలు చూసుకొనే నాథుడు లేక పంటాపొలమూ నిర్లక్ష్యమై పోయాయి. ఇంట్లో పురుగూ పుట్రా పారాడుతున్నా పట్టించుకొనే వాళ్ళులేకపోయినారు. వాళ్ళ రాజరికపుస్థాయి తగింది. ఆ పరిస్థితుల్లో వాళ్ళ కుటుంబస్థాయి హోదా మాకులేకపోయినా నా పూర్వపుణ్యంవల్ల నేను స్వామీజీవంటి మహోత్తమ త్యాగమూర్తి పుట్టిన కుటుంబంలో మెట్టినింట కాలు పెట్టాను.

శ్రీస్వామీజీ సాక్షాత్తు శ్రీ రామకృష్ణ పరమహంసవంటివారు. గృహస్థ సన్యాసులలో వారిద్దరికి మాత్రమే పోలిక ఉంది. అంతేకాదు ఈ కాలపు ఆధ్యాత్మిక ఆచార్యులవంటి వారుకారు స్వామీజీ. ఆయనకు పదిహేడేళ్ళ వయసున వివాహమైంది. ఏడాది ఏణ్ణార్ధంకూడా గడవ కుండానే స్వామీజీ తపస్సుకు వెళ్ళిపోయారు. స్వామీజీ వివాహం వారి మేనమామల ఇంటివారితోనే జరిగింది. వారి ఇల్లాలు (అంటే పూర్వాశ్రమంలో నాతోటికోడలు) శ్రీ సోమావతమ్మ గారు అపురూపమైన సౌందర్యవతి. ఆకర్ణాంత విశాలమైన పెద్ద నేత్రాలు. ఆమెది మెరుగు బంగారపు చాయ, పెద్ద తలకట్టు. దేవీ మూర్తిలా ఉండేవారు. ఆమెను స్వామీజీ చాలా ఆదరంగానే చూసేవారు. సోమావతక్కాయ్ అని పిలిచేవారు. ఆమెకు జన్మపరమార్థాన్ని ఉపదేశించి శ్రీ రామకృష్ణపరమహంస శారదాదేవిల దాంపత్య పావిత్ర్యాన్ని బోధపరిచి, శ్రీరామకృష్ణుల చిత్రాన్ని అప్పజెప్పివారు తపశ్చర్యకు వెళ్ళారు. శ్రీ సోమావతమ్మగారు ఏనాడు జరిగినదానికి అసంతృప్తినీ, అసంతుష్టినీ వ్యక్తం చేయలేదు. పరిపూర్ణమైన ఆనందంతో కాలం గడిపారు. వారి ఉపదేశకులు పరమ యోగీశ్వరులు, పూర్ణయోగ ప్రవర్తకులూ కదా! శ్రీరామరాజుగారు తమ పెద్దకోడలు పట్ల ఎంతో ప్రేమను అత్యాదరణను చూపేవారు.

శ్రీ స్వామీజీ గురుదేవులు శ్రీ పూర్ణానంద స్వామి వంగదేశంవారు కాబట్టి శ్రీస్వామీజీ తమ ఆధ్యాత్మిక సాధనలు, తపశ్చర్యావృత్తాంత ప్రసక్తి వచ్చినప్పుడు ఎక్కువగా బెంగాలీ సాధువులు గూర్చి, అక్కడ విశేషాలు గూర్చీ ముచ్చటించేవారు. రామతీర్థస్వామివారిని గురించి కూడా అప్పుడప్పుడు ప్రస్తావిస్తూ ఉండేవారు. శ్రీ స్వామీజీ గొరగనమూడి ప్రాంతాలకు వచ్చినప్పుడు తమకుటుంబ సభ్యుల ఆధ్యాత్మిక సాధన వికాసం గూర్చీ ఆసక్తి చూపుతూ ఉండేవారు. వారి వారి మానసికస్థాయిని బట్టి, వికాసాన్నిబట్టి బోధించి మార్గనిర్దేశంచేస్తూ ఉండేవారు. అంతేకాని ఆశ్రమమూ, మఠమూ, ప్రచారమూ, ఉపన్యాసాలు అంటే ఇష్టపడేవారు కారు. ఆగర్భశ్రీమంతులై ఉండీ ఆ వైరాగ్యము, ఆ ఔదార్యమూ, ఆ జ్ఞానసంపద, వారికొక్కరికే చెల్లాయనిపిస్తుంది. మా మామగారు పాతకాలపుఇల్లు, దాన్ని మార్చి మళ్ళీ సౌకర్యాలతో ఏర్పాటు చేసుకుందామన్న ప్రస్తావనవస్తే ముందు నీ ఇంటి సంగతి విచారించుకోమని నవ్వుతూ అంటూవుండేవారు.

మొదట్లో తండ్రిగారిని శ్రీరామరాజుగారనే ప్రస్తావిస్తూఉండేవారుకాని తర్వాత తర్వాత తండ్రిగారనే వారిని గూర్చి చెపుతుండేవారు. శ్రీరామరాజుగారు నిజంగా జనక మహారాజు వంటి రాజయోగి అనే చెప్పాల్సి ఉంటుంది.

ఇప్పటికి నాకు తోచిన శ్రీ స్వామీజీ కుటుంబ వృత్తాంతం కొంతవరకు చెప్పగలిగాను.

భావనలు లేని, గ్రహణలు గ్రుడ్డివి, గ్రహణలు లేని భావనలు శూన్యము

(స్వామి జ్ఞానానంద)

# వేద విజ్ఞానం - శాస్త్ర విజ్ఞానం

- శ్రీ బూర్గుల రామకృష్ణరావు

విజ్ఞాన శాస్త్రములని నేడు పరిగణింపబడు భౌతికశాస్త్రముల యొక్క పునాదులు కూడ వేదములలో మూల భూతముగా నంతర్గతములై యున్నవి. వేదములు ముఖ్యముగా నలౌకిక పురుషార్థ సాధనజ్ఞానమును ప్రసాదించునవే యైనను లౌకిక పదార్థ విజ్ఞానము కూడ కలిగించి మానవుని జిజ్ఞాసను తృప్తిపరచడమునకే కాక విశ్వాత్మ యొక్క సత్య స్వరూప నిర్ణయమునకు తోడ్పడుచున్నవి. అందువలననే వేదాంగములగు షట్ఛాస్త్రములకు గల ప్రాముఖ్యము. పాశ్చాత్య దేశములలో గత శతాబ్దములందు బహుళముగా జరిగిన వైజ్ఞానిక శాస్త్ర ప్రగతి మానవుని కనులకు మిరుమిట్లు గొలుపు చున్నది. ఆ వికాసమంతయు ప్రత్యక్షానుమానాది దృక్ప్రమాణములపై యాధారపడి యున్నందున కాలక్రమేణ జరుగుచుండు నూతన పరిశోధనల వలన సిద్ధాంతము లెప్పటికప్పుడు మారుచున్నవి.

ఇటీవల పాశ్చాత్య భౌతిక శాస్త్రవేత్తలు, అణుశాస్త్రవేత్తలు, వైద్యశాస్త్ర, జీవశాస్త్ర విశారదులు, ప్రత్యక్షానుమానాది ప్రమాణములపై యాధారపడిన తమ పరిశోధనలును, సిద్ధాంతములును అసమగ్రములనియు, సమ్యగ్దర్శన మాత్మదర్శనము **(intuition)** వలన కలుగుననియు అభిప్రాయ పడుచున్నారు. కేవల బౌద్ధిక విచికిత్సవలన కలిగే జ్ఞానము సంపూర్ణసత్యము కాదని నిర్ణయమునకు వచ్చుచున్నారు. విశ్వసృష్టిని గురించిన మనమూల సిద్ధాంతములును, మన జ్యోతిషశాస్త్ర సిద్ధాంతములును జీవశాస్త్రమును గురించిన మన మూల భూతములైన **తత్త్వములును** వారి పరిశోధనల వలన రుజువగుచున్నవని అంగీకరించు చున్నారు.

మానసిక శక్తులను సత్య దర్శనమునకై వినియోగించుట చేతనే ప్రకృతి యొక్క నిజస్వరూపము తెలియునని విశ్వసింప మొదలిడు చున్నారు. మన న్యాయ వైశేషిక యోగసూత్రములను తమ శాస్త్ర విజ్ఞానముతో సమన్వయించు నూతన ప్రయత్నమును చేయుచున్నారు. కాబట్టి మన వేదశాస్త్రముల విజ్ఞానము నేటి **Science** యొక్క నూతన పరిశోధనలకు సమీపముగా వచ్చుచున్నది. వారి విజ్ఞానము రాను రాను వర్థిల్లిన పిదప మన మంత్రద్రష్టలైన మహాఋషులు యోగదృష్టిచే దర్శించిన భౌతికాధ్యాత్మిక సత్యములన్నియు సమగ్రసత్యములే యని వారంగీకరించెడి తరుణము రావచ్చును. కనుక మన వేదశాస్త్ర విజ్ఞానమును క్షీణింపనివ్వక పరిరక్షించుకొనుట భారతదేశమునకే కాదు ప్రపంచమునకే యత్యవసరము. మన ఆర్షవిద్యలలో నిగూఢములై యున్న సత్యములను రహస్యములను క్షుణ్ణంగా తెలిసికొని ఇతరులకు బోధించు శక్తిగలవేదశాస్త్ర పండితుల కొరతను తీర్చవలసిన బాధ్యత సమాజము పై కలదు.

**(1963లో** శ్రీ సత్యసాయిబాబా వారు నిర్వహించిన యజ్ఞ సందర్భంగా 'విజ్ఞప్తి' పేరుతో ప్రకటించిన వ్యాసం నుంచి)

**"ప్రస్తుతాంధ్రీకరణము శ్రీ ఆత్మానంద యతీంద్రులవారి సరస కవిత కాలవాలమైన రచన. అనువాదకులు శ్రీ జ్ఞానానంద స్వాముల వారిని గురువుగా వరించి సంయములై ఆత్మానందాను భూతిని గడించుచున్నయతులు. వారి గురువులు ఆధ్యాత్మికాధిభౌతికోభయ విద్యా విజ్ఞానవేత్తలగు శ్రీ జ్ఞానానంద యతీంద్రులు. నేషనల్ ఫిజికల్ లాబొరేటరీకి ఉపాధ్యక్షులు"**

***(శ్రీ ఆత్మానందస్వామి ఆంధ్రీకృత మేఘసందేశానికి బూర్గులవారి తొలిపలుకు నుంచి)***

# శ్రీ స్వామీజీని గూర్చి కొన్ని దివ్యస్మృతులు

*- కెప్టెన్ గూడూరి గోపాలకృష్ణంరాజు.*

మా స్వస్థలం నిడుదవోలు సమీపంలో సెట్టిపేట దగ్గర చిన్నగ్రామం. నిడదవోలుకు చరిత్రలో ప్రసిద్ధి వుంది. చాళుక్యుల కాలంలో అది ఒక మంచి గడిదుర్గం. ఆధునిక కాలంలో గోదావరిజిల్లాలలో సంపన్నమైన ప్రాంతం అది. చిన్నప్పటి నుంచీ చారిత్రక ప్రాంతాలన్నా గడచిన కాలపు రాజ వంశాల పరాక్రమ గాథలన్నా నాకు చాలా కుతూహలంగా ఉండేది. ఏమిటేమిటో తలపోసుకుంటూ ఉండేవాణ్ణి. రవీంద్రనాథటాగూర్ అంత కవితాత్మ గలిగిన గొప్పవాణ్ణి కాకపోయినా ఆయన లాంటి ఊహావిహారపు ప్రవృత్తి నాలోనూ కొంత వుండేదేమోననిపిస్తుంది. రవీంద్రుడి జన్మస్థలమైన జొరాశాంకో పూర్వకాలపు రాజభవనం విశాలావరణలో గల ఒక మండువాలో పాతకాలపు మేనా ఒకటి ఉండేదట. చిన్నతనంలో రవీంద్రుడు ఆ విశాలభవనపు గదులు తిరుగుతూ ఊహాలోక విహారం చేసేవాడట. వాడుకలో లేని ఆ పాతకాలపు మేనాలో కాసేపు కూచుని పంచకల్యాణి గుర్రాలమీద దౌడులు తీసే రాజకుమారులను, ఆపదలో ఉన్న రాజకుమార్తెలను, పేదరాసి పెద్దమ్మలను, మానవులకు సహాయం చేసే పశుపక్ష్యాదులను, జానపద గీతాలలో పొగడ్తలు పొందే వీరగాథలను మననం చేసుకుంటూ తానూ అందులో ఒకపాత్రగా భావించుకుంటూ స్వాప్నికలోక విహారం చేసేవాడుట. అలాగే నాకు ఆ సంస్థానాలు, ఆ రాజులు, వాళ్ళ ఆయుధాలు, ఆ గాథలు చాలా ఆసక్తికరంగా ఉండేవి. బొబ్బిలియుద్ధం నాలో చాలా ఉత్కంఠ కలిగించేది. ఫ్రాన్స్ దేశం నుంచి వచ్చిన బుస్సీ, అవక్ర పరాక్రమం కనపరచిన తాండ్రపాపారాయుడు, దుర్మరణానికి గురి అయిన విజయరామరాజు, ఆ కోటలు, ఆ అగడ్తలు రాణివాసం మర్యాదలు, అవన్నీ మనోలోకాలలో ఊహించుకుంటూ ఉండేవాణ్ణి. అందువల్ల కాబోలు నిడుదవోలులో స్కూలుఫైనల్ చదువు పూర్తికాగానే ఇంటర్మీడియట్ చదవటం విజయనగరంలోనే అని నిశ్చయించుకున్నాను. ఆ విధంగా విజయనగరం ప్రయాణం కట్టాను. మహారాజా కాలేజీలో చేరాను. ఉండటం కాలేజీ హాస్టలులోనే అయినప్పటికీ మనసంతా మహారాజావారి కోట చుట్టూనే పరిభ్రమించేది. విజయనగరం ప్రజలలో మహారాజా వంశం పట్ల ప్రజలలో ఆ నాటికి కూడా ప్రేమాభిమానాలు భక్తివిశ్వాసాలు ఎక్కువగానే ఉండేవి. మహారాజా వారి పూర్వీకుల వృత్తాంతం, కుటుంబగాథలు వారు వీరు చెప్పుకుంటూ ఉండగా వినీ, పుస్తకాలలో చదివి, రాజాగారితో మమేకం ఏర్పరచుకొన్నాను. శ్రీ పి.వి.జి. రాజుగారి ప్రాపకం, ప్రేమాభిమానాలు సంపాదించుకొన్నాను. నన్ను చూడగానే ఎంతో ఆప్యాయతతో అనురాగంతో పలకరించేవారు. అప్పటికి శ్రీ పి.వి.జి. రాజు గారి కుమారులు ఆనందగజపతి, అశోకగజపతి చిన్నపిల్లలు. వాళ్ళతో నాకు స్నేహం కలిసింది. ఆ మోతీమహల్, ఆ దర్బారు హాలు, ఆ ఫూల్‌బాగ్ ఆ రాజప్రసాదం నాకు చిరపరిచిత మైనట్లు సంచరిస్తూ ఉండేవాణ్ణి. పందొమ్మిదివందల యాభైఆరు, యాభై ఎనిమిదిలలో నేను మహారాజా కాలేజి, విజయనగరంలో ఇంటర్మీడియట్ చదివాను. అప్పటికే శ్రీ పి.వి.జి. రాజుగారికి శ్రీ స్వామి జ్ఞానానందతో సాన్నిహిత్యం ఉండేది. ఆ విషయం నాకు తర్వాత తెలిసింది. శ్రీ స్వామీజీకి శ్రీ రాజుగారంటే చాలా ప్రాణం. అలానే శ్రీ పి.వి.జి. రాజుగారికి శ్రీ స్వామి జ్ఞానానంద సర్వస్వం. స్వామీజీ అంటే గొప్ప ఆరాధనాభావం ఉండేది రాజుగారికి. ఒకసారి ఏదో మాటల

సందర్భంలో శ్రీ పి.వి.జి. రాజుగారు 'You must go and see my guruji' అన్నారు. అప్పుడు శ్రీ స్వామిజీ అంటే పి.వి.జి. రాజుగారికున్న గౌరవం, అభిమానం నాకు తెలిసింది. బహుశా 1958 అని జ్ఞాపకం. మొదటిసారి మహారాజావారి ప్రేరణ వల్ల నేను వైజాగ్ వెళ్లి శ్రీ స్వామిజీని దర్శించాను. అప్పటి నుంచీ ప్రహ్లాదుడు చెప్పినట్లు ఇనుము అయస్కాంత సన్నిధికి ఆకర్షితమైనట్లు శ్రీ స్వామిజీ పట్ల నాకు గొప్ప ఆకర్షణ కలిగింది. వారి సన్నిధిలో గడిపినకాలం నాజీవితంలో గొప్ప అదృష్టంగా భావించగలిగాను. అవకాశం దొరికినప్పుడల్లా శ్రీ స్వామిజీ దగ్గరకు వెళుతూ ఉండేవాణ్ణి. ఆయన ఎంతగానో ఆదరించేవారు నన్ను. ప్రతివారూ ఆయన పలకరింపులో ఆదరణలో సన్నిధిలో అటువంటి అనుభూతినే పొందేవారు. అది ఆ మహనీయుడి గొప్పతనం. వారి సమక్షానికి ఎందరో గొప్ప విశిష్ట వ్యక్తులు వచ్చేవారు. ఆ యా రంగాలలో చాలా ప్రజ్ఞావంతులైనవారు, మేధావులు, విద్యావేత్తలు, ఆచార్యులు, highly qualified guests ఎందరో వస్తూ ఉండేవారు. అయితే అటువంటివారిని ఎంత అభిమానంతో ప్రీతితో వారు కుశల ప్రశ్నాదికంతో ఆదరించేవారో, వారితో ఏ విధంగా వర్తించే వారో తమ దగ్గర పనివాళ్ళను, తమ సేవకు నియుక్తులైన వాళ్ళను కూడా అదేస్థాయిలో వారు ఆత్మీయంగా ఆదరించేవారు. తమ దగ్గరకు వచ్చే ఎవరినైనా వారు ఆత్మస్వరూపులుగానే భావించేవారు. అదీ వారి జ్ఞానస్వరూపం. పరమవిశిష్టమైన మూర్తిమంతం.

స్వామిజీకి పరిశుభ్రత ప్రాణం. ఆయన పరిసరాలన్నీ పరమ శుభ్రంగా ఉండాలి. ప్రతిచిన్న విషయంలోనూ ఆయన అమితమైన పరిశుభ్రతను పాటించేవారు. పాలలో కడిగిన ముత్యంలాగా ఉండాలి ఆయనకు వస్తువులన్నీ. ఆఖరుకు ఆయన ధరించే చేతిగడియారం కూడా తళతళ మెరిసి పోతూ ఉండాల్సిందే. రోజూ ఆ జాగ్రత్తను వారు పాటించేవారు. ఆయన ఎల్లప్పుడూ సిల్కుపాంటూ, సిల్కు షర్టు ధరించేవారు. అవి అత్యంత స్వచ్ఛంగా ఉండాల్సిందే. అప్పుడు శ్రీ స్వామిజీ ఆంధ్రా యూనివర్సిటీలోని కేంపస్‌హౌస్‌లో ఉండేవారు. ఆ ఇంటి చుట్టూ చాలా చెట్లు ఉండేవి. అది పరమ రమణీయమైన ఉద్యానగృహంలాగా ఉండేది. అక్కడకు వెళ్ళి వారిని చూడటం పరమానంద ప్రదంగా ఉండేది. వారి సన్నిధిలో అటువంటి ఆకర్షణ ఏదో ఉండేది. బహుశా హిమాలయ తపోభూముల సౌందర్యానుభూతిని ఆయన ఆ పరిసరాలలో పొందేవారేమో,! పరమ ప్రశాంతంగా సుందరంగా ఉండేది వారి బస అక్కడ. ఒక వంటవాడు ఇద్దరు పనిపాటలు చూసే కుర్రవాళ్ళూ ఉండేవారు. వీళ్ళు కాక ఒక డ్రైవరు ఉండేవారు. ఆయన్ను సందర్శించటానికి వచ్చిన వాళ్లందరికి అతిథిమర్యాదలు జరగ వల్సిందే. వారి భోజనం బల్ల కూడా పరమ కళాత్మకంగా ఎంతో నీటుగా చక్కగా అమర్చి ఉండాల్సిందే. భోజనపాత్ర చుట్టూ వివిధ ఆధరువులు చిన్న చిన్న కప్పులలో అమర్చిఉండేవి. నేను మొదటిసారి వారిని కలుసు కోవటానికి వెళ్ళినప్పుడు ఎంతో ఆప్యాయంగా, ఆదరంగా ఆ కప్పులలోని ఆధరువులను ఏవిధంగా వినియోగించాలో వారు నాకు చెప్పారు. పక్కనే తల్లి ఉన్నప్పుడు ఎలా ఉంటుందో అలా నా భోజనం విషయం పర్యవేక్షించారు వారు. ఒక్కొక్కసారి డిపార్టుమెంటుకు వెళ్ళి వారిని ఆఫీసులో చూసేవాణ్ణి. అక్కడ కూడా వారి చుట్టూ వాతావరణం దైవ సన్నిధిలాగా ఉండేది. వారిని చూడవచ్చినవాళ్ళందరూ వారికి పాద నమస్కారం చేసేవాళ్ళు. శ్రీ స్వామిజీలో ఇసుమంత కూడా అలసట, విసుగూ కన్పించేవికావు. వారు నిరంతరం ప్రఫుల్లవదనులే. వారి పెదవులపై కరుణార్ద్ర అనురాగ రంజితమైన చిరునవ్వు ఎప్పుడూ వెలుగొందుతూ ఉండేది. పసిపిల్లవాడి వలె అమాయకత్వం, సారళ్యం, అచ్ఛస్వచ్ఛ వినిర్మల సుందర మందహాసం వారి పెదవులపై ద్యోతక మవుతూ ఉండేది. ఒకసారి యూనివర్శిటీలో వారి డిపార్ట్‌మెంట్‌కు సంబంధించిన ఏదో కాన్ఫరెన్స్ జరిగింది.ఆ సమావేశానికి ఎందరో రీసెర్చ్‌స్కాలర్స్

సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్స్ వచ్చారు. అందరూ శ్రీ స్వామీజీని దైవస్వరూపంగానే భావించేవారు. ఆయనసమక్షంలో గడపటంగొప్ప అదృష్టంగానే భావించేవారు.

శ్రీ పి.వి.జి. రాజుగారికి స్వామి జ్ఞానానంద ఒకసారి చేతికర్ర బహూకరించారు. శ్రీ రాజుగారు ఆ చేతికర్రను ఎంతో ఆపేక్షగా చూసుకునేవారు. నిజానికి శ్రీ పి.వి.జి. రాజుగారికి శ్రీ స్వామీజీ పునర్జన్మను ప్రసాదించారనాలి. వాళ్లిద్దరి మధ్య అంత గాఢమైన అనుబంధం ఉండేది. శ్రీ పి.వి.జి. రాజు 1962 ప్రాంతంలో ఆంధ్రప్రదేశ్ మంత్రి వర్గంలో విద్యాశాఖమంత్రి పదవిని స్వీకరించారు. ఆ సంఘటన నాకు బాగా జ్ఞాపకం ఉన్నది. విజయనగర పౌరులు ఆ సందర్భంగా గొప్ప సభ నిర్వహించారు. ఆ సభలో ప్రముఖులెందరో విజయనగరం రాజావారి పట్ల తమ అభిమానాన్ని గౌరవాన్ని భక్తి విశ్వాసాలను వ్యక్తం చేస్తూ ప్రసంగాలు చేశారు. రాజ్యం లేకపోయినా విజయనగరం ప్రజలు తమ రాజాగారిని ఆ ఆప్యాయతతోనే ఆ అనుబంధం తోనే భావించు కొనేవారు. ఆ సభలో కొందరు పెద్దలు నిజానికి రాజావారికి మంత్రిపదవి వల్ల గొప్పహోదా పెరిగినట్లు ఏమీ కాదనీ ప్రజలకోసం ప్రజలకు మేలు చేదామనే కోరికతో మహారాజావారు రాజరికం నుంచి మంత్రిపదవికి ఒక మెట్టు దిగి త్యాగం ప్రదర్శించారని చమత్కరించారు కూడా. శ్రీ పి.వి.జి.రాజుగారు మంత్రిపదవి స్వీకరించడానికి శ్రీ స్వామీజీ ఆశీస్సులు కూడా ఉండి ఉంటాయి.

అటువంటి శ్రీ పి.వి.జి. రాజుగారు విద్యాశాఖ మంత్రిగా ఉంటూ పంజాబ్ రాష్ట్రంలో నూతన విద్యావిధానం అమలుజరుపుతున్నారనీ ప్రాయోగిక ఫలితాల అధ్యయనం జరుగుతున్నదనీ తెలిసి ఆ విధానాన్ని పరిశీలించటానికి చండీగడ్ వెళ్లారు. అక్కడ నుంచి భాక్రానంగల్ ప్రాజెక్టు చూడటానికి కారులో వెళుతూ ఘోరమైన కారు ప్రమాదానికి వారు గురి అయినారు. 87 రోజులు అంటే ఇంచుమించుగా మూడునెలలు శ్రీ రాజు గారు 'కోమా'లో ఉండిపోయినారు. ఆ అపస్మారక స్థితిలోనే ఆయన్ను చండీగడ్‌లోని ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడిసిన్‌లో చేర్చారు. శ్రీ పి.వి.జి. జీవితంలో అదివిపత్కర ఘట్టం. పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చనిపోయిన విషయం శ్రీ రాజుగారికి తెలియదు. అప్పుడాయన 'కోమా'లోనే ఉండిపోయినారు.

శ్రీ పి.వి.జి. రాజుగారి ఈ ప్రమాదకర పరిస్థితి తెలిసి శ్రీ స్వామి జ్ఞానానంద అక్కడకు వచ్చారు. నేనప్పుడు అక్కడే ఉన్నాను. పంజాబ్ ప్రభుత్వం వారికి ఒక గెస్ట్‌హౌస్ సమకూర్చింది. వారం రోజులపాటు స్వామీజీ భోజనం, పడక అక్కడే ఏర్పాటైనాయి. అప్పుడు నేను వారితోనే ఉన్నాను. ఆ తర్వాత స్వామీజీ ఢిల్లీ వెళ్ళారు. అప్పుడు బస్‌స్టేషన్‌కువెళ్ళి శ్రీ స్వామీజీకి నేను వీడ్కోలు చెప్పటం కూడా జరిగింది. ఈ విధంగా స్వామీజీకి అతి సన్నిహితంగా సామీప్యంగా మెలగగల భాగ్యం నాకు సమకూడింది. శ్రీ స్వామీజీని ఒకసారి చూసి మాట్లాడి వారి పరిచయ పరిధిలోకి వచ్చిన వారెవరైనా పవిత్రమైన అనుభూతిని పదిలపరచు కుంటారనే నా నమ్మకం. వారి సాన్నిధ్యానికి అటువంటి ప్రభావం వుంది. వారి ప్రేమ ప్రసార ఆవరణం అటువంటిది.

నేనొకసారి వారిని `నాకేదైనా ఒక మార్గం చూపండి' అని అర్థించాను చనువుగా. వారు ప్రసన్నంగా 'మీ మార్గమే చాలు. ఇంకేమార్గమూ వద్దు' అన్నారు. వారిమాటలలో నాకేదో అభయం చిక్కినట్లైంది.వారిని దర్శించేనాటికే యోగాసనాలు, ధ్యానం, పెద్దలు చెప్పినవీ, నేను విన్నవీ అయిన విచారమార్గమననం నేను స్వీకరించాను. శ్రీ స్వామీజీ సర్వజ్ఞులు కదా! ఎవరిస్థాయి ఏమిటో వారికి ఇట్టే అవగత మవుతుంది. వారు నాకేమీ మంత్రోపదేశం చేయలేదు. శరీరం, మనస్సు, ప్రజ్ఞ, **(body, mind and intellect)** విషయమైన సాధన ఏమరకుండా ఉంటే చాలునని వారి అభిమతం. ఆసనాల వల్ల, ధ్యానం వల్ల, సత్సంగం, సదసత్ విచార నిమగ్నత వల్ల మార్గం సుగమమవుతుందని వారి అభిప్రాయం అనినాకు అర్థమైంది.

# శ్రీ స్వామి జ్ఞానానంద

*శ్రీ కలిదిండి సూర్యనారాయణరాజు*

భక్తి,జ్ఞాన, వైరాగ్యముల సంగమము పూజ్యశ్రీ జ్ఞానానంద యతీంద్రులు. వీరి తండ్రిగారైన భూపతిరాజు రామరాజుగారు జిజ్ఞాసువు, తాత్వికుడు మరియు మంచి సాధకుడు. శ్రీరామరాజుగారి వద్దకు వచ్చు శాస్త్ర పండితులు చర్చించు విషయములను స్వామివారు చిన్నతనమునందే గ్రహించి జీర్ణించుకొన్నారు. భక్తి జ్ఞానవైరాగ్యములందే సదా వారిమనస్సు లగ్నమై యుండెడిది. వినోదములు ఆటపాటలన్న యిష్టపడెడివారు కాదు. ఏకాంతముగా ధ్యానమగ్నులై యుండెడివారు. పండ్రెండేళ్లప్రాయముననే మహారాష్ట్రనుండి తణుకు పట్టణమునకు విచ్చేసిన ఒకస్వామివారిని దర్శించి శ్రీకృష్ణమంత్రోపదేశమును, ఆశీస్సులను పొందినారు. చిన్ననాటినుండియు వీరిలో దాన గుణముఎక్కువగా ఉండెడిది. పేద విద్యార్థులకు జీతములు చెల్లించి పుస్తకములు బట్టలు వగైరాలు కొనియిచ్చెడివారు.

స్వామివారు గౌతమబుద్ధుడు, శంకర భగవత్పాదులు, శ్రీరామకృష్ణ పరమహంస, వివేకానందులచే చిన్నతనమునుండి ప్రేరణ పొందినారు.

ఇల్లువిడిచి సన్యసించు నుద్దేశముతో వీరు ముందుగా కలకత్తాలోని బేలూరు నందున్న రామకృష్ణ మఠమునకేగి తపస్సాధనలు ప్రారంభించిరి. నాటి మఠాధిపతులు శ్రీ స్వామి శివానందులవారు స్వామివారి భవితవ్యమును గ్రహించి మనస్ఫూర్తిగా నాశీర్వదించిరి.

గౌతమబుద్ధుని వలె సకల ఐశ్వర్యములను తృణప్రాయముగా నెంచి విరాగులై హిమాలయము లందు తీవ్రతపంబాచరించి నిర్వికల్ప సమాధులందినారు. బుద్ధుని జన్మస్థానమైన నేపాలు దేశపు టడవులయందు ఏకాంతప్రదేశమున కొన్నాళ్ళ తపోనిష్ఠులైయున్నారు.

శ్రీశంకరాచార్యులవారి భాష్యత్రయమునందు చిన్ననాటనే ప్రవేశమున్నట్లు తెలియుచున్నది. బదరికాశ్రమమున శంకరాచార్యులచే స్థాపింపబడిన జ్యోతిర్మఠసమీపమున కొంతకాలము తపస్సుచేసిరి.

అరణ్యావాసము, తీవ్రతపోజీవనమున పూర్ణబ్రహ్మానుభూతి పొందిన స్వామిజీ జర్మనీ ఇంగ్లాండు, అమెరికా దేశములందు వివేకానందుని వలె భారతీయ సంస్కృతి వేదాంతములపై యిచ్చిన ఉపన్యాసములు ఆయాదేశములను బాగుగా ఆకర్షించినవి. అందులో కొన్ని దార్శనిక మహా ప్రవచన, సైన్సు& రెలిజియన్ పేరిట ముద్రితములై బహుళప్రచారములో నున్నవి.

స్వదేశములో కళాశాల విద్యాభ్యాసము కూడాలేని స్వామిజీ తపస్సిద్ధులైన తర్వాత విజ్ఞానశాస్త్ర రహస్యములను శోధించదలచిరి. జర్మనీ ఇంగ్లండు, అమెరికాదేశములందు ప్రసిద్ధిచెందిన యూనివర్సిటీలలో అణుశాస్త్ర పరిశోధనలు జరిపి **M.Sc., D.Sc, Ph.D.**లేకాక మరెన్నో గౌరవ పురస్కారములను పొందినారు.

స్వామివారి అణుశాస్త్ర విజ్ఞానమును స్వదేశమునకు తిరిగి వచ్చిన తర్వాత దేశాభ్యుదయమునకు ఎంతయో ఉపయోగపడినది. నేషనల్ ఫిజికల్ లేబరేటరీ న్యూఢిల్లీలో అణుశాస్త్ర పరిశోధనవిభాగపు డైరక్టరుగాను, అటుతర్వాత ఆంధ్రవిశ్వవిద్యాలయమున న్యూక్లియర్ ఫిజిక్సు ప్రొఫెసరు గాను స్వామిజీ ఎంతో సేవచేసి యున్నారు. జ్ఞాన విజ్ఞాన శాస్త్రములందు రెంటియందును అనన్య సామాన్య పరిశోధకులు మన స్వామిజీ.

ఓం-నమో భగవతే శ్రీ జ్ఞానానందాయ

# కర్మ యోగము

మూలము
శ్రీ స్వామిజ్ఞానానంద

అనువాదము
శ్రీ భూపతిరాజు పద్మనాభ రాజు

సాధకుని ఆధ్యాత్మిక జ్ఞానము మీదవాని స్వభావ ప్రాబల్యముండును. సాధకుని స్వభావము ననుసరించి, సాధనములు వేరు వేరుగా నుండును. గుణముల ననుసరించి, స్వభావముల విధములు మారుచుండును.

**అవి, నాలుగు విధములు**

1.కర్మి, 2. భావవికారి, 3. యోగి, 4.వివేకి

1. కర్మి= ఎల్లప్పుడు, కర్మ చేయవలెననెడి స్వభావము కలిగిన వాడు.

ఇంద్రియ ప్రపంచము, ఇంద్రియ జ్ఞాత, వ్యక్తుల సారూప్యముగా భావించును, ఏ దైవ సాన్నిధ్యమున, సృష్టి, స్థితి, లయముల, చక్ర భ్రమణము కలుగుచున్నదో, దానిని, కర్మస్వభావ సాధకులు-దైవ కర్మ అని భావించెదరు, విశ్వ సంబంధమగు ప్రతికర్మయు దైవకర్మగా ఆరోపించెదరు. అట్టి కర్మల సత్క్రమ, పూర్ణ నిర్వాహణయే, సాధకుని ఆదర్శ జీవనము. ఆ ఆదర్శ జీవనము గడుపుచు తన యొక్క వృత్తులను, నిరోధించుటకు, ప్రయత్నించుటయే అట్టి జీవనమునకు సారము. వృత్తుల నిరోధమునకు గాను, ఒక, విధమగు మనస్థితినవలంబించుటకు సత్క్రమ కర్మాచరణ సాధనము. ఈ సాధక సహాయముచేత, వృత్తులయొక్క నిరోధమే కర్మయోగము.

కర్మచేయవలెనను, స్వభావముకలవారికి, ఇదియే ఉత్తమమైనది, శిక్షణలేనివాడు ఇంద్రియములచే ప్రేరేపింపబడి, చంచలుడును, క్రమరాహిత్యముకలవాడును అగును. ఇప్పుడు, సత్క్రమ కర్మానుసరణము వలన, ఇంద్రియములు మెల్లగా లోబడును, చాంచల్యము అనుభవముచేత, తగ్గును, సమగ్ర శిక్షణవలన, చాంచల్యము, క్రమరాహిత్యత వశమగును, క్రమశిక్షణకు, ఈ క్రింది ధర్మము లాచరించుట ముఖ్యము.

1. అహింస 2. సత్యము. 3. అక్రోధము 4. క్షాంతి 5.ఉదారత 6.మైత్రి 7. కరుణ 8.అమానిత్వము 9.బ్రహ్మచర్యము, 10. ఆర్జవము

ఈ 10సూత్రములు మొదటి నీతివర్గములు

ఇకరెండవ నీతి వర్గములు 1. శౌచము 2. ధైర్యము, 3. తితీక్ష, 4.అధ్యవసానము, 5.తపస్సు, 6.సంతోషము, 7.ముదితము, 8. స్వాధ్యాయము, 9. శ్రద్ధ, 10. భక్తి

**మొదటి వర్గము 1. అహింస:** మనో వాక్కర్మలచే, ప్రాణులను చంపుటకాని, బాధించుటకాని, మాని వేయుట. అహింస గుణమును ధృడముగా అనుసరించుటచే హృదయము క్రౌర్యరహితమగును.

**2. సత్యము:** వాఙ్మనస్సుల చేత, వాస్తవమును వాస్తవముగా ప్రకటించుటయందు సహజగౌరవ భావము కలిగియుండుట సత్యము అనబడును. ఈ గుణము, స్థిరపడగా, ఫలవంతమైన సత్కర్మలు చేయుటయందు ఎంతగుణము ఉన్నదో, భావము, వాక్కు, అంతటిగుణముగలవిగా అగును.

**3. అక్రోధము:** మిక్కిలి ప్రతికూల దశయందు కూడ కోపరహితస్థితియే అక్రోధము.

**4. క్షాంతి:** శత్రువులచే అత్యంత నీచముగా హింసించబడిననూ, ప్రశాంత భావముకలిగి, ప్రతీకారకాంక్ష కలిగియుండకుండుట. అపకారికి ఉపకారము చేయుగుణము క్షాంతి అనబడును.

**5. ఉదారత:** ప్రత్యుపకారము పొంద

వలెననెడి భావము లేశము మాత్రములేకుండా భిక్షముగాని, దానముగాని, ఇచ్చుటయందు ధారాళతను, నిస్సంకోచ హృదయమును కలిగియుండుట ఉదారత అనబడును. పైన చెప్పబడిన క్షాంతి, ఉదారతల, అభ్యాసము, స్వార్థ, త్యాగమును జనింపచేయును.

**6. మైత్రి:** సర్వప్రాణులయందు, ప్రేమ, వాత్సల్యములనుచూపుగుణము మైత్రి

**7. కరుణ:** ఔదార్యబుద్ధితో, ఇతరుల బాధలయందు, దయచూపుట, ఆ గుణ ప్రేరణవలన, ఇతరుల బాధలను, నివర్తింప చేయుగుణము కరుణ అనబడును. మైత్రి, కరుణ స్థిరపడగా, వాత్సల్యము, ప్రకాశింపబడును, దాని వెంబడి శుద్ధ ఉద్రేకభావములు జనించును.

**8. అమానిత్వము:** తోటి మానవులందరియెడ, వినయవిధేయతలు కలిగియుండుట-అమానిత్వమనబడును, ఈ గుణము ప్రతిష్ఠింపబడగా (అభిమానదోషము) అచటికి చేరదు, (దుర్గణము దరిచేరదు)

**9. బ్రహ్మచర్యము:** ఇంద్రియములను వాటి విషయములనుండి, ఎల్లప్పుడు మనస్సును దూరముగా ఉంచుటవలన ఐహిక సంబంధమయిన ఇంద్రియసంబంధమయిన, కోరికలను, ప్రయత్న పూర్వకముగానిరోధించుటయే, బ్రహ్మచర్యము. అట్టి నిరోధము వలన, వీర్య శక్తి రక్షింపబడి అనగా భద్రపరచబడి ఆ వీర్యశక్తి వోజస్సుగా మార్పు చెందును.

**10. ఆర్జవము:** సాధుత్వముతోను, నీతితోను న్యాయముతోను, శీలముతోను అందరికి, మంచి చేయుస్వభావము ఆర్జవమనబడును. అది ప్రతిష్ఠింపబడగా, ఉద్రేకభావములు తార్కిక భావములు నిర్మలమగును.

**రెండవ నీతి వర్గములు: 1. శౌచము :** దేహ శౌచము -దేహమున కవసరములగు, ఆహారము, నీరు, గాలి, వస్త్రములు, శుచిగా ఉంచుకొనుటను, శౌచమనబడును, వీటి నియమాచరణలవలన, దేహమునకు ఆరోగ్యము, శక్తి చేకూరును.

**2. ధైర్యము:** ఎట్టికేశములయందైనను, దుఃఖములయందైనను క్షోభ చెందక, రాబోవు, కార్యముల నెదుర్కొనుట, ధైర్యమనబడును

**3.తితీక్ష:** దుఃఖముగాని-చింతగాని, చెందక సకల, విపత్తులను, సౌమ్య భావముతో సహించుట తితీక్ష, ధైర్య, తితీక్షలు నెలకొనుటవలన, మనశ్శాంతి కలుగును, దానిని బట్టి ఇచ్ఛాశక్తి వృద్ధియగును.

**4.అధ్యవసాయము:** అధ్యవసాయమనగా అన్ని విధములైన కష్టములను, విపత్తులను, ఆటంకములను ఎదుర్కొని, సదా, సన్మార్గము, ననుసరించు స్వభావము. అధ్యవసాయము స్థిరపడగా, చాంచల్యము నశించి, మనో స్థైర్యము చేకూరును.

**5. తపస్సు:** ప్రయత్న పూర్వకముగా ఉపవాసములు మొదలుకొని కఠిన నియమములు, వ్రతములు, చేసి దేహమును, **తపింపజేయుట**, తపస్సు, దీని అభ్యాసమువల్ల కామ,క్రోధములు, ఇంద్రియ భోగాసక్తి తగ్గును.

**6. సంతోషము:** పరమార్థమును సాధించు సందర్భమున అప్రయత్నముగా లభ్యమయే పదార్థములతో, తృప్తి నొందుట సంతోష మనబడును, ఈ గుణము సిద్ధింపగా మనశ్శాంతి లభించును.

**7. ముదితము:** తోటి మానవుల యొక్క సుగుణాభివృద్ధియందు గాని, మహత్వమునందు గాని, సంతోష, సంతృప్తియనుభవము, ముదితము. అది ధృడపడగా హృదయము అసూయ రహితమగును.

**8. స్వాధ్యాయము:** విశ్వము యొక్క నిజమైన హేతువు, కనుగొనుటకు ప్రకృతి, పురుషులను గూర్చి, సరియైన, విమర్శనాత్మకమైన చింతన, స్వాధ్యాయము. పై చెప్పబడిన చింతన. తార్కిక బుద్ధి యొక్క స్వభావమునుండి ఉద్భవించును.

**9.** **శ్రద్ధ:** ఆధ్యాత్మిక సిద్ధాంతముల, యధార్ధ మానసికతృప్తి వలన, పరమసత్యమందు దైవ కర్మలయందు, పూర్ణ విశ్వాసము కలిగియుండుట శ్రద్ధ. అది జీవన పథమును సంస్కరించుటకు ప్రోత్సహించును.

**10. భక్తి :** ప్రేమాతిశయము, వలన, బ్రహ్మకర్మల నిర్వాహణయందు ఆత్రుత భక్తి యనబడును. పైనుదాహరించిన భక్తి వలన, ఒక భావ విశేషముదయించును. దానిచే, విషయవృత్తి నిరోధము సంభవము. స్వయంకృషి రహితమైన భూమికలయందు కూడా, తురీయావస్థల నొందింపచేయుటకు భక్తి యొక్క శక్తి పనిచేయును. అనంతరము రుజుభావముదయించును. విహిత కర్మాచరణ, కార్య నిర్వాహణములు, దైవకకర్మలని, సగౌరవముగా, మొదట విశ్వసింపబడును. ఈ భక్తి, విశ్వాసము, నమ్మకము, ఆకర్మలయందు, ఆసక్తి కలుగ చేయును. అందువలన విహిత కర్మాచరణ, నిర్వహణలయందు గట్టి ప్రయత్నము జరుగును, అపుడు, జయము సుఖమును, అపజయము, దుఃఖమును కలుగచేయును. కర్మఫలశక్తియే, దుఃఖాత్మక, చక్ర పరిభ్రాంతికి, నిజమైన కారణము. సత్సంగము, సరియైన, వివేకము వీటివలన లభించును. జ్ఞానఫలాసక్తిని నశింపచేయును, అవిద్య, అవివేకముల యొక్క వృత్తులుచే నిరుద్ధమగును (నశించును). కర్మ ఫలాసక్తి నశించిన పిమ్మట, కర్మలన్నియు, బ్రహ్మకర్మలుగా, భావించి వాటి ఫలితములెల్ల; బ్రహ్మమునకు చెందినవిగా భావించును. అట్టి అనాసక్తి మనశ్శాంతిని కలిగించును, ఏలనన, అందు, జయాపజయభావము లుండవు. అప్పుడు శాంతమైన, మనస్సుతో, కర్మలు ఆచరించును, కనుక, కర్మలాచరణయందు కౌశలము (నిపుణత) సిద్ధించును. అది దుఃఖ హేతువు అయిన సాధకుని, వృత్తులను చాలా వరకు నిరోధించును, కనుక, కర్మకౌశలమే యోగమందురు. (దైవపుణ్యము) కౌశలముతో అనగా సమత్వ భావముతో, కర్మము వల్ల సుఖదుఃఖములు సాధకుని చలింపచేయలేవు.

సమత్వభావము వల్ల దాగియున్న, అహంకారము, దుర్బలమగును, సమత్వభావముతో చేయుకర్మలయందు, నిరంతరానుభవము, మరల, మరల, కలుగుట వలన, దైవభావము, అలవాటుగా ఏర్పడును, నిత్యాభ్యాసము, (అలవాటు) వాసన రూపము దాల్చును, ఆ దైవ, వాసన, సిద్ధించిన పిమ్మట, అహంకార, వ్యాపారము లేకుండగనే, కర్మ జరుగును.

అహంకారము దుర్భల మగుటవలన, నియమిత కర్మాచరణమును ఆటంకపరచ జాలదు. కొద్ది అహంకార ముండిననూ, దైవ భావకర్మవాసనా వశమున, తాను కర్తను, కాననియు, బ్రహ్మసంకల్ప వశమున, కర్త కర్మను చేయుచున్నాడు, అను భావవిశేషము వర్ధిల్లును. ఇదియే కర్మయందు ఆకర్మానుభూతి. ఇట్టిస్థితి చేకూరిన పిమ్మట, విషయ వృత్తుల, పూర్ణనిరోధము ప్రారంభమగును, అన్ని పరిస్థితులయందు ఆకర్మయందు కర్మానుభూతి, భావము యొక్క, ఎరుక కలిగి యుండుటకు, ప్రయత్నమే ధారణ." దీర్ఘ నిరంతరాభ్యాసమువలన, ధారణ ధృడ ప్రతిష్ఠితమగును, అన్ని పరిస్థితుల యందు, ధారణ, యొక్క అవిచ్ఛన్న ప్రవాహము, ధ్యానము, ధృడవిశ్వాసముతోను, మిక్కిలి శక్తిమంతముగాను, ధ్యానము, అభ్యసించినయెడల జయము శీఘ్రతరమగును, అన్నిపరిస్థితులు విస్మరించబడి అవిచ్ఛిన్న జ్ఞాన ప్రవాహమువల్ల తన్మయత్వము కలుగును, అక్కడ తన్మయావస్థయందు అకర్మయందు కర్మానుభూతి కల్గును. ఏలయన సాధకుని, తన ఆంతరంగిక బాహ్య వ్యాపారముల యందు, భావ, రహితస్థితి, యందుకూడ, చైతన్యవ్యాపారముండును. ఆ కర్మ యందు కర్మానుభూతి యొక్క నిరంతర జ్ఞానము వలన, సకల వృత్తులు నిరోధింపబడును, అన్ని వృత్తులు నిరోధింపబడినను మిగిలినది కూడ, వృత్తియేకాని, ఈ వృత్తి భిన్నస్వభావముకలది, కాని, ఈ వృత్తి

దుఃఖహేతువు కాదు, తన్మయావస్థయందు, అత్యంత, అనాసక్తి భావముండుట వలన, దుఃఖహేతువు కాని ఈ వృత్తి, అన్ని ఇతర వస్తువులను, దగ్ధముచేసి, తన అస్తిత్వము పోగొట్టుకొనినట్లు యన్యవృత్తుల నశింపజేసి తాను కూడా నశించును, కాని అప్పటికిని ఆ వృత్తి యొక్క, ఆధారము యొక్క ఉనికి ప్రకటించు కొనుచుండును, (అశ్మితా త్యాగము) నేను అను భావము లేకుండుట, వలనను, నిరంతర అనాసక్తి భావ ప్రవాహము వలనను ఆ, ఆధారము యొక్క ఉనికి నశించును, తదుపరి అన్నియు నిరుద్ధములగును, అప్పుడు ఏ విధమయిన అధ్యాసకు ఆస్కారము లేనందున, ఏ పరమ సత్యము యొక్క ఉనికి వల్ల, ఈ విశ్వకర్మ అంతయు జరుగుచున్నదని చెప్పబడుచున్నదో అట్టి పరమ సత్యము, స్వీయ అమిధ్యారూప విభవములతో ప్రకాశించును.

ఇది పూర్ణసూత్రములయందు కర్మయోగ సంగ్రహము.

# ప్రబోధం!

*శ్రీ అల్లూరి వేంకట నరసింహరాజా*

చం. వరుసగ నీవు నే ననెడు
వంతులు చొప్పున పోవుచుందుమీ
ధరణిని వీడి; జీవన వి
ధానము వేరగు గాక ఎవ్వరున్
స్థిరముగ నుండ జాలరు; ప్ర
తిక్షణ మాయువు చెల్లుచుండు నీ
గురుతు మిగుల్చు కార్యముల
కున్ కృషి సల్పు మనంత సృష్టిలోన్

ఉ. పుట్టుక ఆదికాదు;చని
పోవుట అంతము కాదు; పుట్టినన్
గిట్టుటకోసమే: అదియు
కేవల మింకొక రూప మందునన్
పుట్టుట కోసమే! సలుపు
పుణ్యము పాపము జీవకోటులన్
నెట్టును పైకి క్రిందికి న
నేక విధమ్ముల నమ్ము తమ్ముడా!

# శ్రీ స్వామీజీ దివ్యసూక్తులు

*శ్రీ ముదునూరి సత్యనారాయణరాజు*

ది. **26-9-58** తేదీన తూ॥గో॥జిల్లా తునిలో దివ్యజ్ఞాన సమాజపు వార్షికోత్సవములో పాల్గొనుటకు వాల్తేరునుండి తుని వేంచేసిన సందర్భమున డా॥ జ్ఞానానందస్వామిజీ వ్యాసకర్తను వచ్చి కలుసుకోవలసినదని కబురు పంపిరి. స్వామివారి పిలుపుపై సత్యనారాయణ రాజు వెళ్ళి ఆరోజు శాస్త్రమత సామరస్యముపై శ్రీ స్వామివారి మహోపన్యాస మందలి ముఖ్యాంశములు, తునిలో వారు బసచేసిన శ్రీరాజా వత్సవాయి వామనమూర్తిరాజుగారింటి వద్ద పెద్దలతో చేసిన సంభాషణ వివరములు, రికార్డుచేసుకొను నవకాశము కల్గినది.

**శాస్త్రమత సామరస్యము :** "మతము వలెనే శాస్త్ర లక్ష్యము కూడా పరమాత్మదర్శనమే. ప్రాచీన భారత దేశములో ఋషులు మతము, శాస్త్రము, అంటే ఖగోళశాస్త్రము, వైద్యము, జ్యోతిష్యము మొదలగు శాస్త్రములను సమముగా వృద్ధిచేయుటవలన భారత దేశము ఔన్నత్య దశననుభవించినది. మతముతో పాటు, శాస్త్రమును అభివృద్ధి చెయ్యకపోతే దేశమునకు క్షీణదశవచ్చును. అందుచేత శాస్త్రవిజ్ఞాన మత సామరస్యము వ్యక్తిగతముగా, సాంఘికముగా కూడా అవసరము.

**వివాహవ్యవస్థ :** పురుషునిలో శేముషి తత్త్వమధికముగా నుండును. స్త్రీ యందు రసతత్త్వము (emotion) అధికముగా నుండును. బౌద్ధిక తత్త్వము, రసతత్త్వముల యొక్క సామరస్య సాధనమునకే ప్రాచీన ఋషులు వివాహ వ్యవస్థను ఏర్పరిచినట్లు శ్రీ స్వామీజీ వాక్రుచ్చిరి.

**విద్య-అవిద్య :** "ప్రకృతి భగవంతుని యొక్క వ్యక్తరూప మనుకొన్నంతవరకు అది సత్యము కాని 'అహం', 'నాది' యన్నంతవరకు అది మిధ్య. ప్రకృతిని మిధ్య, తుచ్ఛము అని ఎన్నడూ త్రోసిపుచ్చరాదు. అప్పుడే ఏకాగ్రత కుదురుతుంది. భిన్న భిన్న చింతనా స్వభావమునుగూడా భగవత్స్వరూపముగా నెంచవలయును. అదే జ్ఞానరూపము పొందుతుంది. కేవలం విద్యను తెలిసినవారు జ్ఞానులు కారు. కేవలం 'అవిద్యను' తెలిసిన వారు జ్ఞానులు కారు. విద్య అవిద్య రెంటిని గ్రహించినవారే జ్ఞానులు. ఈ సందర్భంగా స్వామీజీ అన్నదమ్ముల కథ (బుద్ధి, రస తత్త్వము) చెప్పినారు.

కాశిలో శ్రీ శంకరాచార్యులు వారు పంచముడిని ఆవలికి తొలగుమని ద్వైతము ప్రదర్శించిన వైనము వివరించిరి, యోగులు తపస్యనంతరము లోకములో ప్రవేశించి అద్వైత తత్వమును మరువకూడదనియు, ముక్తిని పొందుటకు అరణ్యమునందు తపస్సు చేయుటయేగాక ఇంకను మార్గము లున్నవని చెప్పి తమ యుపన్యాసము ముగించారు.

ది. **26-9-58** తేదీన శ్రీ స్వామివారు భోజనానంతరం తమవద్ద హాజరుగా నున్న పెద్దలతో చేసిన సంభాషణలో వారి జీవిత చర్య, తపస్సు, విదేశ విద్య గురించి వివరించారు.

తాము స్విట్జర్లాండు దేశమునందుండగా క్షయరోగులకు వెల్లుల్లి రసము నిచ్చుట చూచినట్లు చెప్పి వెల్లుల్లి రసము క్షయరోగమునకు చక్కని మందుగా పేర్కొని ఉల్లి రజోగుణమును పుట్టించినా తమోగుణమునుండి రజోగుణమునకు అనగా ఒక మెట్టుపైకి తీసుకొనివెళ్ళుటవలన మంచిదేనని చెపుతూ, అప్పుడు దాని నుండి అత్యాహారము తగ్గించుట వలనను, సచ్చింతన, సత్సంగత్వము వలనను సత్త్వగుణములోనికి మార్చవలయునన్నారు.

# శ్రీ స్వామీజీ సన్నిధిలో నా అనుభూతులు

*- శ్రీ దంతులూరి భాస్కరరాజు*

నాకు మొదటి నుంచీ అంతగా ఆధ్యాత్మికమైన ఆసక్తులు లేవు. అయితే మా ఇంట్లో 1969 నుంచి శ్రీ స్వామీజీ జయంతులు జరుపుతూ వచ్చారు. మా కోపల్లెలో శ్రీ స్వామీజీ భక్తులుండేవారు.

1962లో ఆత్రేయపురంలో గణపతి ఆలయం ప్రతిష్ఠచేశారు. అసలు శ్రీ స్వామీజీని చూడాలని నాకు కోరిక ఎట్లా కలిగిందంటే మాకు బంధువు, బావగారి వరస హిందీమాస్టరు గారొకరుండేవారు. వారు విలువిద్యను గూర్చి ఒక పుస్తకం వ్రాశారు. ఈ వ్రాతప్రతిని స్వామీజీకి చూపించాలని, వారితో సంప్రదించాలనీ కుతూహలం కలిగింది. ఈ విలువిద్య గ్రంథకర్తగారు ఇందుకూరి గోపాలరాజు. మేమిద్దరం కలిసి వైజాగ్ వెళ్ళి స్వామీజీని కలుసుకుందామనుకున్నాం. వైజాగ్ వెళ్ళాం. అయితే శ్రీ స్వామీజీ అప్పుడు వైజాగ్‌లో లేరు. ఋషీకేశ్ వెళ్ళిపోయారని తెలిసింది. పుస్తకం ఆశ్రమంలో ఇచ్చాము.

శ్రీ స్వామీజీని నేనూ శ్రీ బాపిరాజుగారూ శ్రీరామజ్ఞానమందిర గృహప్రవేశ సందర్భంగా దర్శించాము. 1962లో ఎడ్లు కొనటానికి తుని వెళ్ళాను. అప్పుడు శ్రీ స్వామీజీని చూడాలని వైజాగ్ వెళ్లాను. 1963లో మళ్ళీ వైజాగ్ వెళ్ళాను. శ్రీ స్వామీజీ నాకు ఎదురుపడ్డారు. "పుస్తకం చూశాను. ఆశ్రమం దగ్గరే వెళ్ళండి" అని చెప్పారు. అప్పటి నుంచి శ్రీ స్వామీజీతో నాకు సన్నిహిత పరిచయం ఏర్పడింది. చివరికాలంలో వారు అనారోగ్యంతో ఉండగా సేవించుకునే భాగ్యం కూడా దక్కింది.

## సాధు సంగం - సాధన

తేలేదానిని బరువులతో నింపి ముంచవచ్చు. అట్లే సాధు సాంగత్యం గూడ మనస్సు వ్యున్మగ్నం కావడానికి సాయపడుతుంది.

అట్టి సాధు సంగం, దైహికమూ, మానసికమూ. ప్రత్యక్షుడగు గురువు మనస్సును లోనికి నెట్టుతాడు. గురువు అన్వేషియే గాక, హృదయస్థితుడు గూడా. కనుక అంతర్ముఖియైన మనస్సును హృదయం లోనికి ఆకర్షిస్తాడు.

ధ్యానాదుల నారంభించి, దాని కష్టమెరిగిన వారికే ఈ సంశయాలు వస్తాయి. అట్టివాడు శ్వాసానురోధం కొద్దిగా అభ్యసించినా వాని మనస్సు శుద్ధమవుతుంది. ఇపుడు వాని మనస్సును హృదయంలోనికి చొరనీకుండా నిద్రాణములై యున్న వాని వాసనలు అడ్డగిస్తాయి. వానిని అశక్తాలు చేస్తే మనస్సు నిశ్చలంగా శాంతంగా ఉంటుంది.

శ్వాసానురోధం వల్ల మనస్సు అణగడం తాత్కాలికమే. వాసన లింకా ఉన్నందున, మనస్సు ఆత్మగా తీరినపుడు, అవి యిక బాధింపవు. ఇది ధ్యానం వల్ల సమకూరుతుంది"

*- శ్రీ రమణ భాషణములు పుట. 213*

ఓమ్ నమో విఘ్నేశ్వరాయనమః

# ఆధ్యాత్మిక పూర్ణయోగమార్గదర్శకులు

*వేదాంత భాస్కర శ్రీ కలిదిండి నారాయణరాజు*

భారతీయ ఋషివరేణ్యులు ప్రాచీన కాలంలోనే, గణిత, భౌతిక, ఖగోళ, వైద్య మొదలైన శాస్త్రాల్లో అపారమైన కృషికూడా చేశారు, మానసిక శాస్త్రాల అపూర్వ రహస్యాలను, కనిపెట్టి ఆధ్యాత్మిక వికాసానికి, ఎంతో సాధన సల్పి కృతార్థులైనారు.

మన మాతృభూమియైన ఈ భారతదేశం, మహర్షులకు యోగులకు, ప్రవక్తలకు ప్రసిద్ధి కెక్కింది. వారు ఈ భారతదేశంలోనే జీవించి, ఒక మహత్తరమైన సనాతన ధర్మమును, సంస్కృతిని, ఆత్మసాక్షాత్కార మార్గమును, జ్ఞాన విజ్ఞానానుభవములను, మనకు, వారసత్వంగా, ప్రసాదించి వెళ్లారు. ఆకోవకు చెందిన భౌతిక-ఆధ్యాత్మిక సమన్వయానుభవ తత్వవేత్త పూజ్యశ్రీ స్వామి జ్ఞానానంద గురుదేవులు. వారు ముక్కు మూసుకొని మోక్షచింతకొరకు, ఏ కొండగుహలలోనో ఉండేవారని అనుకోవటం పొరపాటు. ఆ విధంగా వారు భగవత్సాక్షాత్కారము పొందినా, భౌతిక విజ్ఞాన విషయాలను విస్మరించినవారు మాత్రము కారు. కాబట్టి వారి వైజ్ఞానిక ప్రగతి, మరియు ఆ బోధను బట్టి మనం గ్రహించవలసిన దేమనగా? బ్రహ్మాండాకృతిగా, ఈ ప్రపంచమంతటా నిండి యుండెడి ఆ స్వప్రకాశ దివ్యజ్యోతి స్వరూప లక్ష్యమే, మనకు శరణ్యమని, ఆ స్వప్రకాశంనే ధ్యానిస్తూ, ఆ దివ్యశక్తి సామర్థ్యంతో, దివ్యజీవనులై వర్తించాలని, వారి దివ్యసందేశ సారాంశమని, గ్రహించి, అద్దానిని అనుసరించుచూవారి కృపకు పాత్రులమౌటయే మనకర్తవ్యమని మనవి చేయుచున్నాను.

శ్రీ కృష్ణపరమాత్మ ద్వారా అర్జునునకు పురుషోత్తమప్రాప్తి జీవిస్తూ ఉండగనే, సంప్రాప్తమైనది కాని, మరణించిన తర్వాత లభించే మోక్షముకాదు. అందుచేతనే మనము దీపముండగనే ఇల్లు చక్కబెట్టుకోవలెను. మాయను గురించి ముఖ్యంగా మనం గమనించవలసి విషయమే మనగా? మాయ అనబడే ప్రకృతి, రెండు విధములుగా, గోచరించుచూ ఉంటుంది అందు ఒకటి దృశ్యప్రకృతి, రెండవది అదృశ్యప్రకృతి.

దృశ్యప్రకృతి, బయట మనకు కనిపిస్తూనే ఉంటుంది. అదృశ్యప్రకృతి, కనబడకుండా మనలోపల ఉంటుంది సాధారణంగా బైట ప్రకృతిలో మానవుడు జీవిస్తూవుంటాడు. మానవునిలో జీవిస్తూ ఉంటుంది. లోపల ప్రకృతి బైట ప్రకృతిని, సృష్టి అని అంటారు; లోపల ప్రకృతిని, అనగా? అదృశ్య ప్రకృతిని స్వభావం అని అంటూ ఉంటారు.

ఇందుగల చిత్రమేమనగా? మానవునికి, బైట ఉన్న నిసర్గం అనగా? సృష్టి, మానవుని లోపల ఉన్నస్వభావం మీద ఎంతో ప్రభావాన్ని వేస్తూ ఉంటుంది. మరొక చిత్రమేమనగా? మానవ ప్రకృతి, తన ప్రభావాన్ని బైట ప్రకృతిమీద వేయలేదు. కాని బైటప్రకృతి మాత్రం తనప్రభావాన్ని మానవ ప్రకృతి మీద వేయగలదు. అయినప్పటికీ బైట ప్రకృతితో మానవునికి మాత్రం నిత్యమూ ఎంతో అవసరమైయున్నది. దీనిని కాదనే వారెవరూ ఉండరనినా అభిప్రాయము.ఈ విధంగా, ప్రకృతికి, జీవునికి,పరమాత్మకుగల అవినాభావ సంబంధము, యొక్క రహస్యములను. తెలుసుకొని, సాధన రీత్యా, భౌతిక, ఆధ్యాత్మిక సమన్వయ అనుభవ పూర్ణయోగ సిద్ధిని పొందిన మహనీయులు శ్రీమత్ పూజ్యపాద శ్రీ స్వామి జ్ఞానానంద సద్గురు దేవులు. "అహమ్ బ్రహ్మాస్మి" అనుమహా వాక్య అనుభవం సాధించారు స్వామిజ్ఞానానంద గురుదేవులు.

పరమగురుదేవులు

# శ్రీ జ్ఞానానంద మహరాజ్

*శ్రీ మేడూరి వేంకట సోమేశ్వర కృష్ణమూర్తి*



నేను శ్రీ జ్ఞానానంద మహరాజ్ అత్యంత ప్రియశిష్యులైన శ్రీ ప్రజ్ఞానానంద స్వామి శిష్యుడను. అందుచేత శ్రీ జ్ఞానానంద యతీంద్రులు నా పరమగురుదేవులు. నేను పశివేదల హైస్కూలులో ఉపాధ్యాయునిగా జూలై **1976** నుండి ఆగష్టు **1977**వకు పనిచేశాను. ఆ సమయంలో నేను పశివేదల చిదానందాశ్రమములో నివసించే మహాద్భాగ్యం శ్రీ ప్రజ్ఞానానంద స్వామివారి కృపచే లభించింది. ఆ ఆశ్రములో ఉన్న సుమారు సంవత్సరకాలం నా జీవితములో మరువరాని, మరువలేని సువర్ణాక్షరాలతో లిఖింపదగిన పవిత్ర సమయము. శ్రీ తులసీ రామాయణము నేను వ్రాసినది ఆ సమయములోనే. ఆంధ్రప్రదేశ్ హైస్కూళ్ళలో పనిచేయు హిందీ ఉపాధ్యాయులలో ఉత్తమోత్తమ ఉపాధ్యాయుడనని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వముచే హిందీలో సన్మానితుడైనది నేనొక్కడనే. అది కూడా జరిగినది ఆ సంవత్సరంలోనే. తణుకులో 'సీతారామ నివాసము' అనే గృహాన్ని నిర్మించుకొన్నదీ అదే సమయము లోనే. ఈ మూడు విజయాలు సాధించినది నేను చిదానందాశ్రమము, పశివేదలలో నున్న కాలమందే. ఇదంతయు గురుదేవుల, పరమగురుదేవుల ఆశీర్వాదఫలితమని వేరే చెప్పనక్కరలేదు.

మా గురుదేవులు శ్రీ ప్రజ్ఞానానంద స్వామి నాకు శ్రీరామమంత్రము, శ్రీ ప్రసన్నాంజనేయమంత్రము ఉపదేశించారు. బాల్యమునుండి నాలో భక్తి భావాన్ని ప్రజ్వలింపజేశారు. తాను డిశంబరు, **1982**లో స్వామి జ్ఞానానందుల జయంతికి వెళ్లుచు, అప్పటికి కొంచె అస్వస్థులై ఉండుటచే సహాయమునకై నన్నుకూడా తన వెంట గొరగనమూడి తీసికొనివెళ్లి

ప్రప్రథమముగ ఆ మహోత్సములో పాల్గొనే మహాద్భాగ్యము కలుగజేశారు. శ్రీ ప్రజ్ఞానానంద స్వామి 14సెప్టెంబరు 1983లో బ్రహ్మీభూతులయ్యారు. నాటినుండి నేటివరకు శ్రీ గురుదేవులు పెట్టిన ఒరవడిలో ప్రతీసంవత్సరము క్రమము తప్పకుండ గౌరగనమూడి వెళ్లి శ్రీ జ్ఞానానందుల వారి జయంతిలో, ఇంకను అప్పుడప్పుడు జరిగే స్వామివారి ఉత్సములలో పాల్గొంటున్నాను.

శ్రీ జ్ఞానానందల వేరొక ప్రియశిష్యులైన శ్రీ ప్రణవానందస్వామి వారి కృపచే వారు హిందీలో వ్రాసిన కైలాస మానస సరోవర్ అనే గ్రంథాన్ని వారి అజ్ఞపై ఆంధ్రములోనికి అనువదించి వారికి అందజేశాను. ఆ గ్రంథము ముద్రితమై, వెలువడగలదని ఆశిస్తున్నాను. వారి ఆశీర్వాదంతో శ్రీ చక్రంపొంది 30-11-86 నుండి నేటి వరకు భక్తి పూర్వకముగ అర్చన చేస్తున్నాను. శ్రీ జ్ఞానానందుల వారి సోదరులు శ్రీపద్మనాభరాజు గారి ఆదేశముపై శ్రీ జ్ఞానానందుల వారి సంక్షిప్త జీవిత చరిత్ర హిందీలో వ్రాసి వారికి సమర్పించుకొన్నాను. అది కూడ ప్రచురితము కావలసియున్నది.

శ్రీ జ్ఞానానంద, శ్రీ ప్రజ్ఞానానంద శ్రీ ప్రణవానంద వీరే నాకు బ్రహ్మ విష్ణు, మహేశ్వరులైన త్రిమూర్తులు. ఈ త్రిమూర్తుల ఆశీర్వాదబలంచేత శ్రీ తులసీ రామాయణము, శ్రీరామతత్త్వము, దేవీమాహాత్మ్యము, శ్రీరామామృతము అనే ఆధ్యాత్మిక గ్రంథములను రచించి ప్రచురించగలిగాను. ఈ గ్రంథములందలి భాష, భావము, స్పష్టీకరణము నాది కాదు, అది ఆ త్రిమూర్తులదే, వారిచ్చిన ఆధ్యాత్మిక శక్తియే.

మా గురుదేవులు శ్రీ ప్రజ్ఞానానందస్వామి వారిని, నేను చిదానందాశ్రమంలో ఉన్న సంవత్సరము కాలంలో ప్రతిరోజు రాత్రి 8గంటలనుండి 10గంటల వకు దర్శించి వారి పాద సన్నిధిని కూర్చుండేవాడను. ఆ సంవత్సర కాలంలో వారు నాకు అనేక ఆధ్యాత్మిక విషయాలు చెప్పేవారు. చెప్పిన విషయాలలో నిత్యం తప్పక వారి గురుదేవులైన శ్రీ జ్ఞానానందుల విషయం ఉండేది. తమగురుదేవులను గురించి చెప్పేటప్పుడు వారికంఠము గద్గదమయ్యేది, కండ్లనుండి ఆనందాశ్రువులు రాలేవి. తమగురుదేవులు Saint గా, Scientist గా సాధించిన విజయాలు అత్యంత సన్నిహితముగా వారితో మెలగుటచే వివరముగా చెప్పేవారు.

ఈ గురుశిష్యుల సంబంధము ఎంతటి గాఢమైనదంటే ఎవరైనా శ్రీ జ్ఞానానందుల వారిని కలిసి ఏ ఆధ్యాత్మిక విషయమైనా చర్చిస్తే, తనకు తోచినది చెప్పి ``మీరు ప్రజ్ఞానానందను కూడ ఒకసారి కలవండి" అనేవారుట. శ్రీ ప్రజ్ఞానానందును ఎవరైనా కలిస్తే తమకు తోచినది చెప్పి ఇదంతయు నాగురుదేవులు నాకు చెప్పినదే అని గురువుపట్ల తనకున్న భక్తిభావము ప్రదర్శించేవారట! ``ఎక్కడైనా సభజరిగితే శ్రీ జ్ఞానానందులవారు కొంతకాలము ప్రసంగించి, మిగతా విషయాలు శ్రీ ప్రజ్ఞానానంద చెబుతారు" అనేవారట. ఆ గురుశిష్య సంబంధము అంత పవిత్రమైనది.

మా గురుదేవులు తమగురుదేవులను గురించి చెప్పుచు-``వారు ప్రేమమూర్తి, వారి వదనంలో ఏదో తన్మయత్వం ఉండేది. మాటలు కొంచెమైనా భావము ఎంతో ఉండేది. ధ్యాన విషయం, భక్తివిషయం సంప్రదిస్తే చక్కని సలహానిచ్చి ప్రోత్సహించేవారు"

శ్రీ చిలుకూరి వీరభద్రశాస్త్రిగారు (రిటైర్డ్ తెలుగు లెక్చరర్, డి.యస్.ఆర్. కాలేజి, భీమవరం) శ్రీ జ్ఞానానందులను కలిసి తాను చేసే సాధన చెప్పితే -"శాస్త్రిగారూ! అంతటితో ఆపేయండి. ఇకముందుకు వెళ్ళితే మీరు గృహంవిడి వెళ్ళవలసి వస్తుంది" అని హెచ్చరించారుట.

బొమ్మ,బొరుసు ఉంటేనే నాణెము. ఏదిలేకపోయినా నాణెముకు విలువ ఉండదు. అదే విధంగా Saint, Scientist రెండూ ఉండుటచేతనే శ్రీ జ్ఞానానందులు పరిపూర్ణ

స్వరూపులయ్యారు.

తమ గురుదేవులను గురించి మా గురుదేవులు శ్రీ ప్రజ్ఞానానందస్వామి ఈ విధంగా చెప్పేవారు-"మాగురుదేవులు స్వామి జ్ఞానానంద అవధూత, అతులిత ఐశ్వర్య సర్వసంగ పరిత్యాగులు. హిమాలయ పర్వత గుహలలో బ్రహ్మైక్యానుభావంతో తపస్సు చేసిన మహాత్ములు. విద్యుత్పరమాణు తత్త్వ విజ్ఞాన శాస్త్రములో పారంగతులు. మా గురుదేవులు హిమగిరి పుణ్యభూములలో చేసిన తపస్సు వర్ణనాతీతము. మా అన్నగారు శ్రీ రామబ్రహ్మంగారు మరియు శ్రీ జ్ఞానానందులు ఇంచుమించు ఒకేవయస్సువారు. బాల్య స్నేహితులు. నా అన్నగారి ద్వారా శ్రీ జ్ఞానానందులవారితో పరిచయమేర్పడి, అది దృఢపడి నాకు వారి శిష్యులయ్యే మహద్భాగ్యం లభించింది. మా గురుదేవులు తమ పితృదేవుల కోరికపై గౌరగనమూడిరాగా, నేను `ఆచార్యవాన్ పురుషోవేద' అను శ్రుత్యుక్త విధిననుసరించి 24-11-1924న శ్రీ సద్గురు శ్రీమత్ జ్ఞానానంద యతిచంద్రుల పాదాశ్రయమునొంది సన్యాస మతస్థబ్రహ్మ సంధాన దీక్షను పొందాను. మా గురుదేవులు గంగోత్తరి సమీపంలోగల గౌరీకుండ్ దగ్గర గల గుహలో తపస్సు చేసిదానికి 'శాంతిగుహ' అని నామకరణము చేశారు. ఈ గంభీర ఏకాంత గుహాంతరమున పూజ్యపాద జ్ఞానానంద యతి చంద్రులు అఖండాద్వయ బ్రహ్మైక్య రసానంద సమాధినిష్ఠల దేలుచు స్వానుభవసిద్ధమైన 'పూర్ణసూత్రములను' భక్త జనావళి శ్రేయస్సునకై రచించారు.

భౌతిక పరమాణుతత్త్వ శాస్త్రమునకును, ఆధ్యాత్మిక పరతత్త్వ శాస్త్రమునకును, గల వైలక్షణ్య సారూప్యతలను పరిశోధించి సమన్వయాత్మకముగ సత్యం, జ్ఞాన మనంతమ్ బ్రహ్మ, ఏకమేవాఽ ద్వితీయం బ్రహ్మ, బ్రహ్మణోర వ్యక్తం అవ్యక్తాన్ మహత్, మహతోఽహంకారః, అహంకారాత్ పంచతన్మాత్రాణి, పంచతన్మాత్రేభ్యో పంచభూతాని పంచ మహాభూతేభ్యోఽఖిలం జగత్" అను శ్రుతి ప్రకారం ఏ కాద్వితీయా అదిష్ఠాన బ్రహ్మ తత్త్వమును సిద్ధాంతీకరింపదలచి శ్రీమత్ పరమగురు జ్ఞానానందయతి చంద్రులు జర్మనీ దేశమునకు వెళ్లారు. యూరప్ ఖండమున భౌతిక అణుతత్త్వ పరిశోధనలు దిగ్విజయముగ కొనసాగించి భారతావనికి వచ్చి శ్రీ పరమ గురువరేణ్యులు శ్రీమత్ స్వామి జ్ఞానానందులను దర్శించి సేవించు నిమిత్తము ఆ సమయమున బదరీనాయణ క్షేత్రమునందుగల నేను వారి యొద్దకు వెళ్లి కొంతకాలము వారిని సేవించి పిదప శ్రీ జ్ఞానానంద యతివరేణ్యులు తపస్సుచేసి నిర్వికల్ప బ్రహ్మానుభూతిని పొందిన 'ఝూడిసిర' అను పుణ్య ప్రదేశమునకు వెళ్లి అక్కడ కొంతకాలము గడిపినాను.

శ్రీమత్ పరమగురు పూజ్యపాదస్వామి జ్ఞానానంద పుంగవులు బహువత్సరములు యూరప్, అమెరికా ఖండాంతరముల పరమాణు తత్త్వభౌతిక విజ్ఞానశాస్త్ర పరిశోధనలను పరమ సత్యాన్వేషణాను భూతిలోని భాగముగ కొనసాగించి డి.యస్సి. (ప్రాగ్) పిహెచ్.డి. (లివర్పూల్), యఫ్.ఇన్.స్టి.పి. మెంబరు సిగ్మాక్సై (యు.యస్.ఎ) పట్టవిభూషితులై డాక్టర్ స్వామి జ్ఞానానంద అనే ప్రఖ్యాతనామంతో భారతదేశానికి భక్తుల ప్రార్థనపై 1947 సంవత్సరములో తిరిగి వచ్చారు.

ఇది పరమాణుతత్త్వయుగమగుటచే డాక్టర్ స్వామి జ్ఞానానందుల రాకను, వారి ప్రతిభను అప్పటి పార్లమెంటు స్పీకర్ శ్రీ మావలంకర్‌గారి వలన తెలిసికొని అప్పటి ప్రధానమంత్రి పండిత నెహ్రూగారు శ్రీమత్ జ్ఞానానంద స్వామివారిని ఢిల్లీకి ఆహ్వానించి తాము నూతనముగ నిర్మింపజేసిన నేషనల్ ఫిజికల్ లేబొరేటరీ యందు పరమాణుతత్త్వ పరిశోధన ఎలక్ట్రానిక్స్ విభాగ అధిపతిగ నియమించారు. స్వామివారు ఆ లేబొరేటరీలో వివిధ పరిశోధనలను ప్రాభవముతో నిర్వహించారు. అంతేగాక శ్రీస్వామి వారు ఢిల్లీలో

ఆంధ్రా ఎడ్యుకేషన్ సొసైటీకి అధ్యక్షులుగా కూడ వ్యవహరించేవారు. శ్రీ స్వామివారి ప్రతిభా విశేషములను వినిన ఆంధ్రా యూనివర్సిటీ అప్పటి వైస్ ఛాన్సెలర్ శ్రీ. వి.యస్. కృష్ణగారు పూజ్యస్వామి వారి ఆధిపత్యమున ఆంధ్రా యూనివర్సిటీ యందు న్యూక్లియర్ ఫిజిక్సు రిసెర్చి లేబొరేటరీలను స్థాపింప దలచి పండిత నెహ్రూగారి అనుమతి బడసి డాక్టరు స్వామి జ్ఞానానందులను ప్రార్థించి వాల్తేరు తీసికొనివచ్చి ఆంధ్రయూనివర్సిటీ యందు న్యూక్లియర్ ఫిజిక్సు రిసెర్చిలేబొరేటరీలను స్థాపించి పూజ్య స్వామివారి యాజమాన్యమున ఉంచారు. ఆ లేబొరేటరీల విశాల భవనాలను శ్రీ స్వామివారికి పరిచితులైన అప్పటికేంద్రమంత్రి శ్రీ సి.డి. దేశముఖ్‌గారు ప్రారంభోత్సవము చేశారు. ఈ లేబరేటరీ యందు పూజ్యస్వామివారి యాజమాన్యమున పలువురు రిసెర్చిస్కాలర్లు పరిశోధనలు సల్పి డాక్టరేట్లు పొంది భారతదేశ మందును, ఇతర దేశములందును ఖ్యాతి వహించి పదములందియున్నారు. పరమాణు తత్త్వ జిజ్ఞాసులు కూడ పూజ్యస్వామి జ్ఞానానందుల దగ్గరకు వచ్చి ఆధ్యాత్మిక తత్త్వ సాధనాక్రమమును పొందెడివారు. పూజ్యస్వామివారి ప్రియభక్తులైన విజయనగరమహారాజా శ్రీ పి.వి.రాజుగారు విశాఖ పట్టణమందలి వారి భవనములచెంత శ్రీ స్వామివారి నివాసార్థము ఒక చక్కని భవనమును నిర్మింప చేసారు. ఆ భవనమునకు పూజ్య జ్ఞానానందస్వామివారు `జ్ఞాన విజ్ఞాన విహార్' అని నామకరణము గావించారు. శ్రీ పి.వి.జి.రాజుగారు స్థాపించిన `Maharaja Alak Narayana Society of Arts and Sciences, Vizianagaram' అను సంస్థకు పూజ్య జ్ఞానానందస్వామి వారి అధ్యక్షులుగ ఉండేవారు.

నేను అవసరమైనప్పుడు చిదానంద ఆశ్రమము, పశివేదల నుండి వాల్తేరువెళ్లి సద్గురుదేవులు శ్రీజ్ఞానానంద యతి చంద్రుల క్షేమ మరయుచుసేవోపచర్యలను సల్పుచుండెడి వాడను.

**3-12-1956**న శ్రీమత్ పూజ్యపాదస్వామి జ్ఞానానంద పరమగురువుల షష్టిపూర్తి మహోత్సవము గౌరగన మూడిలో శ్రీరామజ్ఞాన విజ్ఞాన మందిరమందు వైభవముగ జరిగింది. శ్రీవారి భక్తకోటి ఈ పవిత్ర కార్యక్రమములో పాల్గొని మహావైభవోపేతముగావించారు. వివిధ దేశముల నుండి, దేశమందలి వివిధ ప్రాంతముల నుండి ప్రముఖులు పంపిన శుభాకాంక్షలు నేను సభాముఖమున చదివి వినిపించాను. అంతియేగాక, ఆనాడు "అణోరణీయాన్ మహతో మహీయాన్ అనుశ్రుతి వాక్య సమన్వయ సగుణ నిర్గుణ స్వరూపులై భౌతిక, ఆధ్యాత్మిక తత్త్వ సమన్వయ స్వరూపులై విరాజిల్లు శ్రీమాన్ పూజ్యపాద జ్ఞానానంద యతిచంద్రుల మహత్త్వమును, ఇట్టి మహాత్ముల దర్శన, స్పర్శన, భాషల, సాన్నిధ్య, వందనాదుల విశేషమును, ఇట్టి మహాత్ముని షష్టిపూర్తి మహోత్సవము ప్రాముఖ్యము నుగ్గడించుచు నేను సభా ప్రారంభమున పరిచయ వాక్యములు నుడివాను. ఆనాటి సభలో భీమవరం కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీ లక్ష్మీనాథరావుగారు, డాక్టర్ కర్నల్ డి.యస్.రాజుగారు. శ్రీ పి. వి. నరసింహ రాజుగారు, శ్రీ చిలుకూరి వీరభద్రశాస్త్రి గారు, శ్రీముదుగంటి జగ్గన్నశాస్త్రిగారు, శ్రీ ధూళిపాల అర్కసోమయాజులుగారు, శ్రీ కాళీపట్నపు కొండయ్యగారు, శ్రీ చెరకువాడ వెంకట నరసింహం పంతులుగారు, శ్రీవారణాసి రామబ్రహ్మంగారు (మాఅన్నగారు) శ్రీ అళగిరి అప్పలనరసింహంగారు మున్నగు వారు శ్రీజ్ఞానానంద యతిచంద్రుల మహత్త్వము ప్రస్తుతించుచు ప్రసంగించారు.

శ్రీమత్ పరమగురు పూజ్య శ్రీ జ్ఞానానంద యతిచంద్రులు భక్తసభాసదులనాశీర్వదించుచు వారి అమూల్య సందేశాన్ని ఈ విధముగా ప్రసాదించారు.

"నా ఉన్నత ఆధ్యాత్మిక పథమును వీడి నేనేల భౌతిక ప్రాపంచిక వాద సంబంధమగు భౌతిక శాస్త్రపరిశోధనకు గడంగితినో అని నా

సన్యాససోదరబృందము అర్థము గాక ఆశ్చర్య పోవుచుందురు. అటులనే ప్రస్తుత సహజీవనమున ఇసుమంతయు సంబంధమును, ప్రయోజనము లేనట్టి విజ్ఞాన శాస్త్ర దృక్పథమున అశాస్త్రీయమును, హేతురహితము అయిన ఆధ్యాత్మికతత్త్వ జీవితమును, ఇట్టి ప్రముఖ భౌతిక విజ్ఞానవేత్తనగు నేను ఏల చేపట్టితినో అని నాసోదర అణువిజ్ఞాన శాస్త్ర నిపుణ బృందము వేరొకవంకను ఆశ్చర్యపడుచుందురు.

పైన నుడివిన రెండు దృక్పథములతో ఒకటి ఆధ్యాత్మికమూల దృక్పథమునుండి (Angle of Cause to effect)రెండవది భౌతిక విజ్ఞాన పరిణామదృక్పథము నుండియు (Angle of effect to Cause)లక్షింపబడి రెండును స్థూల దృష్టికి భిన్నముగ తోచుచున్నను యథార్థ పరసత్యాన్వేషణా పర తీవ్రసాధకుని, రెండును ఒకే పరమగమ్యమును చేర్చునవై ఉన్నవి.

ఆత్మయోగ (విద్య), భౌతిక విజ్ఞాన శాస్త్ర (అవిద్య) సమన్వయసాధన ఈ క్రింది శ్రుతి ప్రమాణమున గోచరము:

"విద్యాంచాఽవిద్యాంచ యస్తద్వేదోభయం సహ।
అవిద్యయా మృత్యుంతీర్త్వా విద్యయా మృతమశ్నుతే ॥"

విద్యా, అవిద్యల సమన్వయ పరమాద్వయ సమరసాఖండైక్య దివ్య జీవన సంప్రయోగ సిద్ధి నొనగూర్చును. అట్టి సమన్వయ సమరస సాధన యే వర్తమాన ప్రపంచమున సంక్షుభిత మానవాళికి పరస్పర సదవగాహనము, పరమశాంతిని, సమరసానందనమును, పూర్ణత్వమును ప్రసాదించును' - ఓం తత్సత్" అని శ్రీప్రజ్ఞానానంద స్వామి తమ గురుదేవుల గూర్చి వివరించారు.

నా షష్టిపూర్తి ఉత్సవము చిదానందాశ్రమము, పశివేదలలో 14న జరిగింది. ఆ సందర్భమున శ్రీ పూజ్యపాదస్వామిజ్ఞానానంద సద్గురువరేణ్యులు ఈ విధముగా శుభాశీస్సులు ప్రసాదించారు. అని శ్రీ ప్రజ్ఞానానంద ఈ ఉత్తరాన్ని నాకు చూపారు.

"ఈ దినము అక్టోబర్ 14-10-1962 ఆదివారము స్వామి ప్రజ్ఞానానంద జన్మ దినోత్సవము అని తెలిసికొని ఆనందించితిని. పలువురు ఆంతరంగిక భక్తులు, మిత్రులు, శ్రేయోభిలాషులు శ్రీ ప్రజ్ఞానానంద షష్టిపూర్తి ఉత్సవము వైభవముగ నిర్వహించుచున్నారు. నేను హృదయ పూర్వకముగ వాత్సల్యముతో వారితో కలసి ఈ మహోత్సవమును సాదరముగ సహకరించుచున్నాను.

శ్రీమత్ ప్రజ్ఞానానంద తీవ్రనైష్ఠిక, ఆధ్యాత్మిక తత్పరుడు. ఈతని జీవితము, ఆత్మార్పణమును, నిష్కామసేవ సహితమును, బహుతత్త్వజ్ఞానులకు దివ్యోత్సాహ ప్రేరణ కలిగించునవై ఉన్నవి. ఉత్తేజకర దీక్ష, కార్యోత్సాహభక్తి తత్పరతలతో ఈతడు నిస్వార్థమానవ సేవ చేయుచుండును. ఈతని జీవితము, ఆత్మసంయమము, కర్మయోగము భావి యువతరములవారికి అత్యంత ఆచరణ, ఆదర్శయోగ్యములై ఉన్నవి.

మానవ జనావళిని సౌశీల్య పరమానంద పూరిత చరితులుగ ఉద్బోధించుటకు ఈతడు ప్రియ శ్రేయానుభూతితో చిరంజీవియై వర్ధిల్లుగాక!

14 అక్టోబరు 1962
ఓం శివమస్తు

మనస్సును ఎలా స్థిరంగా ఉంచాలన్న ప్రశ్నకు శ్రీ రమణ మహర్షి ఇట్లా చెప్పారు - "హృత్ స్థలే మనః స్వస్థతాక్రియా, భక్తి యోగ బోధాశ్చ నిశ్చితం" హృదయస్థలంలో మనస్సు స్వస్థమై ఉండుటే, కర్మము. అదియే భక్తి. అదియే యోగము. జ్ఞానము నదియే. ఇది సూక్ష్మంలో పూర్ణ సత్యము"

*శ్రీ రమణ భాషణములు - పుట 211*

# పెన్నిధివంటి శ్రీ స్వామీజీ సన్నిధి

*- శ్రీమతి దంతులూరి భారతమ్మ*

ఎన్ని జన్మల పుణ్యమో శ్రీ స్వామీజీని దగ్గరగా చూసి వారి మాటలు విని వారిని సేవించుకోగలగటం అనిపిస్తుంది. వారి వ్యక్తిత్వం, వారి దయ, వారి అంతఃకరణం, వారి సమక్షంలోకి రాగలిగిన అదృష్టశాలురి చిత్తవృత్తులను మార్చివేస్తుంది. శ్రీ స్వామీజీ పరమ ప్రేమ మూర్తులు. ఎప్పుడూ పరమానందంగా ఉండేవారు. వారినే కాక వారి శిష్యులు శ్రీ ప్రజ్ఞానానంద స్వామి వారిని, శ్రీ ప్రణవానంద స్వామి వారినీ కూడా చనువుగా దగ్గరగా ఎరిగి ఉండటం మా అదృష్టం. గురుపూజా మహోత్సవాలప్పుడు శ్రీ స్వామివారు గౌరగనమూడి వచ్చేవారు. శ్రీ ప్రణవానంద స్వామి వారు కూడా ఒక్కొక్కప్పుడు జన్మదినోత్సవానికీ గురుపూజా మహోత్సవానికి వచ్చేవారు.

శ్రీ ప్రణవానంద స్వామి ఒకసారి ఒక వృత్తాంతం చెప్పారు. శ్రీ స్వామీజీ ఎప్పుడూ భిక్షకు వెళ్ళేవారు కారు. భక్తులు శిష్యులు ఆరాధకులు వారి వద్దకే వస్తూ భిక్షను సమర్పించేవారు. అటువంటిది ఒక రోజున శ్రీ స్వామీజీ ఒంటరిగా భిక్షకు బయలుదేరారుట. ఇది హిమాలయ తపోభూములలో జరిగిన సంఘటన. ఇంతలో ఎందుకో ప్రణవానంద స్వామి అక్కడకు వచ్చారు. గురువర్యులు ఈ విధంగా భిక్షకు బయలుదేరటం ఆయనకు చాలా కష్టం కలిగించింది. శ్రీ స్వామీజీని వారించి 'ఫలరసమ్ములు గురియవే పాదపములు, పొసగ భిక్షలు పెట్టరే పుణ్యసతులు' అని శ్రీ మహాభాగవతంలోని పద్యం మననం చేసుకుంటూ వెళ్ళి భిక్షను స్వీకరించి గురుదేవులకు సమర్పించానని చెప్పారు.

ఒకసారి స్వామి ప్రణవానంద కోపల్లె వచ్చారు. ఆయన జుట్టంతా జడలు కట్టి ఉంది. గుబురులాగా పెరిగి చిక్కుపడిపోయి వుంది. దువ్వెనకు స్వాధీనం కాలేదు. తలంతా పేలు. ఎట్లా భరించగలిగారో ఆ మహానుభావుడు. అప్పుడిక ఏమీ తోచక సాధ్యమైనంతవరకు పాయలు విడదీసి కుదుళ్ళు సరిచేసి గమాక్సిన్ పట్టించాను. అమ్మో తలంతా మండిపోతోంది, మండిపోతోంది అని కాసేపు బాధపడ్డారు. తర్వాత పేలు వదిలించావు అని మెచ్చుకున్నారు.

శ్రీ స్వామీజీ సమక్షంలో గడిపి వారి బోధలు వినాలని నా మనస్సు కొట్టుకలాడేది. కోపల్లెలో స్వామీజీ భక్తులుండేవారు. వారి జయంతులు చేస్తుండేవారు. స్వామీజీని గూర్చిన కథలు గాథలు వారి కుటుంబ వృత్తాంతమూ మాకు ఎప్పుడూ తెలుస్తూనే ఉండేవి. **1957**లో ననుకుంటాను ఉత్తర భారతదేశ పుణ్యక్షేత్రాలు చూడటానికి మేమంతా యాత్రా స్పెషల్‌లో బయలుదేరాము. ఒక సాధువుగారు మా బృందాన్ని తీసుకుని బయలుదేరారు. అప్పటికి మా అబ్బాయికి రెండేళ్ళు. తక్కిన పిల్లలకు నాలుగేళ్ళు, ఆరేళ్ళు. శ్రీనగర్, సిమ్లా, డెహ్రాడూన్ లాంటి ప్రదేశాలన్నీ చూశాము. తిరుగు ప్రయాణంలో యాత్రా స్పెషల్ వైజాగ్ చేరింది. వైజాగ్ వచ్చాంకదా స్వామీజీని చూడాలని నాకెంతగానో అనిపించింది. మావారు నేను రాను కావలిస్తే నీవు వెళ్ళు అన్నారు. సాధువు గారు, శివమ్మగారనే మరొక భక్తురాలు, నేనూ ముగ్గురం శ్రీ స్వామీజీని చూసి రావాలని వెళ్ళాము. మేము వెళ్ళేటప్పటికి వారు వీథిలో ఎక్కడకో వెళుతూ కన్పించారు. చాలా గబగబా నడిచేవారు స్వామీజీ. యూనివర్సిటీకి వెళుతున్నట్లున్నది.

మమ్మల్ని ఆశ్రమానికి వెళ్ళమని చెప్పారు.

1958లో గృహప్రవేశం జరిగింది. స్వామీజీ నాకేదైనా మంత్రదీక్ష ప్రసాదించాలి అని ఎంతో కోరికగా ఉండేది. కాని వారి దగ్గరకు చేరటానికి వీలుండేది కాదు. శ్రీ స్వామీజీ తండ్రిగారి తరం నుంచీ వారి కుటుంబంతో ఎంతో అనుబంధం ఉన్న ఒక్క సూరమ్మగారు మాత్రమే ఎటువంటి ఆటంకం లేకుండా శ్రీ స్వామీజీని సమీపించగలిగే వారు. తక్కినవాళ్ళందరికీ వారిని కలిసి ముచ్చటించటానికి అంత సులభసాధ్యంగా ఉండేది కాదు. శ్రీ ప్రజ్ఞానంద స్వామి శ్రీ స్వామీజీని కనిపెట్టుకుని చాలా జాగ్రత్తగా ఉండేవారు. శ్రీ పద్మనాభరాజుగారితోనూ చనువుగా ఉండేవారు స్వామీజీ. సూరమ్మగారి నాశ్రయించాను. శ్రీ స్వామీజీ నుంచి మంత్రోపదేశం పొందాలని నా కోరిక. ఎలానో సాధ్యమయ్యేట్లు చూడండి అని కోరాను. శ్రీ స్వామీజీ అనుగ్రహించారు. మా కుటుంబం శివభక్తి పరాయణమైనది. అయితే శ్రీ స్వామీజీ నాకు కృష్ణమంత్రోపదేశం చేశారు. బీజాక్షర సహితంగా నామం ఇచ్చారు. శ్రీకృష్ణ స్మరణ మరువకు, భగవద్గీత చదువు అని చెప్పారు. అప్పటి నుంచి ఆ మంత్రజపమే నాకు వెలుగుబాట అయింది. సాధారణంగా స్వామీజీ గొరగనమూడిప్రాంతాలకు జనవరి మధ్యలో వచ్చి నెలాఖరుదాకా ఉంటూ ఉండేవారు.

గొప్ప వేదాంత విషయాలను సాధనలను సులభంగా బోధపడేట్లు వివరించేవారు స్వామీజీ. కర్మ - అకర్మ - వికర్మ అని మన జీవిత కార్యక్రమం కొనసాగుతుందనీ అకర్మే తపస్సనీ అంటూ ఉండేవారు. మానవజన్మ సంబంధాలను గూర్చి చెపుతూ నదిలో ఒకసారి కొన్ని కట్టెలు కలసి కొట్టుకొని వస్తాయి. తర్వాత ప్రవాహవేగంలో వేటికవి కొట్టుకొనిపోతాయి, అట్లానే మానవ సంబంధాలు అని చెప్పారు స్వామీజీ. దగ్గరే కూచోబెట్టుకుని ఆప్యాయంగా బోధించేవారు.

1959 నుంచీ జయంతులకు తప్పక హాజరయ్యేదానిని. 1968లో చివరిసారి జయంత్యుత్సవం జరిగింది. 1968 వరకు శ్రీ ప్రజ్ఞానానంద చాలా వరకు వైజాగ్‌లో శ్రీ స్వామీజీని కనిపెట్టుకుని ఉండేవారు. గురుదేవులకు సేవలన్నీ వారే చేసేవారు. చివరి చివరికాలంలో శ్రీ స్వామీజీకి ఇంజెక్షన్ కూడా శ్రీ ప్రజ్ఞానానంద రోజూ ఇచ్చేవారు. అటువంటి స్వామి ప్రజ్ఞానానంద అక్కడి నుంచి వచ్చేశారు. ఎందుకో అక్కడ ఇమడలేకపోయారు. చివర చివర్లో స్వామీజీ ఇక్కడ ఉండవద్దు గొర్లమూడి వెళ్లిపోదాం అంటూ ఉండేవారు. 1963 నుంచి నెలకొకసారి నేను వైజాగ్ వెళుతుండేదాన్ని. ఊరగాయల దగ్గర నుంచీ సరుకులన్నీ పట్టుకొనిపోయేదాన్ని. ఎంతో ఆప్యాయంగా స్వామీజీ అన్నీ చూసుకునేవారు. అన్నీ సరిపోతాయని సంతోషించేవారు. స్వామీజీ విశ్వకుటుంబి. గురుపూర్ణిమకు ఉత్సవం ఘనంగా జరిపేవారు. 1968లో చివరిసారి గురుపూర్ణిమ ఉత్సవం జరిగింది వారి సన్నిధిలో. నూట ఏభైమంది దాకా అతిథులు ఉంటారు అని రాశారు. మేము వెళ్లాము. ఈ సంవత్సరం ఎలా జరిగింది? అని అమాయకంగా అడిగారు. ప్రజ్ఞానంద లేకపోయినా బాగా జరిగింది అని సమాధానపడ్డారు. అప్పుడప్పుడు గుజరాత్ భక్తులు శ్రీ సవితాబెన్ మొదలైనవారు శ్రీ స్వామీజీని చూడటానికి వచ్చేవారు. శ్రీ స్వామీజీ గొప్ప అతిథి సత్కార ప్రియులు. ఇతరులకు పెట్టడం వారికెంత ఇష్టమో చెప్పలేము. చివరిసారి గురుపూర్ణిమకు గొర్లమూడి వచ్చి 21 రోజులున్నారు. తెల్లారితే ప్రయాణం.

సమస్తమైన కోరికలు విడిచిన వాని కోరికలు ఆతడే చూసుకుంటాడు. ఆ కోరికలు కోరకుండానే వాటంతటవే సిద్ధిస్తాయి అనేవారు స్వామీజీ.

సృష్టి అంటే తెలుసా అన్నారు. సర్వాతీత శక్తి సంపన్నుడు కృష్ణపరమాత్మ. శబ్దం నుంచి సర్వసృష్టి జరిగింది. స్వయం ఆవిర్భూతమైంది. మురళీగానం నుంచి రూపొందింది అని చెప్పారు.

1968లో గురుపూర్ణిమ ఉత్సవాలప్పుడు మాతాజీ సోమావతమ్మగారు కూడా ఉన్నారు. ఒకరోజున వారు ఇంట్లో మంచం మీద పడుకుని ఉన్నారు. ఎందుకో మరి ఇక్కడి నుంచి త్వరలోనే మందిరంలోకి వస్తామని చెప్పారు.

స్థిత ప్రజ్ఞ లక్షణాలు చదవమని చెప్పేవారు శ్రీ స్వామీజీ. ఆలోచించే మనస్సే గురువు అని చెప్పేవారు. దాస్య భావన, లక్ష్యసాధన, ఋషి జీవితం ఇవి ధ్యేయాలు కావాలని చెప్పారు శ్రీ స్వామీజీ.

**జ్ఞానుల స్థూల శరీరము, జ్ఞాన లబ్ధికి, పిమ్మట కూడా అట్లే ఉండును, కాని, కామక్రోధాది అర్గురు శత్రువులు భస్మమై పోదురు.**

**జ్ఞానులు భగవద్విషయములనే విన నభిలషింతురు, ప్రపంచక విషయ చర్చలు విన్న బాధపడుదురు**

***(రామకృష్ణ పరమహంస)***

1. ఇచ్ఛా 2. భక్తి 3. శ్రద్ధలు

ఇచ్ఛ అంటే క్షుత్పిపాసాది దేహ ధర్మాలను శరీరము నెడల యే మమతా లేకుండా నెరవేర్చడం - అది జరగకుంటే చింతన అడుగు ముందుకు సాగదు.

*కర్మబంధాల నుండి విమోచన మెట్లు?* అని శ్రీ రమణ మహర్షిని ఒకరు ప్రశ్నించారు.

మహర్షి: అది యెవరి కర్మయో పరికించు, కర్తవు నీవు కావని తెలియవస్తుంది. అపుడు నీవు ముక్తుడవవౌతావు. దీనికి దైవానుగ్రహము కావలె. దానికి దైవమును ప్రార్థింపవలె, పూజింపవలె, ధ్యానింపవలె. నీ ప్రయత్నం లేక జరిగే కర్మ అయత్నకర్మ, నిన్ను బంధించదు. దేహం కదలిక వల్ల జ్ఞాని సైతం ఏవేవో ఆచరిస్తున్నట్లు కనపడుతుంది.

*సంకల్పమూ యత్నమూ లేక కర్మ యుండునా?*

అందరికీ సంకల్పాలున్నవి. అవి రెండు విధాలు 1. బంధ హేతువులు 2. ముక్తి హేతువులు

# సంకల్పసిద్ధి

శ్రీ చేకూరి చెన్నకృష్ణయ్య

ఇంటిలో గాఢ నిద్రాముద్రితులయిన కన్న తండ్రిని, ఇల్లాలిని తక్కిన బంధు వర్గమును విడిచి, బయటపడగానే స్వామివారికి అనిర్వచనీయ మైన ప్రసన్నత, ప్రశాంతి చేకూరాయి. భీష్ముని ప్రవచనమునకు ఒక చక్కని ఉదాహరణగా చూపవచ్చు అప్పటి శ్రీస్వామిజీ మనఃస్థితిని. స్వామివారు ఆ ఘడియల్లో

*బంధనంబులలో నెల్ల బరమబంధ*
*నంబు కామంబు తద్వర్జనమున నాత్మ*
*యభ్ర పటలంబు వాసిన యమృత కిరణ*
*పూర్ణ మండలమును బోలె బొలుచుననఘ*

**(శాంతిపర్వం)**

మబ్బువిడిచిన పూర్ణ చంద్రబింబమువలె స్వామీజీ ప్రశాంతతతో వెలుగొందుతూ ముందుకు సాగిచారు తమయాత్రను.

అర్ధరాత్రి వేళ ఒంటరిగా పయనించే తన్ను చూచినవాళ్ళు ఎవరైనా గుర్తించి తనపోకడ తండ్రిగారికి తెలియపరుస్తారేమో అన్న భయంతో స్వామి భీమవరం నుంచి తుని వరకు రైల్లో పయనించి, అక్కడనుంచి కాలినడక సాగించారు. సుమారు 600మైళ్ళు నడిచి ఖరగ్‌పూరు చేరుకొని కొన్నాళ్ళక్కడ శ్మశానంలో, ధ్యానంతో ఒక చెట్టుకింద నిలిచిపోయారు.

వారికి బుద్ధ భగవానుడు ఆదర్శమూర్తి; దైవమునూ. తాను కూడ నేపాలు భూముల్లో తపస్సు చేసి కోవాలి అన్నదే వారి ఆకాంక్ష. ఖరగ్‌పూరు నుంచి నేరుగా హిమవత్పర్వత శ్రేణులను చేరుకొని, గంగానదిని దాటి నేపాలు అడవుల్లో కాలు పెట్టినారు. అప్పుడు వారు పొందిన అనుభూతికి, ఆనందానికి హద్దులు లేకపోయాయి.

ఒక పెద్ద రాతి కింద నివాసం ఏర్పరుచుకొని తీవ్ర ధ్యాన నిమగ్నులై పోయారు స్వామీజీ. ఆ ఆరణ్యంలో లభించే మారేడు చిగుళ్ళు, ఆ పళ్ళలోని గుజ్జును భుజిస్తూ తపస్సు కొనసాగిస్తూ వచ్చారు. కాని సుమారు పదినాళ్ళకే తీవ్ర జ్వరానికి గురియై మందుమాకులు లేనందున నీరసించిపోతూ వచ్చారు. భారమంతా రాధా మాధవుని భుజస్కంధముల మీద వేసి తన తపోదీక్షలో నిమగ్నులై తానుండిపోయారు. భక్తుని యోగక్షేమములు చూచుకొనే బాధ్యత ఆ శ్రీవల్లభునిదే కదా! ఆ క్లిష్టసమయంలో ముజఫర్‌పూర్ నగరం నుంచి యుద్ధ విక్రముడనే శ్రీమంతుడు తన పరివారంతో వేటకోసం వచ్చి, స్వామివారు తపోదీక్షలో నిమగ్నులై ఉన్న ప్రాంతం చేరుకొన్నారు. స్వామివారి ఆరోగ్య పరిస్థితిని గమనించి, వారిని తన వెంట ముజఫర్ నగరానికి తీసుకొనిపోయిచికిత్స చేయించారు. వారం రోజుల్లో స్వామివారి వ్యాధి నెమ్మదించింది. ఏకాంతవాసిగా అడవుల్లో తపమాచరించేందుకు సంకల్పించుకొన్న స్వామివారు యుద్ధవిక్రమ దంపతులు తమ విశాల ప్రసాదములో నిలిచి తపమాచరించుకొంటూ తమ్ముద్ధరించమని ప్రార్థిస్తూ వున్ననూ, వినక, తమ సంకల్పమును వారికి వివరించి , ఋషీకేశమునకు బయలుదేరారు. మార్గ మధ్యములో విశ్వంభరనాథ్ అనే ధనికుడు స్వామివారికి తమ ఇంట ఆతిధ్యమిచ్చి, అచటనే తపమాచరించు కొమ్మని ప్రార్థించాడు. స్వామీజీ విశ్వంబరనాథ దంపతులకు కూడ తమ సంకల్పమును విశదీకరించి, ప్రయాణం సాగించి, హస్తినాపురి మీదుగా ఆబూపర్వతములను చేరుకొని అచట కొన్నాళ్ళు తపమాచరించి, చివరకు ఋషీకేశం చేరుకొని స్వర్గాశ్రమంలో నిలిచిపోయారు.

స్వర్గాశ్రమంలో కూడా తమ తపోదీక్షకు భంగం వాటిల్ల సాగింది. గిరిధర్ అనే సాధువు

స్వామివారిని అంటి పెట్టుకొని భక్తి శ్రద్ధలతో వారిని సేవిస్తూ వచ్చాడు. కాని అతని సాంగత్యం స్వామివారి తపో దీక్షకు భంగకరమవుతూ వచ్చింది. గిరిధర్ నుంచి దూరముగా ఉండవలెనని, స్వర్గాశ్రమాన్ని విడిచి, స్వామిజీ తిరిగి అబూపర్వతాలకు వెళ్ళారు.

ఈ సారి ఆబూ కొండగుహల్లో పదమూడు మాసాలు తీవ్ర తపోనిష్ఠలో గడిపారు. శ్రీ కృష్ణస్వామి భక్తుడు కావున ఆ స్వామితోనే తిరుగుతూ సంభాషిస్తూ ఉన్నట్లు తరచు గంటలాదిగా తన్మయత్వం చెంది ఈ జగత్తులో ఓలలాడుతూ వుండేవారు. ఆ రోజులల్లోనే స్వామివారి సంకల్పం సిద్ధించి సవికల్ప సమాధి సాధించగలిగారు. ధ్యేయవస్తువులైన శ్రీకృష్ణ బ్రహ్మస్వరూపంతో స్వామి జీవితాంతం బ్రహ్మాకార వృత్తిలో ఉండటం తన చపలత్వానికి స్వస్తివాచకం పలుకుతూ వచ్చింది.

స్వామివారి ఉనికి భక్త జనావళికి క్రమేణా తెలుస్తూరాగా, వారి దర్శనార్థం ఒక్కరొక్కరుగా చేరిపోతూ వచ్చారు. వారి దీక్షకు ఆ విధంగా భంగం వాటిల్లుతూపోగా స్వామిజీ అబూ పర్వతావళిని విడిచి నేరుగా ఋషికేశంలోని స్వర్గాశ్రమం చేరుకొన్నారు.

తమ కుటీరంలో తరచు స్వామిజీ సవికల్ప సమాధి చేరుకొని, ఆస్థితిలో క్రిందపడిపోవటం, స్పృహ తప్పిపోతున్నందున బల్లమీద నుండి పడిపోగా గాయాలు తగలటం సంభవిస్తూ వచ్చింది. సమాధిస్థితిలో క్రిందపడిపోతూవుంటే స్వామిజీని చూస్తున్న పెక్కుసాధువులు వారిచుట్టూ చేరిపోతూ వచ్చారు. తమ తీవ్ర తపోనిరతికి భంగం వాటిల్లుతూ వస్తుందని గ్రహించి, ఆశ్రమం విడిచి దూరంగా కాశ్మీరు పర్వత శ్రేణులకు వెళ్ళి, అక్కడ తపమాచరించటానికి సంకల్పించుకొన్నారు.

కాశ్మీరునకు పయనిస్తూ ఎక్కడ గుహ కన్పించినా అక్కడనిలచి కొంత కాలం తపస్సు కొనసాగించి, మళ్ళీ పయనం సాగించేవారు. శ్రీనగరం చేరుకొని అక్కడ మూడు మాసాలు తపం చేసుకొని జాడీపురం అనే గ్రామం చేరారు. అచ్చట అఫ్తార్‌కొల్ అనేవారిఇంటిలోని ఇంటివెనుక చేరారు. ఇంటి వెనుక భాగమందే ఆపిల్ తోటలో ఒక చిన్న కుటీరమందు నిలిచి తపో దీక్షలో మునిగిపోయేవారు. ఒకనాటి సాయంకాలము స్వామివారిలో చెప్పరాని తన్మయత్వ అనుభూతి కలుగుతూవచ్చింది. చివరకు సవికల్ప సమాధిలోని ధ్యేయవస్తువు కరిగిపోతూ వచ్చి, ధ్యాత, ధ్యాన, ధ్యేయపూరములగు త్రిపుటి లయించి పోయింది. సవికల్పసమాధి ఈ విధంగా మారి నిర్వికల్ప సమాధిగా రూపొందింది. పతంజలి యోగ పరిభాషలో కైవల్యస్థితిని పొందారు. శ్రీ జ్ఞానానంద యోగీంద్రునిగా సాక్షాత్కరించారు. 1917లో గృహ పరిత్యాగం చేసిన శ్రీ లక్ష్మీనరసింహరాజుగారు ఆగష్టు 1929లో నిర్బీజసమాధి స్థితిని చేరుకొని విజయశ్రీని చేపట్టగలిగారు.

కాశ్మీరమును వదలి పయనిస్తూ హిమవన్నగ పంక్తులలోని ఉత్తర కాశి చేరుకొని అక్కడ తపమాచరిస్తూ వచ్చారు. ఉత్తర కాశికి సమీపంలో ఉన్న మఖువా అనే పండాల గ్రామం చేరుకొని, ఆ గ్రామ సమీపంలోని ఒక కుటీరంలో తీవ్ర తపస్సు ప్రారంభించారు. అక్కడ ఒక వారం తిరగకముందే స్వామిజీ శరీరంలో అమిత వేడిమికి తాళజాలక నిలిచిన చోట నిలవ జాలక స్వామిజీ కుటీరం నుంచి బయటకు వెళ్ళిపోయారు. ధరించిన కొద్దిపాటి వస్త్రాలను సహితం ఆ వేడికి శరీరం భరించలేక పోయింది. వెంటనే స్వామిజీ ఒంటిపై ఉన్న బట్టలను విసర్జించారు. ఆబట్టలను, దండ కమండలములను, ఆఖరుకు రిస్టువాచిని సైతము విసర్జించారు. వాటి నన్నింటిని పండాలకు పంచిపెట్టారు. కళ్లజోడుమాత్రం తమకు తోడుగానిల్చిపోయింది. దిగంబరియై తన్ను చూడవచ్చి మూగిపోయిన పండాలందరిముందు మానాభిమానములకు దూరగుడై, నిరంకుశుడైన అవధూతగా సాక్షాత్కరించి నిలిచారు. తన సంకల్పసిద్ధి కోసం స్వామిజీ సర్వస్వమును త్యజించి, అడవులు చేరుకొని ఏకాంతముగా

జీవితం గడుపుతూ తీవ్ర తపోనిరతుడై వెలసి ప్రప్రథమున సవికల్ప సమాధిని, ఆ తర్వాత నిర్బీజ సమాధిని, సాధించి, చివరగా అవధూత మూర్తిగా రూపుదిద్దుకొని, శంఖారావముతో విజయ దుందుభుల మోయింపచేశాడు. లోక కళ్యాణానికి బాటలు తీర్చాడు.

ఈ కాలమందే స్వామిజీకి గోముఖ కైలాసయాత్ర చేయాలని సంకల్పం కలిగింది. వెంటనే కొందరు పండాలతో, మరి కొంత సాధు బృందంతో యాత్ర సాగించారు. ఆ యాత్రలో భూమానంద అనే పండా మంచు గడ్డల్లో నడుస్తూ కాలుజారి కిందపడి స్పృహ కోల్పోయారు. స్వామివారు అ పండాను ఎత్తి తన దేహానికి హత్తుకొని గట్టిగా కౌగలించుకొన్నంతనే, ఆ అవధూతమూర్తి లోని అత్యుష్ణం విద్యుత్తు లాగా భూమానంద శరీరంలోనికి ప్రవహించింది. స్పృహకల్గింది భూమానందకు. వెంటనే ఆతడు తెప్పరిల్లి కొనగలిగాడు. తర్వాత యాత్ర నిర్విఘ్నంగా జరిగింది. గంగాభవాని జన్మస్థానమైన గోముఖ కైలాసం దర్శించి, గంగోదకంలో స్నానమాడి, యాత్రికులతో గూడి తన ఆశ్రమం చేరుకొన్నారు స్వామిజి.

వేద పురాణ వాఙ్మయ చరిత్ర పుటలు తిప్పి చూస్తే శరీరమంతా సెగలు పొగలతో పొంగులువారుతూ ఉండే అవధూతమూర్తులు ఇద్దరే కనిపిస్తారు. ఒకరు సంత్ జ్ఞానేశ్వరుడు; రెండవవారు శ్రీ జ్ఞానానంద. జ్ఞానేశ్వరుని తండ్రి వివాహమాడి, భార్య అనుమతి లేకుండనే సన్యసించారు. జ్ఞానేశ్వరుని తల్లి సన్యాసదీక్ష నిచ్చిన గురువును అధిక్షేపింపగా, అర్థించగా, ఆతడు తన తప్పు గ్రహించి తాను సన్యాస దీక్ష నిచ్చిన శిష్యుని గృహస్థాశ్రమం మళ్ళీ స్వీకరించి భార్యతో కాపురం చేయమని శాసించాడు. గుర్వాజ్ఞ మీరజాలక జ్ఞానేశ్వరునితండ్రి తన భార్యను స్వీకరించాడు. ఆ దంపతులకు జ్ఞానేశ్వరునితో సహా నల్గురు కొమారులు, ఒక కుమార్తె జన్మించారు. అక్కడి బ్రాహ్మణులు సన్యసించిన వాడు గృహస్థ ధర్మం పాలించి, సంతానం బడసినందుకు ఆ దంపతులను, వారి సంతానమును కులము నుండి బహిష్కరించారు. భార్యాభర్తలు మరణించినా సంతానముపై ఆ వెలి నిలిచిపోయింది. బ్రాహ్మణలోకం ఆ బాలురను, బాలికను దూరంగా ఉంచారు. ఒకసారి వారొక గ్రామంలో నిలిచిపోగా కుంభద్రోణంగా వర్షం కురువసాగింది. జ్ఞానేశ్వరుల దగ్గర వంటపాత్రలు లేవు, పొయి రాజేసి వంటచేస్తామనుకొంటే. ఆఖరుకు నిప్పు రవ్వ కూడా దొరకలేదు. అప్పుడు జ్ఞానేశ్వరుడు వంగి శరీరమంతా యోగాగ్నితో నింపారు. ఆ యోగిపుంగవుని చెల్లెలు ఒకరాతిని శుభ్రపరచి దానిని మౌని వీపు మీదపరచి రొట్టెలు అందరికి సరిపడ కాల్చింది. ఆ తర్వాత యోగి తనలోని అగ్నిని ఉపసంహరించుకున్నాడు. అన్నదమ్ములు, చెల్లెలు కలిసి ఆ రొట్టెలు సంతృప్తిగా తిని సంతోషించారు.

భూమానంద మంచుగడ్డలపై కాలు జారి పడిపోయి, స్పృహకోల్పోగా జ్ఞానానంద ఆతడిని గట్టిగ కౌగలించుకొని తనుఉష్ణమును విద్యుత్తులాగా ప్రసాదింపజేసి బ్రతికించారని తెలుసుకొన్నాము. మరో సారి శ్రీ జ్ఞానానంద స్వామి బదరి నారాయణ క్షేత్ర సమీపాన తపస్సు చేసుకుంటూ తిరుగాడుచుండగా, వారి గురువర్యులు పూర్ణానందస్వామి స్వామిజీ పదునారుగురు శిష్యులతో బదరికి యాత్ర చేశారు. ఆయనకు చలి ఉధృతంగా వున్నందున శరీరమంతా కొంగర్లు పోయింది. పులివంటి ఆచలికి గురువుగారు,శిష్యులు తల్లడిల్లిపోతున్నారు. వాళ్ళలో కొందరు బదరీక్షేత్ర ప్రాంతాన తిరుగాడుచుండగా శ్రీజ్ఞానానంద వారి కంట బడ్డారు. వారు స్వామి దిగంబర మూర్తిని చూచి విస్తుపోతున్నారు, దిగంబరిగా చలికి లేచి నిల్చిన ఆ గురుశిష్యుడు అవధూతమూర్తిగా రూపొందారని ఎంతగానో సంతోషించారు. ఆ విశ్వమూర్తిని కొందరు కౌగలించుకొని, కొందరు వారి హస్తకమలములతో తమ శరీరాలను నిమురుతూ చలికాచుకోసాగారు. గురువుగారి రాక

నెరిగి స్వామివారు తమ గురువు గారిని సందర్శించగా, అవధూతమూర్తిగా రూపొందిన తన ఛాత్రుని చూచి పూర్ణానందుడు చాల సంతోషించాడు. బదరిలో పదునారు రోజులు నిలవాలని తలపోసిన గురువుగారు అచ్చటి చలిని భరింపజాలక ఆమరునాడే శిష్యబృందంతో ఋషీకేశానికి బయలుదేరారు.

ఈ సంఘటనలు శ్రీ జ్ఞానేశ్వరుల, జ్ఞానానందుల అవధూత అవతార తత్త్వమును చక్కగా నిరూపింపగలిగాయి.

స్వామీజీ మఖువా గ్రామం నుంచి బయలుదేరి బదరీ క్షేత్ర సమీపంలో తపస్సు చేయాలని సంకల్పించుకొన్నారు. మార్గమధ్యంలో హిమాలయమునందు నెలకొని వున్న టెహ్రి రాజ్యమునకు ముఖ్యపట్టణమైన కీర్తినగరంలో కొన్నాళ్ళు గడిపి, రాజపూజలందుకొని ముందుకు సాగి బదరీ చేరుకున్నారు. బదరీ సమీపమందలి ఒక కొండ గుహలో తమ నివాసం ఏర్పరుచుకొని అతి సుందరములయిన అక్కటి పర్వత శ్రేణులలో తిరుగుతూ వచ్చారు. వ్యాసుడు గణేశుని మాహాత్యంతో భారతం వ్రాసినచోట, భగవత్పాదులు శంకరులు త్రిభాష్యముల రచించిన స్థలమును అయిన గణేష్ గుహలో కొంత కాలం నిలిచారు. పాండవులు దాటిన స్వర్గారోహణ పర్వతములను దర్శించారు. ఆ పర్వతముల నధిరోహించి, పాండవుల సంస్మరించుకొని పులకిత గాత్రుడగుచూ ఆనంద వార్ధిలో మునగకలిగి నాడు. ఆ శంకరాచార్యులు స్థాపించిన జ్యోతిర్మయం మఠం కూడ సందర్శించి, అచ్చట కొంత కాలం నిలిచి తపమాచరించాడు.

బదరీ క్షేత్ర ప్రాంతమున ఉన్న వాళ్ళతో స్వామీజీని కైలాస మానస సరోవర క్షేత్ర తీర్థం సంసేవనార్థం యాత్ర చేయాలని సంకల్పించు కున్నారు. వెంటనే పదునారుమంది పండాలతో సాధువులతో ఆగష్టు 12, 1924లో కైలాస యాత్రకు శ్రీకారం చుట్టారు. మార్గమధ్యంలో ఎన్నోకడగండ్లు దాపురించినా, వాని నన్నింటినీ సునాయసంగా ఉత్తరించి తుదకు కైలాస పర్వతాన్ని, మానస సరోవరాన్ని చేరుకున్నారు. ఆ పవిత్ర క్షేత్రాల్లో కొన్నాళ్ళు నిలిచి, తపమాచరిస్తూ కాలం గడిపారు. తిరిగి చైతన్యమూర్తి అయిన స్వామివారి అధ్వర్యంలో యాత్ర కొనసాగించి, సురక్షితంగా బృందమంతా తమ గమ్యస్థానం చేరుకొంది.

కైలాసయాత్ర ముగిసిన తర్వాత అహ్మదాబాదు వాస్తవ్యులయిన శిష్యులు కొందరు స్వామినాశ్రయించి తమకు యోగాభ్యాసమందలి మెలుకువలను గూర్చి శిక్షణ యిమ్మని అర్థించారు. వారి అభ్యర్థ ననుసరించి స్వామీజీ ఆబూపర్వతమందలి నఖీతలాబ్ అనే గ్రామ సమీపాన ఒక శిక్షణ కేంద్రాన్ని స్థాపించి, అచ్చట తన శిష్యులకు యోగాసనము నందలి, యోగాభ్యాసమునందలి మెలుకువల నభ్యసింప చేస్తూ కొంతకాలమచట నిలిచారు.

యోగాభ్యాస శిక్షణ శిష్యులకు ఒక వైపు ఇస్తూనే మరోవైపు యోగసూత్రముల నిబద్ధింప ప్రారంభించారు. సుమారు 30సూత్రములను నఖీతలాబ్ సమీపమందలి శిక్షణ కేంద్రమందే రచించారు. ప్రశాంతముగ నున్న శాంతి గుహలోనే సూత్ర రచన ముగించాలనే సంకల్పంతో స్వామీజీ ఆబూ పర్వతాల విడిచి ఉత్తర కాశీని చేరుకొని అచట నుంచి శాంతి గుహచేరుకొని అక్కడే ప్రశాంత వాతావరణంలలో సూత్ర రచన ముగించగలిగారు.

పూర్ణరచనా కాలమందే స్వామీజీ జర్మనీ దేశం వెళ్ళి అచ్చట స్వామి వివేకానంద, స్వామీ రామతీర్థులకోవలో హైందవ వేదాంత పరిమళాలు గుబాళింప జేయాలని సంకల్పించుకున్నారు. సంకల్ప బలం వల్ల జర్మనీకి వెళ్ళేందుకు తగిన సన్నాహాలన్నీ జరిగిపోయాయి.

1927లో స్వామీజీ జర్మనీకి ఓడలో ప్రయాణం సాగించారు.

# 'జ్ఞానదర్శిని-దివ్యదర్శిని'

శ్రీ కస్తూరి భాస్కరరావు.

`ప్రభూ! నిన్ను చూడటానికి ఎన్నోసార్లు ప్రయత్నించాను. ఎన్నోసాధనలు చేశాను. ఎంతమందినో ఆశ్రయించాను. ఎన్నో తీర్థయాత్రలు చేశాను. కళ్ళుమూసినా తెరిచినా నాకు నీ వెలుగే కన్పించింది. ఆ వెలుగులో కరుణామూర్తివి నువ్వే కన్పించావు. అక్కడా `నేనే' వున్నానేమో! అది ఏమీలేని శూన్యం కాదు స్వామీ! మహాజ్యోతి స్వరూపం! ఎంతకాంతి! ఏమి తేజస్సు! లోపలా బయటా సర్వమూ `నేను'గానే కన్పించింది. `నేను'-`ఇది' అనేవి విడి విడిగాలేవుగా. `ఇది' అంతటా వ్యాపించి అంతా `నేను'లోనే వున్నట్లుగా కన్పించింది. మళ్ళీ అన్నీ ఒక్కటై పోయాయి. అది అఖండచైతన్యం! ఆ ప్రవాహంలో మాయ మబ్బులన్నీ చెల్లాచెదురైపోయాయి. నిజస్వరూపం బైటపడింది. అపుడు వున్నదంతా ఆనందమే! చైతన్యమే! నీ స్మరణ చేస్తుంటే లోపల గొప్ప అగ్ని బయలుదేరింది. ఇన్నాళ్లుగా నన్ను కట్టిపడవేశిన బంధాలన్నీ కాలిపోయాయి. పూర్తిగా ముక్తుణ్ని అయ్యాను. ఎంతస్వేచ్ఛ!ఎంత ఆనందం! ఎంత ప్రశాంతత! అది చిదానంద సముద్రం! నా అంతఃకరణలోని సంకల్పాలూ, వృత్తులూ అన్నీ ఆ `తెలివి'లో క్షయమైపోయాయి. నా మనస్సు అనే ఆనంద సముద్రంలో అలలూలేవూ, నురుగూలేదు. కేవలం సచ్చిదానందస్థితే ప్రభూ! అప్పుడు నాకు దుఃఖమే కన్పించలేదు. అంతా ఆనందమయసాగరం! అన్నిలోకాలు, లోకేశ్వరులు దానిలోనే కలిసిపోయారు. అదే బ్రహ్మానందసాగరం!

అయస్కాంతం సూదిని ఆకర్షించినట్లుగా ఏదో దివ్యాకర్షణ నన్ను ఆవహించింది. నాకున్న సంశయాలన్నీ ఒక్కసారి మాయమైపోయాయి. ఆ శాంతి సాగరంలో తేలిపోయాను. ఎన్నో సందేహాలతో నిన్ను అడుగు దామనుకున్న ప్రశ్నలన్నీ అంతర్ధానమయ్యాయి. మనసులోని సంకల్పాలన్నీ పోయి ప్రశాంతంగా, నిశ్చలంగా నిలిచిపోయింది.

స్వామీ! నీ సన్నిధిలో మౌనమే దివ్య వాక్కయి నా మనస్సును పూర్తిగా స్వాధీనం చేసుకున్నది. అది నిరంతర భాషాప్రవాహం! జ్ఞానవాహిని! దానికి మామూలు మాటలతో ప్రమేయమేలేదు. ఎంత ఉత్తమమైన ఉపదేశం! స్వామీ! నీ మౌనమే ఒక మహాదీక్ష! అన్ని దీక్షలనూమించింది. నీవు మౌనంలో ప్రతిష్ఠితుడవైవుండగా నా మనస్సు చిత్తవృత్తులన్నీ మాయమై ధ్యానంలో మునిగిపోయాను. ఆ అఖండ మౌనంలో ఏకాగ్రత సిద్ధించింది. అప్పుడు వర్ణించలేని ఆనందసాగరంలో, బ్రహ్మానందంలో ఓలలాడాను ప్రభూ! చైతన్య స్వరూపుడినే అయ్యాను. ఆ ఆత్మానుభవం నిశ్చలంగా వుండి పోయింది. ఆత్మస్వరూపం ఏమిటో తెలుసుకోకపూర్వం ఎంతో అన్వేషించాను. చివరికి నీవునా ఆత్మవే అని తెలిసింది. ఆత్మలో వ్యాపించి అంతర్యామిగా వున్నావు. నీ శరీరంలో నేను ఒక భాగమే అయ్యాను.

ఓ సద్గురూ! నీ వెప్పుడూ అనేక జన్మపరంపరల్లో నా వెంటనే వుంటూ, నన్నే కనిపెట్టుకుని వుంటూ ముక్తికలిగే వరకూ మార్గాన్ని చూపించావు. ఆత్మేనాకు గురువని తెలిసింది. నీ సాంగత్యంలో నా మనస్సును లోపలికి నెట్టుతూ అంతర్ముఖమైన మనస్సుని లోపలి నుండీ హృదయంలోకి లాక్కున్నావు. ఇదే నీ కరుణార్ద్ర దృష్టి! కటాక్షం!

`నేనెవరు?' అని ప్రశ్నించుకుని దాని మూలాన్ని అన్వేషించాను. క్రమంగా `నేను'అనేది

ఆత్మలో లీనమైపోయింది. విషయమూలూ, విషయం ఒక్కటైపోయాయి. విషయం తెలియగానే విషయాలు దానిలో లీనమైపోయాయి. ఇక ఆ తర్వాత అన్వేషణలేదు. నిద్రనుంచి మేలుకోగానే నిద్రావస్థలోని అనుభవాలన్నీ లీనమైపోయినట్లుగా `నేను బ్రహ్మను'-అనే ఎరుక కలుగగానే యుగ యుగాలుగా సంచితమైన కర్మ యావత్తు నశించిపోయింది.

ఈ శరీరం కర్మ-నిర్మితం కదా! అందువల్ల ప్రారబ్ధం కూడా దానిదే. అనాది అయినా ఆత్మది కాదు. జ్ఞానజ్యోతి దర్శనం కాగానే మనస్సులోని కల్మషాలన్నీ దహించుకుపోయాయి. ఆ దివ్యతేజస్సే ప్రపంచమంతా ఆవరించి వెలుగుతోంది! అదే విశ్వచైతన్యం! నిర్మలం, పవిత్రం అయిన జ్ఞాననేత్రంతోనే దాన్ని చూడగలను. ఆ ఆత్మస్వరూపంలో అజ్ఞానం లేదు. సూర్యుడిలో చీకటిలేనట్లుగా ఆ ఆత్మప్రకాశంలో అజ్ఞానం అనే చీకటి లేదు.

`నేను ఎవరు-?' `నా సత్యస్వరూపం ఏది?'- `నేను ఎక్కడ నుండి వచ్చాను? అనే విచారణ కోసం బైట వెతికితే ప్రయోజనం ఏముంది?`నేను' అనే చోట విపరీతభావం తీసేస్తే అసలు `నేను' తెలిసింది. `నేను' నిష్ఠచేయగా ప్రపంచం అంతామారిపోయింది. నాలోవున్న అహంకారం అనే పాము వశంకానిదే ఆత్మ దర్శనం కాలేదు. ఆత్మ నిష్ఠతో విషదుహితమైన హృదయాన్ని కడిగాను. అప్పుడు శివరూపమైన జ్ఞానం దర్శనం అయింది. ఎంత ధన్యుడ్ని! అప్పుడు అన్ని లోకాలూ లోకేశ్వరులూ నాలోనే కలిసి పోయారు. ప్రభూ! నా సర్వధర్మాల్నీ నీకు అర్పిస్తున్నాను. ఏకమైనట్టి నిన్నే ఆశ్రయిస్తున్నాను. నా అభిమానాల్ని ముఖ్యంగా నావ్యక్తిత్వాన్ని అర్పిస్తున్నాను స్వామీ! పూర్తి శరణాగతి కోరుకుంటున్నాను. నాకు యిక నీవే దిక్కు!

`నేనే బ్రహ్మను' - అని ధ్యానించాను. క్రమంగా `నేను' అనేది బ్రహ్మంలో లీనమై ఒకే ఒక అఖండ చైతన్యం మిగిలింది. అదే `నేను'. ఈ ధ్యానం వల్ల `మాయ' తొలగిపోయి నా నిజస్వరూపం బయటపడింది. ఏది జగత్కారణము, సచ్చిదానంద రూపమూ, పరబ్రహ్మమైవున్నదీ ఆ అద్వితీయ పరబ్రహ్మం నేనే అయ్యాను.

దేనిని పొందితే యిక వేరే పొందతగింది ఏమీ వుండదో, ఏసుఖం కంటే మించిన సుఖం లేదో, ఏ జ్ఞానం కంటే మించినదేదీ లేదో అదే `బ్రహ్మం' అని తెలుసుకున్నాను ప్రభూ! నాకన్న వేరుగా ఒకదేవత వేరె లేదనే ఏకాత్మభావంతో పూజచేశాను. నేను పూజించిన పుష్పాలు శూన్యాకాశంలో కాకుండా చిదాకాశంలో పడి నా పూజ ఫలించేటట్లు అనుగ్రహించుస్వామీ!

ఈ దృశ్యప్రపంచం, నా ఇంద్రియాలు నేను కాను గదా! వీటన్నిటికీ సాక్షిగా వున్న ఆత్మే నేను అని చివరికి తెలుసుకున్నాను. నా భార్య, పుత్రులు, మిత్రులు ఆత్మకోసమే నాకు ప్రియులవుతున్నారు. అంతా ఆత్మప్రయోజనం కోసమే కదా. ఆ అమృ తత్త్వాన్ని రుచిచూశాను.

హృదయం అనే కమలం మధ్యలో నిశ్చలంగా దీప శిఖలాగా వెలుగుతూ బొటన వేలంత ఆకారంతో వున్న ఈశ్వరుడ్ని, ఓంకార స్వరూపుడ్ని ధ్యానించాను.

**నాలోపలా, బైటా, అంతటా జ్యోతే!**
**అదే `జ్ఞాన దర్శిని' !దివ్యదర్శిని!**

సమాధి స్థితిలో గాని జ్ఞానంలో గాని, జ్ఞానులలో తరతమాలు లేవు. ఈ విభజన దృష్టిని బట్టి చేసినదే.

*శ్రీ రమణ భాషణము - పుట* ***254***

# స్వామి జ్ఞానానంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

## గొరగనమూడి - సంగ్రహ చరిత్ర

*శ్రీ చెట్లపల్లి జగన్మోహన్*

శ్రీ చింతలపాటి బాపిరాజు ధర్మ సంస్థ ఆధ్వర్యమున 1968 సం॥లో ఈ ఉన్నత పాఠశాల స్థాపించబడినది. భారతీయ సంస్కృతిని ప్రతిబింబించే భావిపౌరులను తీర్చిదిద్దాలనే లక్ష్యంతో వ్యవస్థాపకులు శ్రీ చింతలపాటి వరప్రసాదమూర్తిరాజు గారు ప్రముఖ తత్త్వవేత్త, శాస్త్రవేత్త పూజ్యపాద శ్రీ స్వామి జ్ఞానానంద పేరున ఈ పాఠశాల నెలకొల్పడం అందరికీ హర్షణీయం. తొలుత ప్రాథమిక పాఠశాలగా ఉన్న ఈ ఉన్నత పాఠశాల దిన దినాభివృద్ధి చెంది 1971 సం॥లో మొదటిసారిగా SSC పరీక్షలకు విద్యార్థులను పంపింది. అప్పటి నుండి SSC పరీక్షలందు ప్రతి సంవత్సరము మంచి ఫలితములు సాధింపబడుచున్నవి. 1982 సం॥లో స్వామి జ్ఞానానంద సోదరులు శ్రీ భూపతిరాజు పద్మనాభ రాజు గారి కృషివలన అప్పటివరకు సామాన్య పాఠశాలగా ఉన్న ఈ పాఠశాల ఓరియంటల్ ఉన్నత పాఠశాలగా మార్పు చెయ్యబడినది. బాపిరాజు ధర్మసంస్థ నుండి జిల్లాపరిషత్తు వారు స్వీకరించుట వలన పశ్చిమ గోదావరి జిల్లాపరిషత్తు వారి ఆధ్వర్యములో ఈ పాఠశాల నిర్వహింపబడుచున్నది. సంస్కృతము ఆప్షనల్ సబ్జక్ట్‌గా విద్యార్థులందరూ అభ్యసించుచున్నారు.

ప్రతి సంవత్సరము ఈ పాఠశాలలో పదవ తరగతి, ఏడవతరగతి పబ్లిక్ పరీక్షలలో ప్రథమ స్థాయిని పొందిన విద్యార్థులకు స్వామి జ్ఞానానంద జయంతి సందర్భముగా స్వామి జ్ఞానానంద ట్రస్ట్ తరపున స్వామి జ్ఞానానంద మెమోరియల్ మెరిట్ మెడల్సు బహూకరింపబడుచున్నవి. విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది భక్తి శ్రద్ధలతో స్వామి జ్ఞానానంద జయంతి కార్యక్రమములో పాల్గొను చున్నారు. వివిధ స్థాయిలలో అంతర్ పాఠశాలల డిబేట్, క్విజ్ కార్యక్రమములు నిర్వహింపబడుచున్నవి. పెద్దలెందరో మార్గదర్శనము చేయుచున్నారు. ఈ కార్యక్రమము లన్నిటికీ స్వామిజీ సోదరులు శ్రీ పద్మనాభరాజుగారు సంపూర్ణ ప్రోత్సాహము నందించుచున్నారు. ఈ పాఠశాలలో విద్య నభ్యసించిన విద్యార్థు లెందరో స్వామిజీ అనుగ్రహమును బడసి ఉన్నత స్థానముల యందలరారుచున్నారు. ఓం తత్ సత్.

"నీరు నింపిన కడవలు నెత్తికెత్తుకొని స్త్రీలు తమలో తాము మాట్లాడుకుంటూ నడుస్తారు. కాని వారి ధ్యానం కడవల పైనే నిలిచియుంటుంది.

అట్లే కర్మల్లో ప్రవృత్తుడైన యోగి కూడా : ఆ కర్మలు వానిని కలచవు. వాని మనస్సు బ్రహ్మమందే తవిలి ఉంటుంది."

"యోగియే నిజమగు భక్తుడు"

*శ్రీ రమణ భాషణములు - పుట 216*

# జ్ఞానగీతిక

మలయాళ మూలం: 16వ శతాబ్దపు మహాకవి, కృష్ణభక్తశిరోమణి
శ్రీ పూన్తానమ్ నంబూద్రి రచించిన "జ్ఞానప్పాన"

*ఆంధ్రానువాదం: గురువాయూర్ గోపికా వల్లభదాస*
*డా. మల్లిప్రియ 'నాగరాజు'*

## పీఠిక

**"జన్మాంతర సహస్రేషు తపోధ్యాన సమాధిభిః**
**నరాణాం క్షీణపాపానాం కృష్ణభక్తిః ప్రజాయతే"**

అనేది మహాపురుషుల మహావాక్యం. అనేక వేల జన్మల పుణ్యంకూడి వచ్చినప్పుడుగాని, ఏ జీవికైనా నారాయణస్ఫురణ కలుగదు. అట్టి స్ఫురణ కలిగిన వారిలో ఏ కోటికొకరికో, శ్రీమన్నారాయణుని త్రికరణశుద్ధిగా సేవించుకొనే భాగ్యం లభిస్తుంది. అట్టి భాగ్యం లభించిన అదృష్టవంతులలో ఏ కొద్దిమందికో ఆయన అనుగ్రహాన్ని పరిపూర్ణంగా పొందగలిగే గోలోకధామం లభిస్తుంది. అట్టి భాగ్యరేఖగల మహాపురుషులలో శ్రీ పూన్తానమ్ నంబూద్రి ఒకరు.

మలయాళ మహాకవి పూన్తానమ్ నంబూద్రి బ్రాహ్మణ వంశంలో, కేరళరాష్ట్రంలోని మలప్పురం జిల్లా, వళ్ళువనాడ్ తాలూకాలో గల నెమ్మేని అనే కుగ్రామంలో, క్రీస్తు శకం 1565లో జన్మించి, 1655 లో సిద్ధిపొందినటలు తెలుస్తోంది. పూన్తానమ్ నంబూద్రి బ్రాహ్మణ వంశంలో జన్మించినా, ఆయనకు సంస్కృతం అబ్బలేదు. నిజానికి నంబూద్రి బ్రాహ్మణులు నేటికీ తమ ఇళ్ళలో సంస్కృతమే మాట్లాడుతుంటారు. పూన్తానమ్‌కు మాతృభాషయైన మలయాళం తప్ప, ఏ భాషారాదు. ఆయనకు చిన్నతనంలోనే వివాహం చేసారు. ఒక కుమారుడు కలిగి, అన్నప్రాసననాడే ఆ బాలుడు మరణించాడు. ఆయనలో వైరాగ్యం చోటు చేసుకొంది. అంతే! పూన్తానమ్ గురువాయూర్‌లోని ఉన్నికృష్ణన్ (బాలకృష్ణుని) తన బిడ్డగా, తండ్రిగా, గురువుగా, సర్వస్వంగా భావించి, కృష్ణభక్తితో, కృష్ణప్రేమతో తరించటం జరిగింది. అందుకే "జ్ఞానప్పాన"(జ్ఞానగీతిక) లోనే ఒకచోట ఇలా అంటాడు:

**"ఉన్నికృష్ణన్ మనస్సిల్ కళిక్కుంబోళ్**
**ఉన్నిగళ్ మట్టువేణమో మక్కళాయ్"**

అంటే బాలకృష్ణుడు మన మనస్సులో నృత్యం చేస్తూ, ఆడుకొంటూ ఉండగా, ఇక మనకు పిల్లలతో ఏంపని? అని దీని అర్థం.

సంస్కృతం తెలియని పూన్తానమ్ మలయాళ భాషలోని "మహాభాగవతం" ప్రతిరోజూ చదివేవాడు. తను ఎంతవరకు చదివాడో గుర్తుగా ఒక పుల్లను గ్రంథంలో ఉంచేవాడు. కాని తెల్లవారేసరికి ఆ పుల్ల "రాసలీల" అధ్యాయంలో ఉండేది. తాను ప్రతిరోజూ గ్రంథంలో ఎక్కడ పుల్ల ఉంచినా, తెల్లవారేసరికి అది "రాసలీల" లోకే మారిపోయేది. కారణం? ఒక రోజు రాత్రి గురువాయురప్పన్ స్వప్నంలో కనుపించి, "నీ నోట రాసలీల వినటం నాకెంతో ఇష్టం, అందుకే మళ్ళీమళ్ళీ నీవు చదువుతుంటే వినాలని ఆ పుల్లను నేనే "రాసలీల"లోకి మారుస్తున్నాను" అన్నాడు. ఎంతటి అదృష్టవంతుడోగదా పూన్తానమ్!

ఒకనాటి రాత్రి పూన్తానమ్ తన గ్రామమైన

నెమ్మేని నుండి గురువాయూరు వస్తున్నాడు. ఆరోజుల్లో (400 ఏళ్ళ క్రితం) అదంతా అడవి ప్రాంతం గదా! ఎలాగైనా తెల్లవారు జామున 3 గంటలకల్లా నిర్మాల్య దర్శనానికి గురువాయూర్ చేరాలని పూన్తానమ్ అడవిలో గబగబా నడుస్తున్నాడు. అంతలో దొంగలు అతన్ని చుట్టు ముట్టారు. దిక్కుతోచని స్థితిలో గజేంద్రునిలాగా, ద్రౌపదిలాగా ఆర్తితో **"కృష్ణా"** అని కేక పెట్టాడు భక్త పూన్తానమ్. అంతే! వెంటనే డెక్కల శబ్దం వినిపించింది. ఆనాటి సేనాధిపతి మల్లనాయకుడు గుంపై వచ్చి, దొంగలను తరిమివేసి, కొందరిని చంపివేసి, పూన్తానమ్‌ను రక్షించాడు. పూన్తానమ్ కృతజ్ఞతతో సేనాపతికి తన రత్నాల ఉంగరం ఇచ్చాడు.

ఇక గురువాయూర్‌లో ప్రధాన తంత్రికి (పూజారులందరికీ అధిపతి) స్వప్నంలో కృష్ణస్వామి కనిపించి "నా విగ్రహం ముందు ఒక రత్నాల ఉంగరం ఉంటుంది, దాన్ని పూన్తానమ్‌కు అందజేయ్" అని శెలవిచ్చాడు. తంత్రి లేచి, కాలకృత్యాలు తీర్చుకుని, పవిత్రస్నానం చేసి, తెల్లవారుజామున సరిగ్గా 2.55 నిమిషాలకు గర్భగుడి తాళంతీసేసరికి, నిజంగానే మూలవిరాట్ ముందు ఒక రత్నాల ఉంగరం కన్పించింది. సరిగ్గా తెల్లవారుజామున 3 గంటలకు నిర్మాల్య దర్శనంకై వైకుంఠద్వారం తీయగానే పూన్తానమ్ ఆలయంలోకి వచ్చాడు. ప్రధాన తంత్రి తన స్వప్న వృత్తాంతం చెప్పి, పూన్తానమ్‌కు ఆ ఉంగరం ఇచ్చాడు. అది రాత్రి మల్లనాయకునకు పూన్తానమ్ ఇచ్చిన రత్నాల ఉంగరమే! **ఆహా! "కృష్ణా" అని పిలవగానే, సేనాని మల్లనాయకుని రూపంలో వచ్చి తనను రక్షించింది శ్రీకృష్ణ పరమాత్మ అన్నమాట! ఎంత అదృష్టం!** (భారతదేశంలోనేకాదు, ప్రపంచం మొత్తం మీద గురువాయూర్ శ్రీకృష్ణాలయం ఉన్నంత పవిత్రంగా మరే దేవాలయమూ ఉండదు. ముఖ్యంగా హిందూ మతానికి ఈ దేవాలయం పవిత్రతలో పరాకాష్ట వంటిది. కుంభవృష్టి పడుతున్నా, ప్రతిరోజూ తెల్లవారు ఝామున సరిగ్గా 3 గంటలకే వైకుంఠ ద్వారం తీయబడుతుంది. ఆసమయంలో చతుర్భుజుడైన శ్రీమన్నారాయణుడుగా స్వామి మనముందు సాక్షాత్కరిస్తాడు. ఈ నిర్మాల్యదర్శనం కోసం నేడు ప్రతి రోజూ కొన్నివేల మంది క్యూలో రాత్రి 2 గంటలనుంచే కాచుకొని ఉంటారు. (అప్పటికే స్నానం చేసి). ఈ నిర్మాల్యదర్శనం కేవలం 35 నిమిషాలే! తర్వాత గర్భగుడి మూసేస్తారు. మనం గుడిలోపలే ఉంటాం. సరిగ్గా 4 గంటలకల్లా (తెల్లవారుజామున) సుప్రభాతం ప్రారంభమౌతుంది. లోపల బాలకృష్ణుడు అందమైన ఎర్రని గోచీతో, చేతిలో వెన్నముద్దతో, మురళీధరుడై మనకు దర్శనమిస్తాడు. రాత్రి 10 గంటల 5 నిమిషాలకు దేవాలయం మూసేవరకు శ్రీకృష్ణదేవుడు వివిధరూపాలలో కనుపిస్తాడు. తిరిగి నారాయణుని దర్శనం మర్నాడు ఉదయం 3 గంటలకే లభ్యమౌతుంది).

భక్త పూన్తానమ్ జీవితంలో మరో సంఘటన. మలయాళంలో తేలిక పదాలను కూర్చుకొని **"జ్ఞానప్పాన"** వ్రాసిన పూన్తానమ్, దానిలో తప్పులుంటే దిద్దిపెట్టమని ప్రముఖ సంస్కృత పండితుడు, **"నారాయణీయం"** వ్రాసి తన పక్షవాతాన్ని పోగొట్టుకొన్న మేల్పత్తూర్ నారాయణభట్టతిరి వారిని కోరాడు. నారాయణ భట్టతిరి అహంకారంతో తనకు మాతృభాష చూసే తీరిక లేదని, ఆ సమయమే ఉంటే బాలకృష్ణునిపై మరో పదిశ్లోకాలు సంస్కృతంలోనే వ్రాసుకొంటానని చెప్పాడు. పూన్తానమ్ అవమానంతో ఇంటి ముఖం పట్టాడు. ఆరాత్రి నారాయణభట్టతిరి వారికి తగ్గిపోయిన పక్షవాతం తిరిగి వచ్చింది. శ్రీకృష్ణపరమాత్మ ఆయనకు స్వప్నంలో కనుపించి, **"నీ భక్తికన్నా పూన్తానమ్ భక్తియే మిన్న"** అన్నాడు. వెంటనే నారాయణభట్టతిరి వారు పూన్తానామ్ వద్దకు వచ్చి ఆయనను క్షమాపణకోరాడు. వెంటనే ఆయనకు రాత్రి వచ్చిన పక్షవాతం పోయింది.

ఇక తిరిగి జీవితంలో రాలేదు. నారాయణభట్ట తిరివారు తమ సంస్కృత గ్రంథం "నారాయణీయం"తో పాటు, పూన్తానమ్ కవీంద్రుని మలయాళ గ్రంథం "జ్ఞానప్పాన" కు కూడా విశేష ప్రచారం కల్పించారు. (రెండూ శ్రీకృష్ణునిపై వ్రాసినవేగదా!) నేడు గురువాయూర్ దేవాలయంలో "నారాయణీయం" "జ్ఞానప్పాన" నిరంతరం మార్మోగుతుంటాయి (రెండూ).

"జ్ఞానప్పాన" లో ఒక చోట "అమరప్రభో" అనబోయి "మరప్రభో" అని వ్రాసాడు భక్త పూన్తానమ్. "మర ప్రభో" అంటే చెట్లకు ప్రభువని అర్థం. ఈ పొరపాటు దొర్లినందుకు పూన్తానమ్ ఆ రోజంతా బాధ పడ్డాడు. ఆ రాత్రి శ్రీకృష్ణుడు స్వప్నంలో కనుపించి, అది తప్పుకాదని, తాను దేవతలకే (అమరులు) కాక చెట్లకు (మర) కూడా ప్రభువునేనని చెప్పి, పూన్తానమ్‌కు ఆనందం కలిగించాడు.

ఇక 1655 లో తన 90వ ఏట పూన్తానమ్ ఒకనాడు భక్తులందరినీ పిలిచి, ఆరోజు తన ఇంటికి శ్రీకృష్ణ పరమాత్మ వస్తున్నట్లు చెప్పాడు. కుర్చీలు వేసి, రకరకాల పండ్లు, వంటకాలు, పూలు సిద్ధంచేసాడు. కొంతసేపటికి ఆనందంతో నృత్యం చేయసాగాడు. "కన్నా, గురువాయూరప్పా, వచ్చావా, రా" అంటూ కుర్చీలో దండ వేసాడు. పండ్లు, పాలు, వంటకాలు నైవేద్యం పెట్టి, హారతి ఇచ్చాడు. కానీ అక్కడి వారెవరికీ ఎవరూ వచ్చినట్లు కనుపించలేదు. పూన్తానమ్ ఒక్కడికే స్వామి కనుపించాడన్నమాట! మరో పదినిమిషాలు శ్రీకృష్ణ నృత్యం సంకీర్తనం చేస్తూ పూన్తానమ్ ఒరిగి పోయాడు. ఆనాడు కృష్ణాష్టమి.

కృష్ణభక్తులందరిదీ ఒకే కుటుంబంకాబోలు, జయదేవుడు, మీరాబాయి, నర్సీమెహతా, విద్యాపతి, చండీదాస్, సూరదాస్, నారాయణ భట్టతిరి- వీరందరూ కృష్ణాష్టమి నాడే అస్తమించారు. "జ్ఞానప్పాన" వ్రాసిన పూన్తానమ్ కూడా కృష్ణాష్టమి నాడే స్వామిలో ఐక్యం కావటం గమనార్హం.

## జ్ఞానగీతిక భావసౌందర్యం

1. *కృష్ణకృష్ణా ముకుందా జనార్దనా*
*కృష్ణగోవింద నారాయణా హరే*
*అచ్యుతానంద గోవింద మాధవా*
*సచ్చిదానంద నారాయణా హరే*
2. నా నాలుకపై భగవన్నామం జపింప బడాలన్నా, ఈ నరజన్మ సఫలంకావాలన్నా గురుదేవుడు ఎల్లవేళలా నాతో వుండి, నాకు సహాయం చేయాలి. అట్టి సహాయానికై నేను ఆయనను అర్థిస్తున్నాను.
3. నిన్న ఏమైందో, రేపు ఏమౌతుందో తెలియదు. కనిపించే ఈ శరీరానికి వినాశనం ఎప్పుడో ఎవరూ చెప్పలేరు.
4. ఈ రోజు కనిపించే జనం రేపు మనకు కనిపిస్తారనే నమ్మకం లేదు. ఈ నాటకం ఆడిస్తున్నది ఆ పరాత్పరుడే. మనల్ని పల్లకీ ఎక్కించి రెండురోజులో, నాలుగు రోజులో తిప్పుతున్నది ఆ భగవంతుండేనని మనం తెలుసుకోవాలి.
5. రాజాధిరాజులైన ధనవంతులు కూడా కష్టాలు అనుభవించక తప్పదు. మన భుజంపై పెద్ద మూటను ఎక్కించి, మనల్ని తిప్పుతున్నది ఆ భగవంతుడే! చూస్తే కొందరికి అర్థమౌతుంది, చూసినా కొందరికి అర్థం కాదు.
6. మనుషులలో వివిధ రకాల విశేష మనస్సుగల వారున్నారు. ఈ కనిపించే ప్రపంచం సత్యం కాదని కొందరు ముందే గ్రహిస్తున్నారు.
7. ప్రజలను విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దటం కోసమే శాస్త్రాలు పలురకాలుగా చెప్పటం జరిగింది. మానవులు కర్మలకు అధికారులు కాబట్టి కర్మశాస్త్రాలు అనేక పద్ధతులలో చెప్పబడ్డాయి.
8. సంఖ్యాశాస్త్రం, యోగశాస్త్రం, కర్మశాస్త్రం - యిలా ఎన్నో శాస్త్రాలున్నాయి. అవి ఎన్ని ఉన్నాయో ఎవరూ చెప్పలేరు. సంసార చక్రమనే సుడిగుండంలోపడి తిరుగుతున్న

మనకు అనేక విషయాలను తెలియజేసేది కాలమే.

9. జ్ఞానులైన మహర్షులు చెప్పిన మాహాత్మ్యాలలో ఎన్నో పరమార్థాలు ఇమిడి ఉన్నాయి. ఆల్చిప్పలో ముత్యం ఉంది. ఆ ముత్యం లభించాలంటే (అంటే మోక్షం లభించాలంటే) చెవి ఒగ్గి వినండి.

10. మనల్ని బంధించే సాధనం "కర్మ" అని తెలుసుకోండి. అలాగే ఈ విశ్వమంతా ఒకే జ్యోతి స్వరూపమని గ్రహించండి.

11. ఆ జ్యోతి నిరుపమానమైనది. ఏ వస్తువూ ఆ జ్యోతిని తాకలేదు. ఆ జ్యోతి ఏ కర్మలలోనూ లీనంకాదు. ఒక్కొక్క రకంగా ఊహించే వారికి ఒక్కొక్క పద్ధతిలో విషయం గోచరిస్తుంది.

12. ఏవిధంగా ఊహించేవారికి ఆ విధంగానే ఆ జ్యోతి కనిపిస్తుంది. జీవన స్వరూపం కూడా అట్టిదే. జ్ఞానులకు తెలిసింది అజ్ఞానులకు తెలియదు. ఏ బంధానికీ కట్టుబడకుండా ఎవరైతే ఉంటారో, వారికి ఏ బంధమూ ఉండదు. ఈ జ్యోతి సరిగ్గా అలాంటిదే (అంటే దేనికీ అది కట్టుబడదు).

13. బంధం వదిలేస్తే ఈ విశ్వమంతా మనదే. ఈ మానవులంతా మనవారే! విశ్వమంతా ఈ మానవులతోనే నిండిఉంది, తిరిగి తాము విశ్వమంతా నిండి ఉన్నారు. చివరకు ఒకే పదార్థంలో అంతా కలిసిపోతుంది. అలా లయమైపోయిన తర్వాత విశ్వమే ఉండదు. ఆ విధంగా అంతా ఏ పదార్థంలో కలిసిపోతుందో, ఆపదార్థమే పరమాత్మ. ఆ ఒక్క పదార్థం కోసం అంటే పరమాత్మ కోసం నిర్మింపబడివున్న ఈ విశ్వంలో మూడురకాల కర్మలున్నాయి. అవే పుణ్యకర్మ, పాపకర్మ, పుణ్యపాప మిశ్రమ కర్మ.

14. మూడురకాల కర్మలలాగే, ఈ విశ్వం మూడు జాతులలో రంగరింపబడి ఉన్నది. మూడు సంఖ్యతోనే బంధింపబడిఉన్నది. రెండు, నాలుగు సంఖ్యలతో నిర్మింపజేస్తే అది మిశ్రమ కర్మ. ఏది ఏమైనా బ్రహ్మావాది మొదలు చీమ వరకు ఏ జీవియైనా కర్మబద్ధుడు కాక తప్పటంలేదు. బంగారు గొలుసుకు, ఇనుప గొలుసుకు భేదం ఉన్నట్లే కర్మలలోనూ భేదం ఉంది.

15. లోకాలను సృష్టించటం, ప్రళయంలో ముంచటం, కర్మపాశాన్ని త్రెంచటం, త్రెంచుకోవటం ఆ బ్రహ్మదేవునికి కూడా సాధ్యంకాదు.

16. పాపం దిక్పాలకులు కూడా ఒక్కొక్క దిక్కులో బంధింపబడి ఉన్నారు.

17. అల్ప కర్మలమైన మనంకూడా స్వల్ప కాలంలోనే జంతువులుగా పుట్టి కర్మను అనుభవించటం జరుగుతున్నది.

18. నరకలోకంలో పాపఫలం అనుభవించి, తర్వాత జీవుడు మనోపరిపాకం కలిగి తిరిగి జన్మిస్తుంటాడు. ఆయా జన్మలలో పుణ్య కర్మలు చేసి, అనంతరం సత్యలోకాలకు పోతాడు.

19. సత్కర్మల వలన జీవులు స్వర్గసుఖాలు పొందుతారు. కానీ ఏం ప్రయోజనం? ఆ స్వర్గసుఖాలు అనుభవించటం పూర్తికాగానే, వారికి పరిపూర్ణత, పరిపక్వత నువ్వు గింజంత కూడా ఉండదు.

20. తిరిగి భూమిపై జన్మించి పాపాలు చేయటం, తర్వాత మరణించి నరకలోకానికి పోవటం మామూలే!

21. సత్కర్మల వలన దేవలోకానికి పోయి, అనంతరం ఈ మానవలోకంలో ఏ మహారాజు గానో జన్మిస్తాడు. అలాగే పాపకర్మలు చేసినవారు చండాలురుగా పుట్టక తప్పదు.

22. సత్కర్మల వలన రాక్షసులుకూడా దేవత లౌతారు. అలాగే చెడ్డకర్మల వలన దేవతలు కూడా వృక్షాలవుతారు. ఈ మంచి కర్మ, చెడు కర్మల కారణంగానే మేక ఏనుగై

పుడుతుంది, ఏనుగు మేకై పుడుతుంది (కనుక మనం జ్ఞానం కలిగి సత్కర్మలు చేయాలని మహాభక్తుడైన పూన్తానమ్ చెబుతున్నాడు).

23. నక్క చనిపోయి నరుడుగా పుడుతుంది (సత్కర్మల వలన). స్త్రీ చనిపోయి నక్కగా పుడుతుంది (పాపకర్మల వలన). దయా విహీనుడై ప్రజలను పీడించిన మహారాజు కటికివాడైపుడతాడు (దుష్కర్మలవలననే).

24. ఈగ చనిపోయి పిల్లిగా పుడుతుంది. సర్వం ఈశ్వర విలాసమని గ్రహించాలి. అయితే ఒక్కటి మాత్రం నిజం. క్రింద, మీద పరుగులిడే ఈ జీవుడు తన కర్మనంతా భూమి మీదే అనుభవిస్తాడు.

25. ఈ భూమి మీదే జీవుడు లెక్కలేనన్ని కర్మలు పొందుతున్నాడు. ఆ కర్మల ఫలితంగా అన్యలోకాలలో జన్మిస్తున్నాడు.

26. జీవుడు కర్మఫలాన్ని తానే భుజిస్తున్నాడు. తిరిగి కొన్నాళ్ళ అనంతరం, కర్మలు తీరిన తర్వాత, మళ్ళీ పుణ్య, పాపకర్మలు చేసి, తిరిగి కర్మఫలం అనుభవిస్తున్నాడు.

27. ఇదంతా ఎలా ఉందంటే ఇంటి నుంచి తెచ్చుకొన్న వస్తువును అమ్మి భోజనం చేస్తున్నట్లుగా ఉంది. (కర్మలు చేయటం, ఫలం అనుభవించటం, తిరిగి కర్మలు చేయటం, తిరిగి ఫలం అనుభవించటం, అన్నమాట).

28. కర్మ అనుభవించటానికి కావలసిన వ్యవసాయ భూమి ఏదనుకున్నారు? ఈ దేహమే. ఈ దేహమనే భూమే కర్మ అనుభవించే జన్మదేశ వ్యవసాయక్షేత్రం.

29. కర్మనాశం కలగాలంటే వేరేమార్గంలేదు. ఉన్నది ఒక్కటే మార్గం. భక్తులకు, ముముక్షువులకు, విషయసౌఖ్యం లేని వారికి మాత్రమే కర్మనాశం సాధ్యపడుతుంది. విషయసౌఖ్యం అనేదాన్ని వదిలేసి, భక్తులుగా, ముముక్షువులుగా మారినవారికి ఈ భూమియే సర్వం ఇస్తుంది (భూమి అంటే ఇక్కడ భరత భూమి అని అర్థం. భారతదేశం ఆధ్యాత్మిక దేశమని, ఇక్కడ జన్మించిన వారికే కర్మనాశం సాధ్యమని గ్రహించాలి). ఈ పవిత్ర భూమే విశ్వమాత. విశ్వనాథుడే మూల ప్రకృతి.

30. అవనీతలాన్ని (భూమిని) పరిపాలించే విషయంలో భగవంతుడు అనేక అవతారాలు ఎత్తాడు. అయితే చతుర్దశభువనాల లోనూ (పదునాలుగు లోకాలలోనూ) ఉత్తమమైనదీ, విశేషమైనదీ ఈ భూలోకమొక్కటే!

31. వేదవాదులైన మునీశ్వరులచే వేదాలను ప్రజలకు బహూకరింపజేసిన కర్మభూమి మనది. సప్తద్వీపాలలోనూ శ్రేష్ఠమైనది. కేవలం లవణాంబుధి మధ్యంలో విరాజిల్లే ఈ జంబూద్వీప మొక్కటేనని వేదాలు, మునీశ్వరులుకూడా నొక్కి వక్కాణించారు.

32. భూమి అనే పద్మానికి కర్ణికవంటి భరతఖండంలో మనం ఉంటున్నాం. తొమ్మిది ఖండాలు (నవద్వీపాలు) ఉన్నప్పటికీ, వాటన్నిటిలోనూ ఉత్తమమైనది భరతఖండం ఒక్కటే!

33. మహామహిమోపేతులైన మునిశ్రేష్ఠులు ఈ భరతఖండాన్ని కర్మక్షేత్రంగా పేర్కొన్నారు. అంతే కాదు, బ్రహ్మలోకంలోని వారికి కూడా ఇదే (ఈ భారతదేశమే) కర్మబీజమని పేర్కొనటం జరిగింది.

34. కర్మ బీజాన్ని నాశనం చేయటానికి, తిరిగి పుట్టకుండా జన్మనాశం కలగటానికి అనువైన చోటు ఈ భరతఖండమే! ఇక్కడ మాత్రమే జన్మనాశం సాధ్యమని మనం గ్రహించాలి.

35. ఖండాలలో భరతఖండం ఎలా శ్రేష్ఠమైనదో, నాలుగు యుగాలలోనూ కలియుగమే శ్రేష్ఠమైనది. ఈ కలియుగంలో జన్మించిన వారికి ముక్తి సుగమం (తేలిక).

ఈ కలియుగంలో "కృష్ణకృష్ణా ముకుందా జనార్దనా, కృష్ణా, గోవింద, రామ" అనే కృష్ణ

నామంతోనే ముక్తిలభిస్తుంది. అంటే కేవలం నామసంకీర్తనంతోనే ఈ కలియుగంలో ముక్తి సాధ్యమన్నమాట!

36. ఇతర లోకాలలో జన్మించిన వారు (భూలోకం తప్ప మిగిలిన పదమూడు లోకాలలో ఉండేవారు), అలాగే ఇతర యుగాలలో జన్మించిన వారు (కృతయుగం, త్రేతాయుగం మరియు ద్వాపరయుగాలలో జన్మించినవారు) ముక్తి పొందలేక, ఈ కలియుగంలో, అందులోనూ భారతదేశంలో జన్మించి, తమ జన్మధన్యమైనట్లు భావించి, నమస్కరిస్తున్నారు. (అన్ని యుగాలలోనూ కలియుగమే గొప్పది, కారణం కేవలం భగవన్నామ సంకీర్తనంతో కలియుగంలో ముక్తి లభిస్తుంది. అలాగే పదునాలుగు లోకాలలోనూ శ్రేష్ఠమైనది భూలోకమే. ఈ భూలోకంలోనూ భారతదేశం కర్మభూమి గనుక ఇక్కడ జన్మించిన వారికి భగవంతుని దర్శనం, మోక్షం తేలిగ్గా లభిస్తాయని ఇందలి గూఢార్థం).

37. ఈ భారతభూమిలో తృణంగా (గడ్డిపోచగా) జన్మించినా నిజంగా భాగ్యమే సుమా! ఈ కలియుగంలో, అందులోనూ ఈ భరత ఖండంలో జన్మించాలని యోగులే కోరుకుంటారు! ఈ యుగంలో (కలియుగం), ఇక్కడ (భారతదేశంలో) పుట్టే భాగ్యం పోయిందేనని ఎందరో విలపిస్తారు.

38. "ఈ భరతఖండంలో జన్మించిన పుణ్యాత్ములగు మానవులకు నమస్కారం, కలిదేవునకు నమస్కారం" అంటూ ఎందరో మనల్ని ప్రశంసిస్తున్నారు. మనల్ని అందరూ ఎందుకు మెచ్చుకోవాలి? అదే భరతభూమి విశిష్టత, ఘనత.

39. ఇది కలియుగంకాదా? ఇది భారతదేశం కాదా? కలియుగ భారతీయులకిట్టి ప్రశంస లభించిందంటే ఏమిటి అర్థం? మనం మానవులమని నిరూపించటానికే ఈ ఘనత, ఈ ప్రశంస అని తెలుసుకోండి.

40. హరినామం మాయమైపోతుందా? నరకభయం లేకుండా ఉండగలమా? నాలుక లేకుండా జన్మ ఎత్తగలమా? మనకు - అంటే మానవజన్మకు వినాశనం లేకుండా పోతుందా? లేదు, లేదు.

41. కష్టం, బాధ అనుకోకుండా పలురకాలుగా వున్న ఈ జన్మను అనుభవిస్తున్నాం. అంటే అర్థం ఏమిటి? ఈ జన్మని నిప్పుల్లో శుద్ధిచేసి తింటున్నామనేగా!

42. ఎన్ని జన్మల ప్రయాస కోర్చుకొని, ఎంత సుకృతం చేసుకొంటే ఈ నరజన్మకలిగిందో గదా!

43. ఎన్ని జన్మలు మలంలో, ఎన్ని జన్మలు జలం మధ్య, ఎన్ని జన్మలు మట్టిలో, ఎన్ని జన్మలు వృక్షాలుగా గడిపామోగదా!

44. ఎన్ని జన్మలు చనిపోయి తిరిగి పుట్టామో గదా! ఎన్ని జన్మలు మృగాలుగా, పశువులుగా జీవించామో గదా! ఆ విధంగా ఎన్నో జన్మలు ఎత్తిన అనంతరం ఈ మానవ జన్మ వచ్చింది.

45. ఎన్నో బాధలుపడి, ఎంతో ప్రయాస అనుభవించి, చివరకు ఈ మానవగర్భంలో పడ్డాం. కొన్ని నెలలు యమయాతన అనుభవిస్తూ గర్భంలో ఉండిపోయాం. జన్మించిన తర్వాత పన్నెండు సంవత్సరాలు బాల్యంలో గడిచిపోయాయి.

46. పన్నెండు సంవత్సరాల తర్వాత నెమ్మదిగా యవ్వనదశ వచ్చింది. "నేను" అనే అహంకారం వచ్చి, కన్నూమిన్నూగానక తానెవరో తెలియకుండా ప్రవర్తించటం జరిగింది.

47. ఎంత కాలం జీవిస్తామో మనకు తెలియదు గదా! ఇది మాత్రం సత్యం (మనం ఎప్పుడు చనిపోతామో చెప్పలేంగదా?).

48. ఈ దేహం నీటిబుడగలాంటిది (నీటి బుడగ ఎంత అశాశ్వతమో ఈ శరీరం కూడా అంతేనని భావం). నీటిబుడగ లాంటి ఈ

క్షణిక జీవితం కేవలం "లావు" గా ఉండటం చూస్తున్నాం (అది బలుపు కాదు, కేవలం వాపు అని గ్రహించండి).

49. సర్వకాలాలలోనూ తిరునామ సంకీర్తనం సవ్యంగా చేయటంలేదు. అలాగే స్నాన పానాదులను గూర్చి కలహించుకొని, అవిలేకుండానే తిరుగుతున్నాం. (అంటే వివిధ మతాలవారు వారివారి ఆచారాలను గూర్చి ఇతరులతో కలహం పెంచుకొని, చివరకు అందరూ ఆచార హీనంగా తయారవు తున్నారని పూన్తానమ్ కవిచంద్రుని భావం).

50. మదమాత్సర్యాలతో కూడుకొని, బుద్ధిహీనులై, చంచలాక్షులతో (వేశ్యలు తదితర స్త్రీలతో) తిరుగుతున్నారు. రాజదర్బార్‌లో ఉద్యోగాలు చేస్తూ, ఆ నీచమైన రాజసేవే శాశ్వతమనుకొని "నాకేం?" అని అహంకరిస్తున్నారు.

51. బ్రాహ్మణులు శాంతికర్మలు చేస్తూ సంధ్యాసమయం వరకూ తిరుగుతున్నారు. కొందరు తల్లిదండ్రులకు, భార్యకు భోజనంకూడా పెట్టరు. కొందరైతే అగ్నిసాక్షిగా వివాహమాడిన భార్యను స్వప్నంలో కూడా తలచరు.

52. అదేమని ఎవరైనా అడిగారనుకోండి, సజ్జనులను శత్రువులుగా చూస్తున్నారు. వందించాల్సిన వారిని నిందిస్తున్నారు. అంటే నమస్కరించవలసిన పెద్దలను, భక్తులను నిందిస్తూ ఎగతాళిచేస్తున్నారని అర్థం.

53. "చూడు, నా మూలంగానే నా సంసారం నిలుస్తోంది," అంటారు, తామే ఈ విశ్వాని కంతా ఏదో సర్వాధికారులైనట్లు.

54. బ్రాహ్మణులు కూడా కొందరు ఎంతో అహంకారంతో "బ్రహ్మ కూడా మనకు సరిపోడు" అంటున్నారు. ఎంత ఆత్మద్రోహం! (వినయసంపన్నుడే నిజమైన బ్రాహ్మణుడని, బ్రాహ్మణునకు అహంకారం ఉండరాదని నంబూద్రి బ్రాహ్మణుడైన భక్తపూన్తానమ్ అంటున్నాడు).

55. ధనాశ విపరీతంగా పెరిగిపోయి, కేవలం ధనార్జనే ప్రధాన లక్ష్యంగా భావించి కొందరు అగ్నిహోత్రాది కర్మలు చేస్తున్నారు. లెక్కలేనంత బంగారం, నవరత్నాలు కొని, నిల్వచేసి, సంతోషిస్తున్నారు.

56. ఏనుగులతో, గుర్రాలతో వ్యాపారం చేస్తున్నారు. అలాగే ఓడలతో ఎంతో పెద్ద వ్యాపారం చేస్తున్నారు. కొందరు అంతులేకుండా ధనం సంపాదించాలని ఆశపడతారు. శివశివ!

57. వృత్తిధర్మదూరులై, పరమధూర్తులై, ధనాశతో మానవులు నశిస్తున్నారు. కోటికి పడగెత్తినా (ఎంత ధనం సంపాదించినా) కొందరి మనస్సు తృప్తిచెందదు.

58. పది దొరికితే నూరు కావాలని మనస్సు కోరుతుంది. నూరు దొరికితే వెయ్యి కావాలనే కోర్కె పుడుతుంది. ఎంత సంపాదించినా తనివితీరదు. ఇది మానవనైజం. దీనికి ఆశ్చర్యపడాల్సిన పనిలేదు ("**తృప్తి**" ని మించిన ధనం లేదని, మనిషికి "**తృప్తి**" అవసరమని మహాకవి పూన్తానమ్ మనకు బోధిస్తున్నాడు).

59. మానవుణ్ణి ఆశాపాశం వదలదు. ఈ ఆశవల్ల అంతులేని కోర్కెలు కలగటం కూడా సహజమే! ఆశ వున్న వాడికి లోభిత్వం కూడా తోడవుతుంది. సజ్జనులు యాచిస్తే కొంచెం కూడా ఇవ్వరు.

60. ప్రాణం పోయేటప్పుడు ఎవరైనా సరే కనీసం కట్టుకొన్న వస్త్రాన్ని కూడా తీసుకుపోరు. ఆ విషయం అందరికీ తెలిసిందేగదా! అయినా జీవించి ఉండగా మానవుడికి నువ్వు గింజంత పశ్చాత్తాపం కూడా కలుగదు. విశ్వాసహీనులై జీవిస్తారు.

61. ధనాశ ఎక్కువై, మానవులు సత్యాన్ని త్యజిస్తున్నారు. కానీ సజ్జనులు మాత్రం

సత్యాన్ని వీడరు. సత్యాన్నే వారు బ్రహ్మంగా భావిస్తారు. అలాటి సత్యాన్ని సామాన్య మానవుడు త్యజిస్తున్నాడు. (అందరూ సజ్జనులుగా మారి సత్యవ్రతం పాటించాలని కవి ఆకాంక్ష).

62. విద్యతో తెలుసుకోవాల్సినవి తెలుసుకోలేక, మిడిమిడిజ్ఞానంతో విద్యావంతుడనని మానవుడు గర్విస్తున్నాడు. నిజంగా ఇలాంటి మానవుడు కుంకుమ, గంధంమోసే గాడిదవంటివాడు.

63. కృష్ణా! మానవుడు కేవలం ఆశతో భ్రమిస్తున్నాడు. ఆయుష్షు మాత్రం కొంచెం కొంచెం తరిగిపోతున్నది. మోహం మాత్రం ఇంకాయింకా పెరిగిపోతున్నది.

64. ఓణం వస్తోంది. విషూ వచ్చిపోయింది (ఇవి కేరళ నివాసులైన మలయాళీయుల జాతీయ పండుగలు. విషూ అంటే ఉగాది, ఓణం మిక్కిలి పెద్ద జాతీయ పండుగ) తిరువాడిర రాలేదా? (ఆరుద్ర నక్షత్రం) కుంభమాసం ఎప్పుడొస్తుందో? - ఈ విధంగా ఆలోచిస్తుంటారు కొందరు!

65. శ్రాద్ధ కర్మ వృశ్చిక మాసంలో వస్తోందని, కనుక పుష్కలంగా డబ్బులు వస్తాయని కొందరు అనుకొంటారు. కొడుకు పుట్టాలని, వాడు పెద్దవాడు కావాలని, వాడికి మళ్ళీ కొడుకు పుడితే చూడాలని అంతులేని కోర్కెలతో కొందరు సతమతమవుతున్నారు. శివశివ.

పాపం భూమి అంతా తమ సొంతం కావాలను కొంటారు కొందరు (ఏదో కౌలుకు తీసు కొన్నట్లు). మానవుడి ఈ అత్యాశను చూస్తే నిజంగా జాలివేస్తుంది (జ్ఞానసౌందర్యం గలవారికి). అందుకే ఎలాటి కోరికలు ఉన్నా పాపం మనిషిచావక తప్పదుగదా అంటాడు పూన్తానమ్ మహాకవి.

66. ఎందుకు చెబుతున్నానో, మీరే బాగా ఆలోచించండి.

"కర్మ" యొక్క పెద్ద, చిన్న జన్మలు వచ్చిపోతుంటాయి.

67. కాలమా ఇది కలియుగం! మనం నివసిస్తున్నది మిక్కిలి పెద్దదైన, విశిష్టమైన భరతఖండంలో. ఇలాంటిచోట, ఇటువంటి కాలంలో పుట్టి, మనం ఊరికే వెళ్తేఎలా?

68. ఆయుర్దాయం తగ్గిపోతోంది. దీనికి ఏ ప్రమాణమూ లేదుగదా! ఉన్న కొద్దికాలం మానవుడు ఆరోగ్యంతో ఉండటం అవసరంగదా! ఆరోగ్యం పోయి అవస్థలు పడటం ఎందుకు? ఈ రోజే నామ సంకీర్తనం మొదలుపెట్టండి. అన్ని పురుషార్థాలూ సిద్ధిస్తాయి.

69. ఎప్పుడోకాదు. నరకభయాలను గూర్చి ఇప్పుడే ఇప్పుడే ఆలోచించండి (పాపకార్యాలను చేయవద్దని కవి పూన్తానమ్ నంబూద్రి హెచ్చరిస్తున్నాడు).

70. ఎందుకు అనవసరంగా వృధాకాలయాపన చేస్తారు? బయలుదేరండి, వైకుంఠానికి వెళ్ళండి (వెంటనే భూలోక వైకుంఠమైన గురువాయూర్ వెళ్ళి బాలకృష్ణుని (ఉన్నికృష్ణన్) దర్శించమని మరో అర్థం. కేరళ రాష్ట్రంలో శ్రీకృష్ణపరమాత్మ నెలకొనియున్న గురువాయూర్ సాక్షాత్తు వైకుంఠమే. ఆలస్యం చేయకుండా అక్కడకు చేరి స్వామిని (శ్రీ గురు వాయురప్పన్‌ను) దర్శించి తరించమని కవి చెబుతున్నాడు).

71. మనందరం కలిసి పుట్టటంలేదు, కలిసి మరణించటం లేదు. ఉన్న నాలుగు రోజుల మధ్యకాలంలో ఎందుకు మాత్సర్యాలు? (మనమంతా ఒకేసారి కలిసి జన్మించ లేదుగదా! అలాగే మనమందరం ఒకేసారి కలిసి చనిపోవటం లేదుగదా! ఉండే ఈ కొద్దికాలంలో ఒకరిపై ఒకరికి మాత్సర్యాలు, తగాదాలు, పోట్లాటలు ఎందుకు? అని

పూన్తానమ్ మహాశయుడు మనల్ని ప్రశ్నిస్తూ, మనకు జ్ఞాన బోధ చేస్తున్నాడు).

72. చతుర్విధపురుషార్థాలలో "అర్థం" ఉందిగదా! (ధర్మార్థకామమోక్షాలలో "అర్థం" ఉన్నదిగదా!) మరి ఇంకా ధనం (అర్థం) ఎందుకు ఆశిస్తున్నాం?

73. మధ్యాహ్నం సూర్యకాంతి ప్రకాశిస్తుండగా మనకు ఇంక దీపం ఎందుకు? అనవసరం గదా! ఆలోచించండి.

74. బాలకృష్ణుడు (ఉన్నికృష్ణన్) మన మనస్సులో నృత్యం చేస్తూ ఉండగా ఇక పిల్లలతో మనకేం పని? పిల్లలు ఉన్నాఒకటే, లేకపోయినా ఒకటే! (నిరంతరం మన హృదంతరంలో బాలకృష్ణుడు నృత్యంచేస్తూ ఉంటే ఇక మనకు పిల్లలతో పనిలేదని, బాలకృష్ణుడే మన బిడ్డ అనీ దీని అర్థం)

75. మీకు మిత్రులున్నారా! ఈ ప్రపంచంలో మీకు నిజమైన హితులు కృష్ణభక్తులేనని (విష్ణు భక్తులేనని) గ్రహించండి. శివశివ! నేడు విష్ణుభక్తులనే అవమానిస్తున్నారు, హింసిస్తున్నారు. ఎంతఘోరం!

76. మాయవిలాసాలు చూస్తున్నాం, చూపిస్తున్నాం, విలాసవంతులతోను, విలాసినులతోను కాలం గడుపుతున్నాం (ధనవంతుల గోష్ఠి, వేశ్యల గోష్ఠి), ఈ ప్రపంచానికి సంబంధించినంత వరకూ పంచభూతాలు మనకోసమే సృష్టించ బడ్డాయి.

77. విశ్వనాథుడే మనకందరకూ తండ్రి; విశ్వధాత్రియే మనకందరకూ తల్లి (భూమాతే నిజమైన తల్లి), తల్లి దండ్రులు మనల్ని ఎల్ల వేళలా రక్షిస్తుంటారుగదా? విశ్వజననీ జనకులైన వారినే నమ్మితే, ఇక మనం రక్షింపబడకుండా ఉంటామా? ఆలోచించండి.

78. ఆహారం స్వీకరించటంలో ఏది మంచి పద్ధతనుకున్నారు? అన్నాలలో భిక్షాన్నం, మనుషలలో సన్యాసి గొప్పవాడని పెద్దలు చెబుతున్నారు. కనుక భిక్షాటనంచేసి, ఆ భిక్షాన్నం భుజిస్తే ఎంతో శ్రేష్ఠం,

79. శక్తికొలది, నిండుభక్తితో నామజపం చేయండి, కోరికలులేని నామజపం మాత్రమే సత్ఫలితాల నిస్తుందని గ్రహించండి.

80. సిద్ధికాలం వచ్చేవరకు, అంటే ఆ పరాత్పరుని చేరేవరకు శ్రద్ధ కలిగి ఉండాలి. మానవా మానాలతో మనకు పనిలేదని గ్రహించి, సకల జీవజాలములకూ చేతులెత్తి నమస్కరించి, పూజించండి.

81. హరి శుశ్రూష కలిగి - అంటే ఆ శ్రీమన్నారాయణుని సేవిస్తూ, ఎటువంటి కష్టాలు వచ్చినా, ఎన్ని కష్టాలొచ్చినా ఓర్పుతో సహించాలి.

82. సజ్జనులు కనిపించగానే, సిగ్గు అనే దాన్ని వదిలి సాష్టాంగ నమస్కారం చెయ్యండి, సజ్జన దర్శనం సకలదోషపరిహారం కదా!

83. భక్తి పారవశ్యం కలిగి, ఆ దత్తాత్రేయునివలె నృత్యం చేయాలి.

84. ఈ విధంగా భూతలంలో సంచరించటం వల్ల కర్మ శేషమనే ప్రారబ్ధం పూర్తిగా నశిస్తుంది.

85. మన కర్మ తీరగానే ఈ దేహం (శరీరం) పడిపోతుందని గ్రహించండి.

86. దేహాన్ని వదిలిన తర్వాత (మనం మరణించిన తర్వాత) జీవుడు బ్రహ్మాన్ని చూడాలని తపిస్తాడు. ఆ బ్రహ్మాన్ని చూసిన తర్వాత జీవుడు ఎంతోసంతోషిస్తాడు.

87. అసలు ఏ విషయమైనా కానీండి, ఆసక్తిని వదలి సంచరిస్తే, మనకు ఏ కర్మా ఉండదు, ఏ కర్మా మనల్ని బంధించలేదు కూడా, మీ మనస్సుకు పరితాపం కలిగించే పనులు చేయకండి. చక్కగా తిరునామ మాహాత్మ్యం వినండి.

88. జాతిచే నికృష్టుడుగా పరిగణింపబడేవాడైనా, వేదవాదియైన బ్రాహ్మణుడైనా;

89. నాలుక లేని (పలుకలేని) మూగవాడైనా;
90. ఎన్నో భగవంతుని శుభ నామాలున్నా (తిరు నామాలు), వాటిల్లో ఒక్క నామాన్నయినా, కనీసం ఒక్క రోజైనా
91. స్వస్థత చిక్కిన కాలంలోనైనా, కనీసం ఏ స్వప్నంలోనైనా,
92. ఆఖరుకు పరిహసిస్తూనైనా సరే (ఎగతాళి చేస్తూనైనా సరే), ఆ తిరునామాన్ని (గొప్ప భగవన్నామాన్ని) పలికితే జన్మతరించదా?
93. ఏ దిశలో (ఏ దిక్కులో) కూర్చున్నాసరే, తిరునామాన్ని నాలుకతో ఉచ్చరిస్తే చాలు.
94. పోనీ కనీసం ఒక్కరోజు - ఒకే ఒక్కరోజు తిరునామాన్ని చెవియొగ్గి విన్నాసరే
95. జన్మ సాఫల్యం కలిగి, వెంటనే బ్రహ్మ సాయుజ్యం లభిస్తుంది. కనుక తిరునామ మాహాత్మ్యాన్ని తెలుసుకోండి. (ఆఖరుకు మనం ఏ దిక్కులో కూర్చున్నా పరవాలేదు, సమస్త జీవులకు మ్రొక్కి, కనీసం తిరునామం విన్నాచాలు, ముక్తి లభిస్తుంది.
96. శ్రీధరాచార్యుడువివరించినది, బాదరాయణుడు తాను మరులుగొని, ముగ్ధుడై పలికినదీ ఇదే!
97. భగవద్గీత చెప్పేదీ ఇదే; వేదం మనకు బహూకరిస్తున్న విషయం కూడా ఇదే !
98. ఆమోదం (అంగీకారం) పొంది, ఈ తిరునామాన్ని ఆనందంతో ఉచ్చరిస్తూ బ్రహ్మంలో లీనం కండి!
99. ఓ మానవులారా! మీకు బుద్ధి ఉన్నదికదా! వున్నవారికి ఇంకేంకావాలి? తిరునామ మాహాత్మ్యం ఒక్కటే చాలు. దీనినే మదిలో నిలుపుకొండి చాలు.
100. ఇది తప్పో, ఒప్పో, నాకు తెలిసో, తెలియకో చెప్పాను. భగవానే కృష్ణా, గురువాయురప్పా, నన్ను క్షమించు.

శ్రీ కృష్ణార్పణమస్తు

సర్వభోగాలైనా, భిక్షాటనమైనా, లాభనష్టాలలో నైనా, సమాజ మధ్యంలో నైనా, ఏకాంతంగా, అడవిలోనైనా, కోరికలనబడే సుడిగుండాల బారినుండి, ముక్తుడైన యోగి, సదా, సమత్వ బుద్ధితో శాంతంగా జీవించగలడు. **(అష్టావక్రగీత)**


## జ్ఞానదర్శినికి రచనలు పంపవలసిన చిరునామా

డా. అక్కిరాజు రమాపతిరావు

**140B,** సంతోష్ నగర్ కాలనీ

సైదాబాద్, హైదరాబాదు **- 500 059.**

ఇంటి ఫోన్ నెం **: 239776**

*


## జ్ఞానదర్శిని

| విరాళాలు, సభ్యత్వం చందావివరాలు | రూ. |
|---|---|
| మహారాజపోషకులు | **15,000** |
| రాజపోషకులు | **10,000** |
| పోషకులు | **5,000** |
| ప్రవర్తకులు | **3,000** |
| ప్రోత్సాహకులు | **2,000** |
| జీవిత చందా | **500** |
| విడిప్రతి | **10/-** |
| సాలుచందా | **40/-** |

(విడిప్రతులు లభ్యంకావడం కష్టం)

# హిమవన్నగ యోగి పుంగవుడు

- పాల్‌బ్రంటన్

*(క్రిందటి సంచిక తరువాయి)*

[డా. పాల్ బ్రంటన్ 1898వ సంవత్సరం లండన్‌లో జన్మించాడు. ఆధునిక భారతదేశ ఆధ్యాత్మిక వైభవాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన ప్రముఖ పత్రికా రచయిత, ప్రతిభాశాలి, గ్రంథకర్త, బ్రంటన్. భారతదేశంలోని యోగులను, సిద్ధ పురుషులను, తపస్వులను, పరివ్రాజకులను ఆయన ఎందరినో దర్శించాడు. జిజ్ఞాసతో భారతీయ తపస్వితను, ఆధ్యాత్మిక యోగశక్తులను, ఆకళింపు చేసుకున్నాడు. అతీంద్రియ దివ్యమార్మిక శక్తులను నిగూఢయోగ మార్గావలంబులను, పరమ పవిత్ర ఆధ్యాత్మిక పీఠాధిపతులను గూర్చి తెలుసుకుందామని ఆసేతు శీతాచలం పర్యటనలు చేశాడు. హిమాలయాల సానుసీమల పరిభ్రమించాడు. హిమాలయాలలోనే శ్రీ స్వామి ప్రణవానంద మహరాజ్ (1896-1989)ను ఆయన దర్శించుకున్నారు. తన అనుభూతులను, భారతీయ యోగి పుంగవుల, సిద్ధ పురుషుల మహిమలను ఆయన గ్రంథస్థం చేశాడు. హెర్మిట్ ఇన్ ది హిమాలయాస్ (హిమవన్నగ యోగిపుంగవుడు) అనే గ్రంథంలో శ్రీ స్వామి ప్రణవానందతో తన సాన్నిహిత్య పరిచయాన్ని ఆయన నమోదు చేశాడు. ఇన్‌సెర్చ్ ఆఫ్ సీక్రెట్ ఇండియా (భారతదేశంలో రహస్యాన్వేషణ) ది మెసేజ్ ఆఫ్ అరుణాచల (అరుణాచల సందేశం) ది సీక్రెట్‌పాత్ (నిగూఢ పథం) ది ఇన్నర్ రియాలిటీ (ఆత్మతత్త్వం) ఎ సెర్చ్ ఇన్ సీక్రెట్ ఈజిప్ట్ (ఈజిప్టులో రహస్య అన్వేషణ) ది స్పిరుచువల్ క్రైసిస్ ఆఫ్ మాన్ (మానవ జీవిత ఆధ్యాత్మిక విషమావస్థ) మొదలైన ఆయన గ్రంథాలు చాలా ప్రాచుర్యం పొందాయి. హిమవన్నగ యోగి పుంగవుడు (హెర్మిట్ ఇన్ ది హిమాలయాస్) అనే గ్రంథంలో శ్రీ స్వామి ప్రణవానంద తమకు యోగ పట్టం ప్రసాదించి, పరివ్రాజక దీక్ష నిచ్చిన గురువర్యులు శ్రీ స్వామి జ్ఞానానందను గూర్చి బ్రంటన్‌కు వివరించడం పదవ అధ్యాయంలో ఉంది. ఈ భాగం అనువాదం ఇక్కడ పొందు పరుస్తున్నాము (సం.)]

టిబెటీయులకు అతడంటే ఇష్టం. లాసా ప్రధానమఠంలో అతడు ఉండదలచుకుంటే చాలు ఎప్పుడైనా అతడు ఉండవచ్చు అక్కడ. ఒకసారి టిబెట్ సందర్శనయాత్రానంతరం అతడు దిగ్విజయంగా అక్కడ నుంచి గొప్ప గ్రంథ సంచయాన్ని ఇండియాకు తీసుకొని రాగలిగాడు. అపురూపమైన తాళపత్రగ్రంథాలను మొత్తం ఒక పెద్ద గ్రంథభాండాగారానికి సరిపడేవాటిని, బౌద్ధులు జాగ్రత్త చేసిన సంస్కృత గ్రంథ సంపుటాలను, ఆయన ఎన్నిటినో తీసుకొనివచ్చాడు. వెయ్యేళ్ళుగా ఇండియాలో వీటి పొలకువ కనపడదు. వెయ్యేళ్ళ కిందటే ఇండియాలో ఆక్రమణదారులైన బౌద్ధమత విధ్వంసకులు, మతావేశపరులైన బ్రాహ్మణులు వీటిని రూపుమాపారు. టిబెట్ భాషలో అనూదితమైన ఆయా సంస్కృతమూలగ్రంథాలను భారత దేశంలో కనుమరుగైన వాటిని ఈ అనువాదాల సహాయంతో పునర్నిర్మించాలని ఆయన ఆశయం. ఈ విస్తారమైన గ్రంథ సంచయాన్ని, అత్యంతమూ విలువైన వీటిని ఇండియాకు తరలించడానికి 20 కంచరగాడిదలు అవసరమైనాయంటే ఆగ్రంథరాసి పరిమాణాన్ని అంచనావేయవచ్చు.

తన జన్మభూమి నుంచి బౌద్ధమతం ఇంచు మించుగా అంతరించి పోయింది. కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న ఆ జ్యోతి పూర్తిగా

ఆరిపోకుండా కాపాడాలని రాహుల్ ఆశయం.

ఒక మధ్యాహ్నం లోయలో పారుతున్న ఒక సెలయేటి పక్కన మేము కూచున్నప్పుడు యోగి ప్రణవానంద తమ గురుదేవులైన శ్రీ స్వామిజ్ఞానానంద ప్రస్తావన తీసుకొనివచ్చి ఇట్లా చెప్పారు.

ఆంధ్రప్రదేశంలోని ఒక శ్రీమంతుల కుటుంబానికి చెందినవారు మా సద్గురు దేవులు. మద్రాసు రాష్ట్రంలో ఉత్తరంగా తూర్పు సముద్ర ప్రాంతం వారి జన్మభూమి. పదిహేడేళ్ళ వయస్సున ఆయనకు స్వప్నంలో ఒక దివ్యాత్మ ప్రత్యక్షమై ఆయన్ను ఇల్లు విడిచిపెట్టవలసిందని కోరడం జరిగింది. అయితే ఆయన ఈ అభ్యర్థనను వెంటనే ఆమోదించలేదు. ఆయనలో ఒక ఘర్షణ ప్రారంభమైంది. అయితే మళ్ళీ రెండోసారి కూడా ఆయన స్వప్నంలో సాక్షాత్కరించి ఆ దివ్యాత్మ ఆయన్ను ఇల్లు విడిచిపెట్టవలసిందిగా పునః అర్థించింది. అయితే ఈసారి ఆయన మరింత తీవ్ర సంఘర్షణకు లోనైనారు. ఆ దివ్యాత్మ ఆదేశాలకు తల ఒగ్గటమా, ఇల్లాలును ఇల్లును త్యజించటమా అని ఆయన ఎటూ తేల్చుకోలేక పోయినారు. గృహపరిత్యాగం అంత సులభమనిపించలేదు. కుటుంబ బంధనాలన్నీ తెగతెంపులు చేసుకోవటానికాయన తటపటాయించాడు. అయితే ఆ దివ్యాత్మ ఆయనను వదిలి పెట్టలేదు. మళ్ళీ ఆయనను సమీపించింది. స్వప్నంలో ఆయనను స్పృశించింది. ఈ సారి ఆయనకు గృహపరిత్యాగానికి కావలసిన ధృఢమనస్కతను ఆ దివ్యాత్మ ఆయనకు ప్రసాదించింది.దీనితో ఆయన ఇల్లు విడిచిపెట్టారు. ఐహికబంధాలను విసర్జించారు. సత్యాన్వేషణలో ఇంటి నుంచి అంతర్థితులైనారు. ఉత్తర భారత దేశానికీ అటు తర్వాత పశ్చిమప్రాంతానికి నిజమైన గురువుకోసం వెళ్ళి అన్వేషించారు. తర్వాత ఆయన



తన గురువును కలుసుకున్నప్పుడు ఆయన గురుదేవులు "ఇప్పటికే నీవు ఆధ్యాత్మిక పరిపూర్ణతను సాధించావు ఆధ్యాత్మిక సిద్ధి నీ ఒడిలోనే ఉంది." అన్నారు. ఆ తరుణ వయస్కుడు అప్పటికే ఆధ్యాత్మికంగా ఎంతటి ఉన్నతిని సాధించగలిగాడో ఆ గురుదేవులు వెంటనే గ్రహించ గలిగారు. ఇందుకనుగుణంగానే పరమ పూజ్యులైన మా గురుదేవులు అచిరకాలంలోనే నిర్వికల్ప సమాధిని స్వాయత్తం చేసుకున్నారు. దీనితో ఆయన పూర్తిగా దివ్య పరివర్తన దశను పొందారు.

"అయితే మా గురుదేవులు తమ ఆత్మసాక్షాత్కారాన్ని పరిపూర్ణము సుదృఢమూ అవిచ్ఛిన్నమూగా నిలుపుకోవటానికి తెహ్రీ ప్రాంతానికి వచ్చి 1923లో గంగోత్రిలో ఒక నిర్జన ఏకాంత ప్రదేశంలో నివసించారు. అక్కడున్న రోజులలో ఆయన ఆధ్యాత్మిక పరిపూర్ణ దివ్యసిద్ధికి సంబంధించిన ఒక దృష్టాంతానుభవం ఆయనకు తటస్థపడింది.

ఒక మంచు పెద్దపులి ఆయన దారిలో ఎదురైంది. అది ఆయనకు ఎటువంటి హానితలపెట్టలేదు. ఆయన్ను చూస్తూ కాసేపు తన వెనక కాళ్ళపైకూర్చుండిపోయింది. తర్వాత సమీపారణ్యంలోకి అది కనుమరుగైపోయింది.

"ఆ పరిసరాలలోనే ఆయన ఒక శీతాకాలమంతా ఉండిపోయినారు. అటువంటి దుర్భరమైన శైత్యంలో ఏ ప్రాణీ అక్కడ ఉండటానికి సాహసం చెయ్యదు. ఆ మంచు పరమదుర్భరం. ఏడడుగుల ఎత్తున ఆ ప్రాంతాన్నంతా హిమం పేరుకుంటుంది. తుహిన వృష్టి తప్ప మరేమీ కన్పించదక్కడ. ఆ ప్రాంతాన్నంతా పూర్తిగా మంచు కప్పివేస్తుంది. పుండువంటి ఆ శీతాకాలంలో ఎటువంటి ఆహారమూ అక్కడ లభ్యం కాదు. అయితే తెహ్రీసంస్థాన అధికారులు ఆ ప్రాంతానికి సమీపంలో ఉన్న స్థానిక ఉద్యోగుల ద్వారా శ్రీ స్వామివారికి అప్పుడప్పుడు ఆహారపదార్థాలు సరఫరాచేయవలసిన ఏర్పాటు చేశారు. ఇవన్నీ అలా ఉంచండి. అత్యంతాశ్చర్యకరమైన విషయం ఏమంటే శ్రీ స్వామి జ్ఞానానంద ఇంచుమించు అక్కడ గడిపిన కాలమంతా పూర్తిగా దిగంబరంగానే ఉండటానికే స్థిర నిశ్చయంతో పూనుకొన్నారు. వారు ఒక సన్నని కౌపీనం మాత్రం ధరించి ఉండవచ్చు. శ్రీ స్వామి జ్ఞానానంద పూర్తిగా వివృతమైన ఒక గుహలో అక్కడ గడిపారు. ఆ కందరానికి ఎటువంటి తలుపులూ లేవు. ఆయన ఆ గుహలో గడిపినప్పుడు తన సమక్షంలో ఎటువంటి అగ్నికూడా నిలుపుకోలేదు. ఆ పరమ భయంకరమైన శీతల స్థితిలో వస్త్రరహితంగా ఎలా ఉండగలిగారు అని వారిని ప్రశ్నించినప్పుడు 'గంగోత్రిలో నా గుహముందు ఒక శిలావేదిపై నేను ధ్యానమగ్నుణ్ణి కావడానికి కూచోగానే సమాధిలోకి వెళ్ళిపోయేవాణ్ణి. ఎటువంటి కష్టంలేకుండా ఆ శీతోష్ణ పరిస్థితి దుర్భర తీవ్రతకు నేను అలవాటుపడ్డాను. ఒకరోజున ఎందుకో హఠాత్తుగా పూర్తిగా అనాచ్ఛాదితంగా ఉండాలన్న తీవ్రమైన తలంపు నాలో ఉద్బుద్ధమైంది. ఇందుకు కారణం చెప్పలేను కాని నాలో అలాంటి ప్రేరణ మాత్రం కలిగింది. అంతరాంతరాలలో ఏదోశక్తి నన్నందుకు ఉన్ముఖుణ్ణి చేసింది. ఆశక్తీ భగవదావేశము (భగవన్నామ చింతన) ఆదుర్భర శైత్యాన్ని ఏమాత్రం పట్టించుకోకుండా చేశాయి. ఏ మాత్రం నేను లక్ష్యం చేయక పోవడానికి దోహదం చేశాయి. ఆ భయంకర వాతావరణ దృశ్యాన్ని ఊహించండి. ఒంటరిగా దుర్గమ నిర్జన భీతావహ వివిక్త ప్రాంతంలో నిరంతర హిమపాతం, ఘనీభవ హిమసాంద్రతలమధ్య, మధ్య మధ్య ఎత్తైన హిమగిరి శిఖరాల నుంచి హిమవాలుకా ప్రవాహాలు, మంచుదిబ్బలు అమిత వేగంతో విరుచుకొని పడుతూ ఆయనకు కప్పివేసే ప్రమాదకర అవకాశాల నడుమ వారు అక్కడ ఎలా ఉండగలిగారో ఊహించగలిగారా ఎవరైనా?!

ఆయనకు అక్కడ తోడు ఎవరు? నిశ్శబ్దహిమాలయ శిఖర పంక్తులే. కాకపోతే అక్కడ మనగలిగిన ఏ కొద్ది అడవి మృగాలో అటూ ఇటూపోతూ ఆయనకు సహచర్యం చేసి ఉండవచ్చు. కాకపోతే అక్కడ నివసించే పార్వతీయ జానపదులెవరైనా ఉంటే ఉండవచ్చు. అటువంటి ఆ జానపదులే ఆయనకు అప్పుడప్పుడు ఆహారాన్ని తెచ్చి ఇస్తుండేవారు. అటువంటి ఆ అమాయక కొండజాతి ప్రజలను స్వామిజీ గూర్చి ఇప్పుడు అడిగితే వాళ్ళు ఆ మహాత్మణ్ణి ఎంతగా ప్రేమించే వారో మనకు అర్థమవుతుంది. ఆ పార్వతీయుడు స్వామిజీ ప్రస్తావన వచ్చినప్పుడు ఆనందోద్విగ్న హృదయుడవుతాడు. అతడి కళ్ళు గొప్ప వెలుగుతో నిండుతాయి. ఆయన్ను గూర్చి వారు చెప్పటానికి యత్నించగానే ప్రఫుల్ల హృదయులవుతారు వాళ్ళు"

హఠాత్తుగా ప్రణవానంద మాటలు ఆపేశారు. ఆయన నయనాలు అర్ధనిమీలితాలైనాయి. ఉచ్ఛ్వాసనిశ్వాసాలు స్తంభించిపోయి నట్లైంది ఆయన వాలకం. ఊపిరి పీల్చటానికి బాధపడుతున్నట్లుగా అయింది. ఆయనకు మూర్ఛ సంభవిస్తుందేమో ననిపించింది నాకు. అయితే ఇంతలోనే అయన కుదుటపడుతూనే నెమ్మదిగా అతీంద్రియ స్థితిలోకి, ధ్యానసమాధిలోకి వెళ్ళిపోయారు. ఆయన ఆకృతి స్థిరంగా, పావన గంభీరంగా ఉండిపోయింది. ఆయన నెమ్మదిగా నిశ్శబ్దంగా శ్వాసిస్తున్న భంగిమను వ్యక్తం చేస్తూ ఆయన భుజాలు మాత్రం కొంచెం పైకి కిందికీ కదులుతున్నాయి.

ఇంతలో ఆవాతావరణంలో ఆ సమక్షంలో ఏదో గొప్ప మార్పు సంభవించనున్నట్లుగా నాకు తోచింది. ఆ ప్రశాంత గంభీర దివ్యప్రగాఢ నిశ్చల సమక్షంలో ఏదో ఉన్నత చైతన్య భూమిక ఆవరించడమో లేదా ఏ దివ్య తత్త్వమో అక్కడికి అవతరించడమో జరగబోతున్నదని నాకు అనిపించింది. ఏదో అతి ముఖ్యమైన సన్నివేశం అనుభూత మవుతున్నట్లు నాకు స్పష్టంగా గోచరమైంది. నేను యోగికి అభిముఖుణ్ణి కావటానికి ఆయనవైపునకు సగం వోరగా తిరిగి కూర్చున్నాను. ధ్యాన ముద్రలో నేల మీదనే కాళ్ళు ముడిచి మనస్సును సమాయత్తం చేశాను రాబోయే సాక్షాత్కార సన్నివేశంకోసం.

నా మనో నేత్రం ముందు, అంతర్ముఖ వీక్షణం ఎట్ట ఎదుట, దూరదృష్టి ప్రసాదించే యోగశక్తి ఏదో ప్రసాదితమైనట్లు అనిపించే ఆ క్షణంలో ఒక స్పష్టాకృతి నాకు సాక్షాత్కరించింది. మెరుపు మెరిసినట్లు. ఆ ఆకృతి కండ్లజోడు ధరించి, వస్త్రాచ్ఛాదనరహితంగా, కొట్టవచ్చినట్లు విశాలమైన నాసికతోనాకు కానవచ్చింది. ఆపేక్షను కనపరిచే మందహాసం ఆయన పెదవులపై లాస్యం చేస్తున్నది. కరుణాపూరితమైన కటాక్షం నాపై ప్రసాదింపజేసి వెంటనే ఒక సందేశం -

నాకు అర్థమైంది.

ఆయన స్వామి జ్ఞానానంద. అటువంటి మహాత్ములకు అదిసాధ్యమే - ఆయన తన మనస్సును, తన ఆత్మను, తన తైజస దేహాన్ని - మీరు ఏ పేరుతో నైనా పిలవండి నాకభ్యంతరం లేదు - అటువంటి గొప్ప దివ్యశక్తితో, ఆస్థాయి మహాత్ములకు అది అసాధ్యమేమీకాదు- ఆయన తన శిష్యుడికి సంక్రమింపజేశారు. - ఆయనను పూర్తిగా ఆవరించారు. ఆక్షణంలో వాళ్ళిద్దరూ ఆధ్యాత్మికంగా అభిన్నులు, వారి హృదయాలు ఏకస్థానీయ సమ్మిళితాలు. ఈ విధమైన స్వీయరూప అన్యమూర్తిత్వ ఆవాహన ప్రపంచాన్ని తికమక పెట్టవచ్చునేమోగాని కొంచెం తరతమ భావంతో ఏసు అన్న 'నేనూ నా తండ్రీ అభిన్నులం' అనే భావంతో సంవదింపచేయవచ్చు. శిష్యత్వం యొక్క పరమార్థం ఇదే. ఆంతర్య రహస్యం ఇదే. హిందూ యోగసంప్రదాయం శిష్యుణ్ణి గురువుగారికి స్వాత్మార్పణం చేసుకోవలసిందని ఊరికే బోధించలేదు. అదే అన్నిటికన్నా ప్రధానమైన అంశం అని నిబంధించలేదు. అయితే వివేకం లేని వాళ్ళు దీనిని సరిగ్గా అర్థం చేసుకోలేక

పోయినారు. స్వప్రయోజన పరతంత్రులైనారు. నిజమైన ఆచార్యుడు తన శిష్యుడు తన కన్న వేరు కాదు అని గ్రహించగలగాలి అని వాంఛిస్తాడే తప్ప భౌతికమైన వస్తువాహన సమర్పణను వాంఛించడు. ఈ రెండోది కేవలం అపహాస్య పాత్రం. మొదటిది చక్కటి రాజమార్గం. గురు శిష్యుల హృదయైక్యతకు దగ్గరిదారి.

ఒక్క అరగంటవరకు మేమిద్దరం నిశ్చల నిశ్శబ్దంలో కూరుకొని పోయినాము. గురు ఛాయాక్రాంతుడైన ఆ శిష్యుడూ నేనున్నూ. ఆ వాతావరణంలో తరంగిత మవుతున్న శక్తి ప్రసారంతో పూర్తిగా ప్రభావితుణ్ణి కావటానికి నేను ఆయత్తమైనాను. ఎటువంటి మాటా పలుకూ లేకుండా గురుదేవులు నాతో భాషిస్తున్నారు. ఆ సందేశాన్ని నా శక్తి కొద్దీ ఎంతో శ్రద్ధగా స్వార్పణ బుద్ధితో నేను స్వీకరిస్తున్నాను. బాహ్య ప్రపంచానికి ఇదేమీ గోచరంకాదు. వాళ్ళకు కనపడేది ఇద్దరు వ్యక్తులు ఎదురెదురుగా నిశ్చలంగా నిశ్శబ్దంగా కూచోవడమే. అయితే ఆ ఇద్దరిలో ఒకరు ఇంచుమించుగా నిమాలితాక్షుడు కాగా ఇంకొకరు కళ్ళు పూర్తిగా తెరచి చూస్తున్నారు. అయితే అక్కడ ఒక ఉదాత్తమైన వాతావరణం నెలకొని ఉంది. అది తాత్కాలికంగా అతి సామాన్యమైన వ్యక్తిత్వాన్ని అధిగమింపజేసి నన్ను ఉన్నత భూమికలకు చేర్చింది.

ఇలా కొంతకాలం గడిచిన తర్వాత చివరకు నా స్నేహితుడు తన మామూలు స్థితికి చేరుకున్నాడు. తన తలను తిప్పి జేబుగుడ్డతో తన కళ్ళను తుడుచుకున్నాడు. మేమిద్దరం ఇప్పుడు ఎదురు బదురుగా కూర్చుని లేకపోయినా నిశ్శబ్దంగానే ఉండిపోయినాము. ఆ తర్వాత కొంత సేపటికి మేము లేచి ఆ లోయదారిన నడుస్తున్నప్పుడు మేము ఇతర విషయాలను గూర్చి మాట్లాడుకున్నాము కాని అంతకు ముందు మేము పొందిన ఆ అనుభూతి ప్రస్తావన తేలేదు. అది చర్చించవలసిన విషయం కాదు. మాటలకు అందేదీ కాదు, కాబట్టి మాటలలోకి తేకుండా దానంతట అదే కరిగిపోనీ అని వదిలేశాం.

బంగళాకు చేరిన తర్వాత నా స్నేహితుడు నాకు వినిపించిన తన గురుదేవుల సంక్షిప్త జీవిత రేఖాచిత్రణ గూర్చి తలపోశాను. గంగోత్రిలో ధ్యాన నిమగ్నుడైన ఆ మహానుభావుడి రూపం నా మనస్సులో చిత్రించుకున్నాను. ఒక హిమ శిలాఫలకం పై బహుశా ఒక కృష్ణాజినాన్ని పరిచి ఆయన దానిపై కూచుని తపస్సు సాగించి ఉంటారు. ఆయన చుట్టూ మంచు పడుతూ ఉంటుంది. ఆయన్ను అది సగం కప్పివేసికూడా ఉంటుంది. టిబెట్ కనుమగుండా శరీరాన్ని తూట్లుపొడిచే శీత పవనాలు చెలరేగి ఆయనచుట్టూ హోరెత్తుతూ ఉంటాయి. శరీరం కొంగరులు పోయే ఆ నిర్జన ప్రదేశంలో ఏకాంత తపో ధ్యాన నిరతుడై ఆ భయంకర జీవిత పరిస్థితిని ఆయన ఎట్లా తట్టుకోగలిగారో!

పరమ దుర్భరమైన ఆ హిమాలయ శీత రుతువును పూర్తిగా ఆయన ఏ విధంగా భరించగలిగారో! అదిన్నీ గంగోత్రివంటి అతి ఎత్తైన ఆ శైలస్థలిలో. దేవాలయ మట్టానికి ఆ గంగోత్రి స్థానం ఇంకా పదకొండువేల అడుగుల ఎత్తున ఉంటుంది. ఈ ప్రదేశానికి అభిముఖంగా ఇరవై వేల అడుగుల ఎత్తున ఉండే హిమాచ్ఛాదిత శైల శిఖరి ఉంటుంది. ఆయన అక్కడ అంతకాలం ఎలా జీవింపగలిగారు! అదిన్నీ వస్త్రాచ్ఛాదన రహితంగా, దిగంబరంగా, అగ్ని సమక్షం లేకుండా! తనకుతానై విధించుకున్న ఈ కఠిన పరీక్షనుంచి క్షేమంగా సుఖంగా ఆయన ఎట్లా బయటపడ గలిగారో!*

* తెహ్రీ సంస్థానపు వైద్యాధికారి డా. డి.ఎన్. నయోత్యాల్ ఎమ్.బి.బి.ఎస్., శ్రీ స్వామిజ్ఞానానంద తపోదీక్షనుంచి తిరిగి వచ్చిన తర్వాత ఆయనను వైద్య పరీక్షలకు గురిచేసారు. సాధారణమైన మానవ నాడీచలనం కంటె శ్రీ స్వామి జ్ఞానానంద నాడీచలనం స్థిరంగా నియతంగా 30 డిగ్రీలకు తక్కువగా పనిచేయడానికి అలవాటు పడిపోయినట్లు ఆయన కనుక్కున్నారు. ఈ విషయం సంస్థాన ఉద్యోగి ఒకరు నాకు తెలిపారు.

మానవ శరీరం కొన్ని ప్రకృతి నియమాలకు అనుగుణంగా మనగలుగుతుంది. ఇంకొకరెవరైనా వ్యక్తి పూర్తి దిగంబరంగా అటువంటి వాతావరణంలో మనుగడసాగించదలచి ఉంటే ఎప్పుడో, నామరూపాలు లేకుండా నశించి ఉండేవాడు. అయితే స్వామి జ్ఞానానంద కేవలం అతిసునాయసంగా సులభంగా తన ఇచ్ఛామాత్రం చేత ఈ ప్రకృతినియమాలను త్రోసిరాజనగలిగారు.

దీనికి హేతువేమని వివరించగలం?

ఇందులో కొంత ఒక వివరణ నాకు స్ఫురిస్తున్నది. నేను ఇదివరలో చూడగలిగిన ప్రాచీన హిందూ గ్రంథాలు రెండింటి ద్వారానూ, బుద్ధగయలో కొన్ని సంవత్సరాల క్రితం నాకు తటస్థపడిన టిబెటీయుడైన ఒక తపస్వి నాకు చెప్పిన దానిని బట్టీ నాకొక సమాధానం తడుతున్నది.

పైన పేర్కొన్న పుస్తకాలలో ఒకటి హఠయోగ ప్రదీపిక. ఇది సంస్కృత గ్రంథం. శరీరాన్ని తమ చెప్పు చేతలలో పెట్టుకొనేవారు అభ్యసించే పాఠ్యపుస్తకం ఇది. చాలా కఠినమైన, శ్రమసాధ్యమైన శరీర నియంత్రణను ఇది విధిస్తుంది. చిత్తనిరోధం, కఠినాతికఠినమైన మనో నిగ్రహం దీనికవసరం. ఇటువంటి నియమాలను తు.చ. తప్పకుండా పాటించినవారికి ఎటువంటి వాతావరణాన్నైనా నిగ్రహించగలిగిన శక్తి సామర్థ్యాలు సమకూడుతాయని ఈ గ్రంథం భరోసా ఇస్తుంది. ఇక రెండో గ్రంథం విఖ్యాతమైన భగవద్గీత. యోగవేదాంత సమన్వయ సూత్ర సంపుటి ఈ గ్రంథం. ఈ గ్రంథం సాధకుణ్ణి మనస్సుని పూర్తిగా వశంలో ఉంచుకోవల్సిందిగా బోధిస్తుంది. ఇంద్రియాలను పూర్తిగా నిగ్రహించు కోవలసిందిగా చెబుతుంది. ఆ విధమైన మనోనిగ్రహానికి చిత్తాన్ని ఏకాగ్రం చేయాలని ఈ గ్రంథం చెపుతున్నది. "ద్వంద్వాతీతుడవుకా, శీతోష్ణాలను అధిగమించు" అని పలుకుతుంది.

